ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



31 8 5

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



మేకవ్యతం

—ఫొటో : కె. రామారావు, రాజమండ్రి.


త్వరలో వస్తోంది!
విశాలాంధ్రకు తెలుగులో మొదటి
పూర్తి పంచరంగుల
చిత్రం
మోడరన్ థియేటర్స్ వారి
అలీబాబా
40 దొంగలు
...గేవాకలర్‌లో...
దర్శకత్వం
T.R. సుందరం
B.A. B.Sc (LEEDS)
పూర్ణా రిలీజ్

విషయానుక్రమణిక

ముఖచిత్రం: బిమల్ రాయ్ ప్రొడక్షన్స్‌వారి "అమానత్" చిత్రంలో చాంద్ ఉస్మానీ.


సంవత్సర చందా		సంపుటము 48
రు. 12-0-0		సంచిక 52
విడిప్రతిక 4 అ.		31.8-55

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

మన్మథ అధిక భాద్రపద శుద్ధ త్రయోదశి బుధవారం



తంజావూరు బృహదీశ్వరాలయంలో నంది విగ్రహం.

ఫొటో : ఎస్. [illegible]

సీరియల్



జి. సి. రామకృష్ణ

'దేవుడున్నాడా, లేడా,' అని మాధవశాస్త్రి ఆలోచిస్తానే ఉన్నాడు.

ప్రతిమనిషికీ ఏదో ఒక ఆలోచన ఎప్పుడూ ఉంటుంది. అందరికీ ఏవో కొన్ని సందేహాలుంటాయి. ఆ సందేహాలు తీర్చుకోడానికి, ఎప్పుడూ ఆలోచిస్తూ కూచుంటే, జీవితం గడుస్తుందా? సందేహాలు, సందేహాలుగానే ఉంటాయి, కాలవాహినిమాత్రం, తన వేగంతో ప్రవహించి పోతూనే ఉంటుంది.

మాధవశాస్త్రి గారి తండ్రి కృష్ణశాస్త్రి గారు, మహాపండితులు. కృష్ణశాస్త్రిగారు దేవాలయంలో పురాణం చెపుతూంటే, వేలాదిప్రజలు భక్తితో విని ఆనందించేవారు. ఆయన గాత్రం మైలుదూరానికి కూడా ఖంగున విన్పిస్తూండేదని గ్రామస్థులు ఇప్పటికీ రచ్చబండమీద కూర్చొని చెప్పుకుంటూ ఉంటారు.

అటువంటి మహానుభావుడు, 'ఆస్తికుడు, కృష్ణశాస్త్రిగారు. ఆయన కుమారుడు మాధవశాస్త్రి గారికి, 'దేవుడున్నాడా లేడా' అని సందేహం వచ్చింది—

ఆసందేహం ఆయనకు రావడానికి ముఖ్యమైన కారణం - మాధవశాస్త్రిగారు, ఆ గ్రామంలోని దేవాలయ ధర్మకర్తగారి దగ్గర గుమాస్తా. ఆదేవాలయానికి, సాలుకు ఎనభై వేల రూపాయల ఆదాయం వచ్చే ఆస్తిపాస్తు లుండేవి. దైవకార్యాల నిమిత్తం అయినఖర్చులు రాసేవాడు, మాధవశాస్త్రిగారు.

జమాఖర్చులు రాసేటప్పుడు, మాధవశాస్త్రిగారి మనసులో దాగిఉన్న సందేహం 'నేనున్నా'నంటూ వచ్చేది. అంకెలు వ్రాయడానికి చేతులాడేవికావు, 'సత్యమే జయించును' అని మాధవశాస్త్రి చిన్నతనంలో వీధిబళ్లో చదువుకున్నాడు. కాని ఆయన తనచేత్తో రాసే అంకెలు అన్నీ అబద్ధాలే. ఆ అంకెలే జయిస్తున్నాయి. ఆఫీసర్లు ఆ అంకెలుచూచి సందేహం లేకుండా చేవ్రాళ్లు పెడ్తున్నారు.

ధర్మకర్తగారైన రామిరెడ్డిగారు, భగవంతుని సొమ్ము కుట్టగా కుటకాయిస్వాహా చేస్తున్న సంగతి మాధవశాస్త్రిగారికి బాగా తెలుసు. అందువల్లే ఆయనకు 'దేవుడున్నాడా లేడా' అనే సందేహం దినదినాభివృద్ధి చెందింది.

'శివుడిసొత్తుతిన్నవాళ్లు శిథిలమైపోతారు' అని అందరూ అంటారు; ధర్మకర్తగారి సంసారం, నిత్యకల్యాణం, పచ్చతోరణంగా ఉంది. గ్రామంలో ఆయనమాటకు ఎదురుచెప్పేవాళ్లే లేరు. తాసిల్దార్లు, కలెక్టర్లు, రామిరెడ్డిగారికి సలాములు కొడ్తుండేవారు. "అందరూ అనే ఆసామెతలో, ఏమైనా అర్థం ఉందా," అని ఆలోచించేవాడు మాధవశాస్త్రి.

సందేహంగానీ అనుమానంగానీ మనిషికి కలగకుండానే ఉండాలి. కలిగిందంటే, చీడపురుగులాగా తొల్చుకొని, సామాన్యంగా వదలదు.

ఒకనాడుఉదయం, మాధవశాస్త్రి సంధ్య వార్చుకుంటున్నాడు -

ప్రభాకరుని కిరణజ్వాలల్లో ప్రకృతి శోభాయమానంగా ప్రకాశిస్తున్నది. పట్టుచీర కట్టుకున్న కొత్తపెళ్లికూతురిలాగా ఆకాశం నిగనిగలతో మెరుస్తూఉంది -

మాధవశాస్త్రి సంధ్య ముగించి, కళ్లు తెరిచి లోకాన్ని చూచాడు. హృదయం ఎందుకో ,ఆనందంతో తలముకలయింది. తన్మయుడై సూర్యభగవానుణ్ణి చూశాడు. ఆ క్షణంలో మాత్రం మాధవశాస్త్రిగారి సందేహం అంతర్ధానమయింది. సూర్యనమస్కారాలుచేసి ఇంట్లోకి రాగానే మాధవశాస్త్రికి ఎంతో ఆశ్చర్యం కలిగింది - "ప్రతిరోజూ చీకటిని తరుముకుంటూ వస్తాడు సూర్యనారాయణుడు - మానవలోకానికి వెలుగునిస్తాడు - మళ్లీ లోకాన్ని అంధకారంలోనుంచి ఎక్కడికో వెళ్తాడు - రాత్రి కాగానే, నక్షత్రాలు లోకాన్ని చూచి కిలకిలా నవ్వుతుంటాయి - చందమామ, చల్లని వెన్నెలతో మనోహరంగా ప్రకాశిస్తాడు - ఏమిటివిచిత్రం! అంతర్నీ నడిపించే సర్వేశ్వరుడెవరో లేకుంటే, ప్రకృతి ఇంత విచిత్రంగా ఉంటుందా!" అనుకొని మాధవశాస్త్రి తనను తానే నిందించుకున్నాడు. "దేవుడున్నాడా, లేడా" అనే సందేహంతో సర్వకాల సర్వావస్థల్లో ఆలోచించడం, అజ్ఞానమేనని శాస్త్రిగారు నిర్ణయించుకున్నారు.

"ఏమండోయ్,... ఏమిటి అంత ఇదిగా ఆలోచిస్తున్నారు!" అని భార్య విమలమ్మ కాఫీ చల్లారబోస్తూ అడిగింది.

"ఏముంది? ఏమీలేదే!" అని, కాఫీ అందుకొని చిరునవ్వు నవ్వుతూ భార్యను చూచాడు మాధవశాస్త్రి. నిష్కల్మషమైన ఆమెచూపుల్లో ఏదో దివ్యతేజస్సు ప్రకాశిస్తోంది. ఆకళ్లల్లో అనురాగవర్షం కురుస్తోంది.

భర్త అలాగే చూసేసరికి, విమలమ్మ ఆశ్చర్యపడి, కిలకిలా నవ్వింది—

"ఎందుకే నవ్వుతున్నావ్?" అన్నాడు మాధవశాస్త్రి

"మీరెందుకు నన్ను అలాగే చూచారు?" అన్నది విమలమ్మ.

"నువ్వు చూస్తే, నేను చూచాను"

ఎవరో వాకిట కిలకిలా నవ్వేరు. మాధవశాస్త్రి వాకిటిలోకి వచ్చి చూచాడు - పూజారిగారింట్లో సేవకురాలు నిల్చొని కిలకిలా నవ్వుతూ ఉంది.

"ఏమిటే?" అన్నాడు శాస్త్రిగారు.

ఆమె నవ్వుతూనే, "అయ్యోర్ల, మాదవయ్యోర్ల, నిన్ను అమ్మగారు పిల్చిరమ్మన్నారు" అని వినయం నటిస్తూ చెప్పింది.

"ఎందుకట?" అన్నాడు శాస్త్రిగారు.

ఆమె జవాబు చెప్పకుండా, పమిట చెరగు అడ్డం పెట్టుకొని విరగబడి నవ్వింది.

విమలమ్మ చిరునవ్వు నవ్వి, "పాపం, దానికి మిమ్మల్ని చూస్తే, ఎక్కడలేని సిగ్గండీ!" అన్నది.

"నీకుగూడ" అన్నాడు మాధవశాస్త్రి.

"అయితే, నేనేమి అంత సిగ్గులేనిదాన్ననుకున్నారా?" అని విమలమ్మ గొల్లున నవ్వి, "ఒసే సుబ్బీ, మా అయ్యవార్ని పెళ్లి చేసుకోరాదూ? లక్షణంగా మా యింట్లోనే ఉండువుగాని." అన్నది.

"ఛీ. నోరుమూసుకో." అని విసుక్కున్నాడు మాధవశాస్త్రి. సుబ్బి విరగబడి నవ్వింది.

"సరే. అమ్మగారు ఎందుకో పిల్చిరమ్మన్నారట - వెళ్లిరండి" అన్నది విమలమ్మ.

"ఎందుకో, అనంటే, అదేమయినా జవాబు చెప్తూఉందేమో చూడు" అన్నాడు మాధవశాస్త్రి.

"ఏమోనమ్మా. నాతో చెప్పలేదు - భద్రయ్యపంతులుగోరుకూడా అక్కణ్ణే ఉండారు" అన్నది సుబ్బి.

"సరే. వస్తాపో" అని మాధవశాస్త్రి చొక్కా వేసుకోడానికి ఇంట్లో కెళ్లాడు.

శాస్త్రిగారు మల్లెపువ్వులాంటి పంచె, లాల్చీ, ధరించి, సరిగ పంచె వల్లెవాటు వేసుకొని, అద్దంఎదుట నిల్చున్నాడు. విమలమ్మ "ఉండండి, ఉండండి" అంటూ వచ్చి, తలకు చమురు రాచింది.

మాధవశాస్త్రి క్రాపు దువ్వుకుని, వెనుక పిలక ముడివేసుకొని, ధర్మకర్తగారింటికి వెళ్లాడు.

ధర్మకర్తగారి భార్య తల దువ్వుకుంటూ కుర్చీలో కూర్చొని ఉంది. దేవాలయం పూజారి వీరభద్రయ్యగారు అరుగుమీద ఆసీనులై ఉన్నారు. పూజారిగారి సేవకురాలు సుబ్బి ఎదురుగా నిల్చొని ఉంది. మాధవశాస్త్రిగారిని చూడగానే ధర్మకర్తగారిభార్య సావిత్రమ్మ కుర్చీలోనుండి లేచి నిల్చొని, చిరునవ్వుతో ఆహ్వానించింది.

"ఏం, వీరభద్రయ్యా. ఏమిటి సంగతి?" అన్నాడు మాధవశాస్త్రి.

"ఏమిటి స్వామీ, తమరికి తెలియనట్లే అడుగుతున్నారే!" అని పూజారి, సావిత్రమ్మను, శాస్త్రిగారిని, వరుసవరుసగా చూచి నవ్వేడు.

"భద్రయ్యా - బలే బాగుంది భద్రయ్యా - నాకు తెలిస్తే ఎందుకడుగుతాను?" అన్నాడు శాస్త్రి.

సావిత్రమ్మ చిరునవ్వునవ్వి, "కేపట్నుంచీ పండగనెలకదంట మాధవయ్యా. దేవుడి ప్రసాదానికి, బియ్యమ్మూ, సామానూ, కావొద్దూ - రెడ్డి నెల్లూర్నుండి, ఇంకా రాకపోయె - ప్రతిరోజూ ప్రసాదానికి కుంచెడుబియ్యం, యిరవైరూపాయల చిల్లర సామాను, కావాలంటున్నాడు భద్రయ్య" అన్నది.

"అంతేనా? రెడ్డిగారు నాతో చెప్పిపోయారులేమ్మా, ఆ సంగతి. సరేలే భద్రయ్యా. సాయంత్రం మీఇంటికి చేరుస్తాలే" అన్నాడు శాస్త్రి.

"ఇంకేమయితే! భద్రయ్య నన్నొచ్చి అడుగుతావుంటేనూ, రెడ్డి నాతో చెప్పలేదే, అని, నిన్ను పిలిపించాను అని సావిత్రమ్మ కుర్చీలో కూచొని, "భద్రయ్యా, అయినాగానీ, దేముడు కుంచెడుబియ్యపు పులుసన్నం తింటాడా స్వామీ" అని గొల్లున నవ్వింది.

"అదేమిటమ్మా, మీరుకూడ అట్లా అంటారే! భగవంతుని పరిహాసం చెయ్యడం నిప్పుతో చెలగాటం తల్లీ, మనం మనస్ఫూర్తిగా ఆ సర్వేశ్వరుడికి నైవేద్యం పెట్టి, ఆ ప్రసాదం తింటే, మన జన్మలు తరిస్తాయని మన పెద్దవాళ్లు చెప్పారు. శాస్త్రాల్లో రాశారు. తపో, జపో, ఇంతవరకు ఆ ఆచారం జరుగుతూనే ఉన్నదికదా,..." అని పూజారి ఇంకేదో చెప్పబోతున్నాడు.

"అయ్యో స్వామీ. నేను చదువురాని మొద్దును. నామాటలకేం గానయ్యా. అమ్మో! భగవంతుణ్ణి ఎగతాళిచేసేంతటిదాన్నా నేను?" అని సావిత్రమ్మ పశ్చాత్తాపం ప్రకటించింది.

"అబ్బబ్బ! నీవన్నమాటకు నేను చెప్పడం లేదమ్మా. అసలు కాలమే మారిపోయింది. నేను చిన్నవాణ్ణిగా ఉన్నప్పుడు, మాలవాడు, దేవాలయంఎదుట నడిచేవాడే కాదు. ఇప్పుడు చూడండి. మాలవాడితో మాట్లాడి బ్రాహ్మణుడు నిభాయించగలడా? మొన్న, మాదిగ వెంకట్రాముడు, బస్సులో నా పక్కన్నే కూచున్నాడు - శివశివ! నా ప్రాణం గిజగిజలాడిపోయింది. ఏం చేసేది? 'ఒరే కొంచెం జరిగి కూచోరా' అన్నాను. ఇహ వాడు నోరుపడేసుకున్నాడు అమ్మగారూ, నేనేంచెప్పేది! ఏమయ్యా స్వామీ, నేనుమాత్రం మనిషినిగానా, నీవొంట్లో ఉండేది, నెత్తురే, నా ఒంట్లో ఉండేదీ నెత్తురేగదా - అని. ఇంకెందుకు వాడిష్టమొచ్చినట్లు పేలాడు." అన్నాడు పూజారి.

పూజారిగారిమాటలకు సావిత్రమ్మ విరగబడి నవ్వి, "నిజం, స్వామీ! ఈకాలంలో అలబరిజనంతో మాట్లాడి మనం నెగ్గలేము." అన్నది.

మాధవశాస్త్రి చిరునవ్వు నవ్వుతూనే గాఢంగా ఆలోచిస్తున్నాడు. 'నీవొంట్లో ఉండేది నెత్తురే, నాఒంట్లో ఉండేది నెత్తురే' అని మాలవాడు పూజారిని అన్నమాటలు, మాధవశాస్త్రి మనసులో ఏదో సంఘర్షణ లేవదీశాయి.

"వస్తానమ్మా" అని వీరభద్రయ్య సెలవు తీసుకొని వెళ్లాడు. ఆయన వెంటనే సుబ్బి, వాణ్యంగా నడుస్తూ వెళ్లింది.

పూజారీ, సుబ్బీ వెళ్తుంటే, సావిత్రమ్మ వాళ్ళవైపే చూస్తూ కొంచెంసేపు నిల్చొని, ముసిముసి నవ్వులు నవ్వి, మాధవశాస్త్రిగారిని చూచి "అదికాదు మాధవయ్యా..." అని గొల్లున నవ్వింది.

ఆమె నవ్వు మాధవశాస్త్రిగారికి కొంత వెగటు కల్గించింది.

"ఏమిటమ్మా" అని బలవంతంగా చిరునవ్వు తెచ్చుకుని మాధవశాస్త్రి ఆమెను చూచాడు,

"నీకు కోపం రాకుండాఉంటే చెప్తా." అంది సావిత్రమ్మ.

"అయ్యో, నాకేం కోపం?" అన్నాడు మాధవయ్య.

"వీరభద్రయ్య, ముందు సుబ్బికి నైవేద్యం పెట్టకుండా, దేవుడికి నైవేద్యం పెడతాడా?" అని సావిత్రమ్మ నవ్వు ఆపుకోడానికోసం, పమిటచెరగు నోట్లో కుక్కుకుంది.

సావిత్రమ్మ అంతమాట అంటుందని మాధవశాస్త్రి కలలోగూడ అనుకోలేదు.

"ఆ పాపం అంతా ఆయనదేనమ్మా. మనదేమీ లేదు. దేవుడినైవేద్యానికనే మనం ఆయనకు కావాల్సినవన్నీ యిస్తున్నాం. ఆయన ముందు నైవేద్యం ఎవరికి పెడ్తున్నాడో మనం చూస్తున్నామా?" అన్నాడు.

"ఎట్టయితేఏంగాని, మాధవయ్యా,... సుబ్బిపని బలేదర్జాగా ఉంది...పాపం, భద్రయ్యభార్య నిన్న సాయంత్రం వచ్చి లబోదిబో మొత్తుకోనిపోయింది" అంది సావిత్రమ్మ.

మాధవశాస్త్రి ఆశ్చర్యంగా ముఖం చిట్లించి, "ఏమిటమ్మా సంగతి, ఎందుకని?" అన్నాడు.

"అయ్యో, మాధవయ్యా, ఎంత పిచ్చివాడివయ్యా. నువ్వీకాలపుమనిషివి కాదు. వీరభద్రయ్య సంగతి నీకింకా తెలీదన్నమాట."

మాధవశాస్త్రిగారికి ఏమీ తోచలేదు. "నాకేమీ తెలీదమ్మా" అన్నాడు.


సావిత్రమ్మ ఎందుకో కొంత సందేహించింది. కాని చెప్పకూడదనుకుంటూనే చెప్పేసింది "రోజూ, భార్యను చావగొడ్తాడట" అంది.

"ఎవరు?"

"భద్రయ్య"

"ఎందుకనమ్మా?"

"రోజూ, భద్రయ్య భార్యా, సు[illegible],



నవలా రచయిత

'శారద'

మంచీ చెడూ', 'అపస్వరాలు' నవలద్వారా 'శారద'గా ఆంధ్రవారపత్రిక పాఠకుల ఆదరాభిమానాలకు పాత్రులైన శ్రీ యస్. నటరాజన్ గారు తెనాలిలో 7-8-55 బుధవారం రాత్రి స్వర్గస్థులైనారని తెలియపరచడానికి చింతిస్తున్నాము. తమిళులైనప్పటికీ తెలుగు నేర్చి, హోటల్లో సెర్వరుగా పనిచేస్తూ జీవితంలో సకలకష్టాలకూ లోనై నప్పటికీ రచనావ్యాసంగంలో అమిత శ్రద్ధ, ప్రజ్ఞలు చూపగలిగిన శ్రీ నటరాజన్ గారి అకాల మృతికి సంతాపం ప్రకటిస్తున్నాము. —సం.

★ దావాగ్ని ★

ఏదో ఒకసాకుపెట్టి, జగడం వేసుకుంటారు. భద్రయ్య సుబ్బికి వత్తాసిగాపోయి భార్యను చావగొడ్తాడు" అంది సావిత్రమ్మ.

మాధవశాస్త్రి, ఆసంగతి ఆరోజువరకు వినలేదు. ఆయనకు అరికాలిమంట నెత్తికెక్కింది. పూజారిమీద విపరీతమైన కోపమొచ్చింది. సావిత్రమ్మ చెపుతూనే ఉంది.

"ఇంట్లో పనుండటం లేదు అనుకోవచ్చు. మొగుడూ పెళ్లామేగదా! పిల్లా, జెల్లా, వలుగురుంటే, పనిచేసేమనిషిని పెట్టుకోవచ్చు. సుబ్బిని నిలిపెయ్యమంటుంది, భార్య... ఆమాటమీదె యిప్పుడూ నాగులాడుకొనేది, భార్యను చావగొట్టేది! నాకూ నిన్నటిదాకా తెలవదు మాధవయ్యా; పాపం, నిన్న రాత్రే. భద్రయ్య భార్య వచ్చి చెప్పుకొని కళ్ళనీళ్ళు పెట్టుకొనిపోయింది." అన్నది సావిత్రమ్మ.

పూజారి ఎదట లేడుగాని, ఉంటే మాధవశాస్త్రి బాగా, చీవాట్లుపెట్టి ఆ దవడా ఈ దవడా వాయించేసేవాడే. అంత కోపం వచ్చింది మాధవయ్యకు - కాని, గుట్టుగా ఓర్చుకొని కూచున్నాడు.

సావిత్రమ్మ, నిలుపు నిదానం లేకుండా చెప్పుకోనిపోతూ ఉంది.

"మాధవయ్యా ఎందుకు, నువ్వు రెడ్డితో అన్నావులే! ఆయన నోటిదురుసుమనిషి. ఎప్పుడైనా సమయం వచ్చినప్పుడు. నేనే భద్రయ్యను పిల్చి చెప్తాలే - అయినా ఆ అయ్యోర్లకి అకెందుకోమో ? చేసే మొగనాళ్లు అందరూ పెళ్లాల్ని చావగొట్తున్నారా!" అని సావిత్రమ్మ, జుట్టు సవరించుకొని ముడి వేసుకుంటూ మాధవయ్యను చూచింది.

"అంతమనిషవయ్యాడా వీరభద్రయ్య! నాకింతదాకా తెలీదమ్మా" అని మాధవశాస్త్రి కోపం దాచిపెట్టుకుంటూ అన్నాడు.

సావిత్రమ్మ చిరునవ్వు నవ్వి, "ఎప్పుడైనా నువ్వే, వీరభద్రయ్యతో, అనుతే. ఎందుకు భద్రయ్యా. వృధాగా వూరంతా గోల అవుతాది, గుట్టుగా, బతికితే బాగుంటది, అని నువ్వే చెప్పావన్నా అనిమాత్రం మాధవయ్యా. నేను చెప్దామనుకున్నానుగానీ, మళ్లీ ఆడదాన్ని నేను మందలిస్తే, ఆయ నేమనుకుంటాడోనని ఊరుకున్నాను." అంది సావిత్రమ్మ.

ఇంతలోగా వంటమనిషి వచ్చి, "కూడుడికిందమ్మా.." అని చెప్పి నిల్చుంది.

సావిత్రమ్మ వంటమనిషిని చూచి, "కోడి సుల్లె లేవంటే?" అంది.

"నాలుగుండేయి" అంది వంటమనిషి.

"వండేరాదా ? మళ్లీ నన్నడగట మెందుకు?" అంది సావిత్రమ్మ.

మాధవయ్య కుర్చీలోనుండి లేచి నిల్చున్నాడు.

"ఏం మాధవయ్యా, కోడిపుల్లమాటెత్తేటప్పటికి లేచావే!" అని సావిత్రమ్మ, పకపకనవ్వి, మాధవయ్యా, నిజమనుకో అబద్ధమనుకో, ఒక్కసారి గనక బ్రాహ్మలు రుచి మరిగినారంటే యింక వదిలిపెట్టరు— ఇయ్యాళ మా యింట్లో భోంచెయ్య స్వామీ" అని సావిత్రమ్మ, ఆయన ఏమంటాడోనని ఎదురుచూస్తూ నవ్వింది.

"రామ రామ వద్దమ్మా." అని మాధవశాస్త్రి కుర్చీలో కూచున్నాడు.

"స్వామీ, నువ్వేమన్నా అనుకో. ఈ కాలంలో బాపనోళ్ళందరూ, కోడిగుడ్లూ, మాంసమూ, చేపలతో కూడా తింటున్నారు. మా రెడ్డి చెప్పినాడు. దేవాలయాలమీద ఆఫీసరు బ్రాహ్మడట. ఆయనన్నీ తింటాడట." అంది సావిత్రమ్మ.

"అవునమ్మా నిజమే. ఆయన అన్నీ తింటాడు. అన్నిటికన్నా లంచం బాగా తింటాడు." అన్నాడు మాధవశాస్త్రి.

"బాగా చెప్పేవు ఈకాలంలో లంచం తినని ఉద్యోగస్థు లెవరుంటారులే మాధవయ్యా. అందరంతరే - పోనీలే ఆ సంగతెందుగ్గాని, ఇయ్యాళ మాయింట్లో కోడిగుడ్డు కూర కొంచెం రుచిచూడు" అన్నది సావిత్రమ్మ.

మాధవశాస్త్రికి భరింపరాని కోపం వచ్చింది. కాని, యజమానురాల్ని, ఏమనడానికీ ఆయనకు సాధ్యం కాలేదు. "పేదవాని కోపము పెదవికి చేటు' అని చిన్నతనంలో నేర్చుకున్న సామెత జ్ఞాపకానికొచ్చింది.

"జీవహింస బ్రాహ్మణులు చేయకూడదమ్మా."అని పొరపాటున అన్నాడు మాధవశాస్త్రి.

"మాధవయ్యా, నేను చదువురానిదాన్ని; నామాటకి నువ్వేమనుకోవద్దు గానీ, జీవహింస బాపనోళ్లు జేస్తే ఒకటీ, మాలోళ్లు చేస్తే ఒకటేనా? .. అది సరేగానీ, ఆవును పాలుపిండుకొని తాగటం జీవహింస కాదా? చెట్టునున్న కాయలు తుంచుకొని తినడం జీవహింసకాదా? మాధవయ్యా?" అని గలగలా మాట్లాడింది సావిత్రమ్మ.

మాధవశాస్త్రి నిర్విణ్ణుడైపోయి, ఆమె ముఖం చూచాడు ఆమె మనసులో అన్ని ఆలోచనలుంటాయని ఆయన ఎన్నడూ అనుకోలేదు.

"నిజమేనమ్మా...ఏమైనా ఆచారం వదిలిపెట్టాలంటే నాకు ఊపిరాడకున్నట్టుంది" అని మాధవశాస్త్రిగారు, బీరువాదగ్గరికి వెళ్లి జమాఖర్చు పుస్తకాలు బయటికి తీసి, ముందు వేసుకున్నాడు.

సావిత్రమ్మ వంటయింట్లోకి వెళ్లి "శేషమ్మా, ఒక లోటాడు ఆవుపాలు కాచి, మాధవయ్యకిచ్చి రా పో" అని ఆజ్ఞాపించి. మేడమీదికెళ్లింది

అయిదు నిముషాలయినతర్వాత, ఒక గ్లాసునిండా పాలుతీసుకొచ్చి, వంటమనిషి శేషమ్మ మాధవశాస్త్రి దగ్గర పెట్టింది.

"నేను ఇంట్లో కాఫీతాగి వచ్చాను" అని మెల్లగా అన్నాడు మాధవయ్య.

శేషమ్మ, ఆమాట వినిపించనట్లే గబగబా పాలు ఆయనముందు పెట్టి చక్కా పోయింది. మాధవయ్య నెమ్మదిగా పాలగ్లాసు చేతికి తీసుకున్నాడు. సావిత్రమ్మ మాట్లాడిన మాటలన్నీ వరుసగా జ్ఞాపకం వస్తున్నాయి. మాధవశాస్త్రి నిశ్చేష్టుడై కూచొని ఆలోచనలో పడ్డాడు. మేడమీదనుండి రేడియోసంగీతం దివ్యంగా వినిపించడం ప్రారంభించింది.

మాధవశాస్త్రికి లెక్కలు రాయడం సాగలేదు. గుట్టుగా లేచి యింటికి వెళ్లాడు.

(ఇంకా వుంది)

అలివేణి అఘాయిత్యం....

'అమృతపాణి'

ఈ మధ్య రెండుమూడు రోజులనుంచీ వరుసగా మధ్యాహ్నం భోజనం చెయ్యకపోవటమూ, అసలా చేసినా రెండు మెతుకులు కసికి జారుకోవడం, ఎటూగాని వేళ ఆకలేస్తోందనడం, తెల్లవారుజామునే లేచి వాంతులు చేసికోవడం, ఇవన్నీ చూస్తోంటే అలివేణి తల్లి సుగుణమ్మకి బెంగ పట్టిపోయింది. పెళ్ళికాని పిల్ల - ఇంకేమయినా వుందా?

ఇందుకు సాయంగా ఆవిడ లెక్క ప్రకారం సరిగ్గా రెండునెలల క్రితం తన చిన్నకొడుకు అమృతం తమ యింటికి వచ్చి నాలుగురోజులకి పైగా వున్నాడు. అమృతం దగ్గర అలివేణి సిగ్గుపడదని, అలివేణి దగ్గర అమృతం సిగ్గుపడడనీ, చిన్నప్పటినుంచీ అందరికీ తెలుసు. పైగా మొన్న వతడొచ్చినప్పుడు అలివేణి ఒక్కక్షణం కూడా విడవకుండా అతనితోనే పార్కులకని, సినిమాలకని, బీచిలకని, రెస్టారెంట్లకని తిరిగింది. అది ఇది ఇంగ్లీషులో మాట్లాడటం - తెగనవ్వడం ఇవన్నీ జ్ఞాపకం వచ్చాయి సుగుణమ్మకి.

సుగుణమ్మ ఇన్ని ఆధారాలు తీసికొని మరి అలివేణికి నెల తప్పిందన్న నిశ్చయానికొచ్చింది. ఏది ఎలా వొచ్చీ పిల్ల గర్భిణీ నిజమవుతే? పెళ్ళికానిది. ఎవరన్నా ఇంట్లోకి రానిస్తారా? పచ్చి మంచినీళ్ళయినా గొంతుకుతాయా? అమృతానికీ అలివేణి ఎలాగూ రాసిపెట్టేవుంది. కాని ఆ దిక్కుమాలిన వొదినగారు కట్నందగ్గిర పేచీ తెస్తుందిగదా! ఎలాగయినా మూడువేల అయిదువందలయినా లేందే మావాడి పరువు నిలబడదంటుంది. అందులో అలివేణి గర్భిణీ విషయం తెలిస్తే ఇంకేమయినా వుంది! తాడిచెట్టు ఎక్కి కూర్చుంటుంది. సుగుణమ్మ హృదయంలో ఎంత దుమారం రేగిందో చెప్పలేం.

ఆయన కసలేమీ అక్కర్లేదు. పొద్దున్నే లేవగానే ఆ గణపతిదేవుడి పటానికి ఓమారు నమస్కారం చెయ్యడం; ఆ తర్వాత కాలకృత్యాలు తీర్చుకొని తొమ్మిదింటికల్లా విధిలోకి వెళ్ళిపోవడం, మళ్ళీ పన్నెండింటికి ఇంటికి రావటం. పోనీ వచ్చినప్పుడయినా అదీ ఇదీ మాట్లాడుకోవటం అంటూ వుంటుందా, అదీ లేదు - మౌనవ్రతంపట్టి ఆ రెండూ కతికేయటూ వెళ్ళిపోవడం, తిరిగి రాత్రి రావడం; భోజనం చేశాక మేను వాలుస్తూ త్రేనుస్తూ ఏమిటి సంగతులని అడగటం. అంతా అంటే అంటనట్టు, పట్టీపట్టనట్టు వుంటుంది వ్యవహారం.

ఆనాటి రాత్రి సుగుణమ్మ భర్తతోటి అలివేణి నెల తప్పిందన్న విషయాన్ని చూచాయగా తెలియచేసింది. అలా చెప్పగానే పిచ్చిగా ఒక నవ్వు నవ్వాడాయన. ఎంతో నిదర్శనగా చెబితేగాని ఆయన నమ్మడు; ఆయన స్వభావమే అంత. ఆయన దృక్పథంలో అలివేణి నిప్పులాంటి మనిషి. నిదానించి ఏపనయినా చేస్తుంది; అందరిలాంటిది కాదు. అంతవరకు వస్తేగాని ఈయనకి తెలియదు అనుకొంది సుగుణమ్మ. పెద్దకొడుకు రాముడికి విషయాన్నంతనీ విడమర్చి చెప్పింది; 'నువ్వు వెంటనే వెళ్ళి మావయ్యతోటి మాట్లాడి అమ్మాయి పెళ్ళి సంగతి కనుక్కోరా' అని కావలసినంత వరకూ వివరాలు చెప్పింది.

* * *

అలివేణి అనుకొంటోంది.

ఏమిటి! ఇంట్లోవాళ్ళంతా తన నింత యిదిగా చూస్తున్నారూ? ఆఖరికి అమ్మ కూడా అందరిలోనూ జేరిపోయింది. ఏమిటి వదినగారలు అట్లా తినవయిపు చూస్తూ, ఏవేవో గుసగుసలు చెప్పుకోవటం దేనికు? ఏదో కొత్తమనిషిని చూసినట్టు - ఏమిటా చూపులర్థం? తను రెంట్లోనూ పొరబాటుగా ప్రవర్తించలేదే? చదువా ఫస్టుగా సాగుతోంది. వేషమూ నిక్షేపంగా వుంది. ఇక ఇంట్లో పనా, తను ఎప్పటిలా తనకి వీలుకలిగినంతవరకూ చేస్తోనేవుంది. కాకపోతే ఈమధ్య అట్టే తిండి తినటంలేదు. అందుచేత నేమో!

పాపం అది - రాత్రి పదకొండూ పన్నెండు గంటలదాకా చదువుతూన్న ఫలితమో, లేక ఈమధ్యనే అలవాటు చేసుకొన్న పక్క ఫలితమో లేక ఈరెండూ కాక చిన్న వదినగారు వండి పారేస్తున్న ఉడికీ ఉడకని మెతుకుల ఫలితమో, ఉదయమే లేచేసరికి డోకువచ్చేస్తుంది. దాంతో ఆకలి విపరీతమై ఉదయం బంట్రోతువాడిచేత ఎవరూ చూడకుండా ఏవేవో ఫలహారాలు తెప్పించుకొని తింటోంది. ఇంకా ఆకలి తీరకపోతే డబ్బాలోంచి దోసెడు అటుకులూ, ఒక పెద్ద బెల్లంముక్కా, తెచ్చుకొని గదిలో కూర్చుని పది పదకొండు గంటలదాకా బొక్కుతూ కూర్చుంటుంది మధ్యమధ్యలో చదువుకుంటూ. తీరా మధ్యాహ్నభోజనానికి పిలిచేసరికి కడుపులో ఖాళీవుండదు. ఏదో చిరాకుగా కాస్త తిని లేచిపోవటం, వదినెలకీ అన్నలకీ, తమ్ముళ్ళకీ కూడా నోటినిండా సంగతయింది. తన వదినలు ముగ్గురూ పల్లెటూళ్ళనుండి ఊడిపడ్డారు. ఎంతసేపూ మోటుహాస్యం అందుకనే తనకు వాళ్ళంటే పడదు. తనకు వాళ్ళు మాట్లాడుకునే మాటలు అస్వాభావికంగానూ, కృత్రిమంగానూ కనిపిస్తాయి. మధ్యాహ్నం ఆవిధంగా పేరుకు భోజనం చేసి పక్కమీదకి పోయి వాల్తుంది. మరళా మూడూ ఆ ప్రాంతానికి మేలుకుంటుంది. అప్పటికి కడుపు కరకరలాడుతూ వుంటుంది. మళ్ళీ హోటలునుంచి ఏవేవో చిరుతిండ్లు తెప్పించుకొంటుంది; ఈరీతిగా అన్నం సాటిచెయ్యక తాను నీరసపడిపోతోంది. ఆ సంగతి తన మొహంలోనే ద్యోతకమవుతోంది.

కానీ ఈమాత్రందానికి అంతగా గుసగుస లెందుకు? నాన్నారు ఎన్నాళ్ళబట్టి సరిగా అన్నం తినటంలేదో ఎవరయినా చూశారా? దానిమీద ఎవరయినా గుసగుసలాడుకొన్నారా? అలాగే తన విషయంలోనూ ఊరుకుంటే ఏంపోయింది? తను సరిగా తిండి తిన్నా తినకపోయినా వీళ్ళకెందుకు? అంటే తను అన్నం సరిగా తినకపోవటంలో ఏదో ప్రత్యేకత కనిపించిందా వీళ్ళకి? లేక తాను హోటలునుంచి చిరుతిండ్లు తెప్పించుకొంటున్న సంగతి వీళ్ళకి బట్టబయలయిందా? తెలిస్తేమాత్రం తప్పేముంది? మరేమిటో వీళ్ళ వైనం?

* * *

అమ్మాయి తిండి ఈ రోజు మరీ అధ్వాన్నంగా వుంది. ఒక్క ఆధరవు అయినా ముట్టుకోలేదు. బలవంతపెట్టి మరీ తండ్రి పక్కన కూచోబెట్టింది — రెండు మెతుకులయినా తింటుందని. పాపం — సుగుణమ్మ ఎంత ఆవేదన పడుతోందో. అమ్మాయి పెళ్ళి సంగతి తలచుకొన్న కొలదీ ఆ తల్లి గాబరా పడిపోతోంది. మరి అలివేణి కూడా

★ అలివేణి అఘాయిత్యం ★

నిజానికి ఏపని చేసినా తొందరపడి చేయదు. ఎంతో నిదానిస్తుంది. అందులో ఇలాటి పెద్ద విషయంగూర్చి చాలా నిదానించే మనిషి గాని, దుందుడుకుగా పోయే వ్యవహారం గాదు. అయితే ఈపాడు మనుష్యులసంగతి చెప్పలేం. వాళ్ళ భాష్యాలకి క్షణంలో చపలత్వం సంప్రాప్తిస్తుంది. స్థిరత్వం అనేది చాలా అరుదుగా కనిపిస్తుంది. అందుచేతనే అలివేణి ఇటువంటి నీతిలేని పనికి ఉద్యమించి వుండవచ్చు. నిజానికి కాలేజీ చదువు ఎందరిలో ఎన్ని మార్పులు తెచ్చినా అలివేణిలో ఎటువంటి మార్పులూ తేలేకపోయింది. మరి ఈ విషయంలో ఎందుకు తొందరపడ్డదో! ఎందుకయినా మంచిది వేగంగా అచ్యుతంతో వివాహానికి స్థిరపరిచేస్తే పలుగురిలోనూ మాటపడే అవసరం వుండదు - సుగుణమ్మ అనుకొంది.

* * * *

ఇంటి పెద్దకోడలు కల్యాణి అనుకొంటోంది.

వేవిళ్ళదశ తను బాగా ఎరుగును. లోగడ తన అన్నగారి భార్యకు వేవిళ్ళప్పుడు ఆవిడకూడా అలివేణిలానే ప్రవర్తించింది. అలివేణిమాత్రం స్వర్గంలోంచి ఊడిపడిందా ఏమిటే, అందరిలాటి మనిషే. అంచేతనే అందరికీ వచ్చినదశ ఆవిడకూ వచ్చింది.

అయినా ఈ పట్నపువాళ్లు మరీ విడ్డూరాలకి పోతారు: పెళ్ళికాకముందే గర్భిణులు కావటం ఇక్కడ వింత కాదు కావోసు! అయినా ఆ మేనత్తకొడుకుతోటి అంతగా రాసుకుతిరగడమేమిటి! ఎంత చదువుకున్నదయితే మాత్రం - అంత సిగ్గు లేకపోవటమా?

అలివేణి గర్వానికి కూడా అడ్డూ ఆపూ లేదు. నిన్నగాక మొన్న తనూ, తోటికోడళ్లూ, అలివేణి డాబామీద నిల్చుని వచ్చే పోయే వాళ్ళని చూస్తోండగా ఏదో మాటల సందర్భంలో 'తనకి వేవిళ్లన్న సంగతి మనకి తెలియననుకొంటోంది వదినె.' అన్నది తాను. దానికి అలివేణి చీదరించుకొని వెళ్లిపోయింది. ఎందుకో అంత మిడిసిపాటు. ఎలాగా తమకు తెలిసిపోయింది అలివేణి బండారం. మాటవరసకి తను వూరావాడా చాటలేదు మా వదినగారికి వేవిళ్లు సుమాండీ అని! ఆ మాత్రం భయం ఉండక్కర్లా! తనమీద అంతగర్వమా? అలివేణి ప్రవర్తన చూసికూడా తనుగనుక తమాయించుకొంది. మరొకరయితే?

* * *

అయితే ఈ గుసగుసల సారాంశం ఇదన్నమాట! అసలింతటి నీచమయిన తలపు ఎవరికి కలిగింది చెప్మా? కలిగితే అమ్మకి లేకపోతే ఆ చీమ మిరపకాయ చిన్నవొదినెకి. ఈ చిన్న వొదిన వుండే, అమ్మమ్మ! దేవాంతకురాలు! ఆవలిస్తే పేగులు లెక్కపెట్టి కర్థష్టగా చెప్పగల ఘటం - అందుచేత చిన్నవొదినకే ఈ పాడు ఆలోచన కలిగివుండొచ్చు. తను వాంతిచేసికొని నీళ్ళతో కడిగేస్తుండగా మొట్టమొదటిసారిగా పసికట్టిందీ చిన్నవదినే! అప్పుడే అంది 'వదినగారికి వాంతులు వెళ్తున్నాయే' - అని. అప్పట్లో సమాధానం చెప్పటానికి తన కిష్టంలేకపోయింది; మారుమాటాడకుండా వెళ్ళిపోయింది తను - ఈ చీమ మిరపకాయకి సమాధానం చెప్పాల్సిన అగత్యం ఏమిపట్టిందీ అనుకుందేగానీ ఇలా అవుతుందని కలగన్నదా?

బలే బాగుంది! నేను గర్భిణినట - గోరంతలు కొండంతలని వూరికే అనలేదు పెద్దలు.. అయినా వీళ్ల అనుమానంగూడా సహేతుకంగానే కనిపిస్తోంది. అచ్యుతంబావ రెండునెలల క్రితం వొచ్చాడు. క్రిందటిమాటు ఆ వారంరోజులూ ఒక్క క్షణంగూడా విడవకుండా అచ్యుతంబావతోటి సరదాగా గడపటం నిజమే - కానీ తనుండే సరిహద్దుల్లో తనుంది. అతనుండే సరిహద్దుల్లో అతనున్నాడు. దాంతోనే ఈ పాడు నిర్ణయానికి వొచ్చేశారు గాబోలు. ఇంకా ఈ నెల నిండుకోడానికి రెండుమూడు రోజులున్నాయి. అటువంటప్పుడు తనెందుకు తొందరపడి నిజం చెప్పెయ్యాలి? జరిగిన రభస యేలానూ జరిగింది కనుక మరి గాభరాలో ముంచెత్తాలి ఈ రెండుమూడు రోజులలో. తనకి నెలతప్పినట్టు అనుమానపడే ఘడియలు ఇక చాలా తక్కువగానే మిగిలివున్నాయని తన ఇప్పటి విచారం! ఇంత తుపాను ఇంట్లో రేగుతున్నా ఒకరిని తప్పదారంట తీసుకెళ్దాం, ఒకరిని ఏడ్పిద్దాం అన్న గుణంమాత్రం పోలేదు. తన ప్రకృతి తనకే విచిత్రంగా తోస్తున్నది.

* * *

బ్రెయిన్‌లో రామం ఆలోచనలు రెయిన్ (*Rain*)లా సాగుతున్నాయ్ - చివరకి వేవిళ్లిప్పుడుగాని ఆడవాళ్లకి మెలకువ రాలేదు. తను తలపోస్తోనే వున్నాడు. కిందటిమాటు అచ్యుతంగాడు వున్న వారం రోజులలో వాళ్లిద్దరి కిలకిలలూ చూసి ఏదో గ్రంథం జరుగుతోందిరా బాబూ వీళ్ళిద్దరి మధ్యా అని. ఎవరితోటీ చెప్పలేదుగానీ ఓమాటు తెల్లవారుజామునే అలివేణి మేడమీదనుంచి వేగంగా దిగి పెరట్లో నూతిదగ్గర డోకుకోవటం - ఆ తర్వాత భయం భయంగా కంగారుగా కడిగెయ్యటమూ తనూ చూశాడు.

దానికేంగానీ అత్తయ్య దగ్గిర కథ చాలా తమాషాగా జరిగింది. తను వెళ్లాడు, అత్తయ్య అట్టే పోల్చేసింది తను వచ్చిన పని. అత్తయ్య కట్నం విషయంలో ఎంత లౌక్యం వుపయోగించింది! ఎవళ్ళోగానీ అచ్యుతానికి మూడువేల అయిదొందలు యిస్తామని వొచ్చేరుట! మేనరికం వొదులుకోవటం ఎందుకూ - పైగా పిల్లలిద్దరూ చిన్నతనంనుంచీ కలిసి మెలిసి తిరుగుతున్నారు, అని ఆపేసింది. తనకి మహా మండుకొచ్చింది. కోపంతో కస్సుమన్నాడు. వాళ్ళిద్దరూ అలా కలిసి తిరగబట్టే ఇలా కొంపమునిగింది. చెల్లెమ్మకి వేవిళ్లు—ఆ మధ్య మీ ప్రబుద్ధుడొచ్చి మాయింట్లో వారంరోజులు గడిపిన సంగతి నీకు జ్ఞాపకంవుందా అని తాను ప్రశ్నించేసరికి అత్తయ్య అచ్చంగా నిర్విణ్ణురాలయిపోయింది! దాంతో ఏమనుకుందో ఏమో : వెధవకట్నాలూ కానుకలూ విషయానికేం లే—మా వదినగారికివస్తేనేం, మా కొస్తేనేం వచ్చిన అగౌరవం అగౌరవమే అవుతుంది. మేం వారంరోజులలో వస్తున్నాం మీయింటికి సంగతి సందర్భాలు మాటాడుకోటానికి—ఈలోగా అలివేణిని ఎక్కడికీ విడిచిపెట్టక ఇంట్లోనే కాస్త ఉండనియ్యండి—అని తొందర తొందరగా చెప్పేసింది అత్తయ్య! మర్యాదస్తురాలు.

* * *

ఇంతకాదు ఎంత చెప్పినా ఆడవాళ్ళని నమ్మకూడదు. అందులో పట్నంలో కాలేజీ చదువులు మరిగిన లేడీస్‌ని. ఎంత విశ్వాసం లేనిది, అలివేణి! చిన్నతనంనుంచి ఆమెని తాను ఎంతగా కోరాడు! నీవు తప్ప అన్యురాలికి నా మనస్సులో స్థానంవుండదు; నేను నిన్ను మనసారా ప్రేమించాను గనుక నీవుగూడా నాకు తిరిగి అలాటి వాగ్దానమే చేయమని!—ఎన్నిసార్లు అలివేణి అలాటి వాగ్దానాలు చేయలేదు—అలాటిది ఏ పరపురుషుడి స్నేహమో కలిగించుకొని, నామీద ఆ భారం తోసెయ్యాలని చూస్తున్నది—ఎంత టక్కులు నటించేది ...కిందటిమాటు వెళ్లినప్పుడు తనతో రెండుగజాల దూరంనుంచే అన్నీ కులాసా కబుర్లూ చెప్పేదేగానీ దగ్గిరకి రానిచ్చిందా. తానెన్నిసార్లు అలివేణికి దగ్గరగా చేరాలని ప్రయత్నించినా విముఖంగా వేమూసిందిగానీ నవ్విందా. 'ఒకసారి చెబితే చాలదా?' అని చీదరించుకొనేదికూడాను. తన అలివేణి గొప్ప ఆదర్శ భారతనారి అని తను అప్పట్లో అనుకొన్నాడు. అదంతా ఏమయిందీ? గాలిలో కలిసిపోయింది గాబోలు. కానీ లోకం ఏమంటుంది? తాను విచ్చలవిడిగా అలివేణితో తిరిగిన ఫలితమే అని లోకం కండ్లు నిర్ధారణ చేస్తయ్. అందుకనేగా ఈ వివాహంవిషయంలో అందరూ అంత

తొందరపడటం. ఏమయినా సరే లోకాన్ని ఎదిరించాలి. అలివేణిని వివాహం చేసుకో కూడదు. అంగీకరిస్తే యేమవుతుంది, ఆశ్రయించిన తప్పితే? — అలివేణికి కలగబోయే పుత్రుడిని తను పెద్దకొడుకుకింద చూసుకోవాలి. ఎంతటి సహనంగల మానవుడికైనా యిది సాధ్యమవుతుందా? తను ఎవరితోనూ చెప్పకుండా బైరాగుల్లో కలిసిపోవాలి.

* * *

ఆ వేదనలు అనంతంగా వున్నా, కోపాలు పీపాలు మునిగేటట్టు వున్నా, హాస్యరసం మాత్రం ఎప్పటికప్పుడు ఉత్పత్తి అవుతోంది తనకి మాత్రం దీని అంతేమిటో మాస్తేగాని తనకి నెలఅయినట్లు చెప్పాలని లేదు. అచ్యుతం బావ ఉరుములు కురుస్తూ వస్తాడు క్రిందికి. వాళ్ళతో దెబ్బలాడుతాడు గాబోసు. కాని వాళ్ళతో దెబ్బలాడకుండానే వీధిలోకి వెళ్ళిపోయాడు.

మళ్లీ తిరిగి కొంతసేపటికి వచ్చాడు. అత్తయ్య ఏమేమో మాటాడుతోంది అమ్మతోటి. మధ్యమధ్యలో కల్యాణం ప్రసక్తికూడా రావడం అవుతోంది. ఇక వదినెల గుసగుసలకి అంతే లేదు.

అచ్యుతంబావ అంటున్నాడు "మీ యింటికి రోజూ ఎవడో వచ్చి ఒక అకార్యం చేసిపోతూవుంటే, మరో వ్యక్తి ఆ అకార్యంవలన కలిగిన ఫలమనుభవించడానికి సిద్ధంగా వుంటే తాళికట్టమని వీరు నన్ను ఏ మొహం పెట్టుకొని అడుగుతున్నారు?"

అచ్యుతం సంకుచిత భావానికి తనకు చాలా అసహ్యమేసింది. మెల్లిగా వెళ్ళి ఓ కుర్చీమీద కూర్చుని అంది అలివేణి "ఎవళ్ళనీ ఉద్ధరించటానికి ఎవళ్లూ ఏ పనీ చెయ్యనక్కర్లేదు. అందరూ మమ్మల్ని ఉద్ధరించటానికి వొచ్చినట్టు మాటాడేవారే. ఎవరిసంగతి ఎవరికి తెలియదు గనుక? ఏమండోయ్...చిన్న వొదినగారూ కొంచెం దూరంగా తొలగండి దాహమవుతోంది కాస్త మంచి నీళ్ళు యిస్తారూ — ఒరేయ్ తమ్ముడూ కాస్త చాప యిలా పడేయరా... ఆనక మేడమీదికి వెళ్ళి నా టేబిలుమీద పుస్తకాలు తే."

అందరూ విస్తుపోయారు. ఎంత సందిగ్ధావస్థలో పడేసింది! మూడు నాలుగు రోజులలో అందరికీ తెలిసిపోయింది డోకుల సంగతి. అత్తయ్య తిరిగి ప్లేటు ఫిరాయించి అంటోంది "ఎంతకయినా తెగువమ్మ వొదినా... నెల తప్పిందంటే మనం గాభరా పడిపోయి ముహూర్తం పెట్టించగానే యిలా తేల్చేసింది. ఎంత లౌక్యమో చూశావుట్రా అబ్బాయ్-మనం మనవూరికి పోయి మూడు నాలుగు రోజులలో కల్యాణం సంగతి తెలియపరుద్దాము ఎవరిచేతనయినా"

అలివేణి అంది "ఏమండోయ్ అత్తయ్యగారూ, మీ లౌక్యం సంగతి ఎవరికి తెలియదు గనుక? మళ్లీ ఎవళ్లచేతో చెప్పించడమెందుకు — మీకు కావలసిన మూడువేల అయిదొందలూ మా నాన్నగారు యివ్వలేకపోరు. మా యింటి ఆడపడుచుని నేనొక్కత్తినేగా..."

అచ్యుతం అలివేణి చెప్పింది వింటున్నాడు వంచిన తల యెత్తకుండా. ★

★ నిశ్చింత ★

కవికొండల వేంకటరావు

పూర్వం రెండవతరగతి బండీయే ఇప్పటి మొదటి తరగతి బండీ అని అనుకుంటూ రెండు గీతల్లోంచి ఒక గీత కొట్టెయ్యగా నిల్చివున్న ఒక గీతగల పరుపుల పెట్టె ఎక్కాడు సుందరరావు రైలు అసలు మెయిలు. అందులో ఇది పరుపుల పెట్టె! మంచి టిగ్గావుంది. పైనో మూడు "బెర్తులు", క్రిందో మూడు "బెర్తులు", రెండుమూడు "ఫానులు" ఆ వరుసనే "లైట్లు" ఒక మేజాబల్ల, బూడిద దులుపుకునే 'ట్రే'లు, అద్దం నీళ్లుగల "లావెటరీ"—వీటన్నిటితోటి ఆ పెట్టె ఏలావుంది? 'అప్సరస' మినహా స్వర్గతుల్యంగా వుంది. అప్సరస రావడానికి అది 'మేల్ రిసర్వు' అయినా అప్సరసలకన్న అందం వొలికించే బొమ్మలున్న 'మాగజీ'నులు ఇంగ్లీషువి తమిళానివి హిందీవి ఆ పెట్టెలో వున్నాయి! ఎలా వచ్చాయి అని మాగజీనులు అని అడుగుతారేమో! అది మెయిలు గాడీ! హౌరానుండి మదరాసుదాకా పోయేది! కూర్చున్న మనుష్యులు కూడా కలకత్తానుండి కొందరు వాల్తేరునుండి కొందరు ప్రయాణిస్తూ వున్నవాళ్ళు ఒకళ్ల భాష ఒకళ్ళకు రాదుగాని, ఒకళ్లకొకళ్లు అభిప్రాయాల్ని వెలిబుచ్చుకోవడంలో వెంబాటు లేనివాళ్ళు. వాళ్ళూ వాళ్ళూ ఎవో పనిమీదనె వెడుతూవున్నారు పోజారిపోతులు కారు మనంలాగ!

ఒకచోట ఒక స్టేషన్‌వద్ద 'మెయి'లాగింది ముందు బద్దీలమీద. 'లూప్' 'లైన్' బద్దీలమీద 'పస్సు' బండి ఆగింది. 'పస్సు' బండి కావల కాబోలు ఆ కుటుంబం కుటుంబం, కలిమి కలిగినవాళ్లే, అవసరాన్నిబట్టే ఆ తాపత్రయం పడ్డారు. ఆడా మగా పిల్లా జెల్లా, ఓ పదిమంది రైలుచెంబు, 'టార్చి' దేళ్ళతోసహా 'పస్సు'బండి క్రిందనుంచి దూకివచ్చి, ఈ మెయిల్గాడీ మొదటి తరగతి బండిలో పడ్డారు. ఆ వెనకాల రైలుకూలీలు సూట్కేసులు బెడ్డింగులు వాళ్లు వచ్చిపడ్డారు.

'పస్సు'బండి కదిలింది. మెయిలుబండి కదిలింది. ఒకటి ఒక వైపుకు, ఒకటి మరొక వైపునకు. అంతా ఆశ్చర్యపోయినారు. 'ఎంత మోసమైపోయిందేది! ఆ పస్సుబండి మరో నిమిషంముందు కదిలినా, మెయిలు ఎక్కడంలో కదిలినా' అని అంటూ!

ఆ ఎక్కిన కొత్తజనం మాత్రం, వాళ్ళు మళ్ళీ కలిగినవాళ్లు, 'కల్చర్' గలవాళ్లు, ఏమీ అనుకోవడంలేదు. వాళ్లు మెయిలుబండీ పొందిగ్గా ఎక్కి కూర్చున్నారు. ఈ ఖంగారంతా అంతక్రితం బండిలో ఉన్నవాళ్ళదే! ఈ ఆలోచన అంతా బండిలో అంతక్రితం ఉన్నవాళ్లదే!

'ఏమి?' అనగా బండిలో అంతక్రితం ఉన్నవాళ్ళ ఆశ్చర్యం చూసి, ఆఖరుకు కొత్తగా ఎక్కినవారిలో ఒకాయన అన్నాడు 'అది మాకు పరిపాటే! రైలుకూలీల ఎర్ర తలపాగా లిటూ అటూ తిరుగుతూన్నంతసేపూ ఏ బండీ కదలు, అటు 'పస్సు' కదలు! ఇటు మెయిలూ కదల్దు! గంట లెన్నికొట్టినా, జెండా లెన్ని వూపించినా, ఈలలెన్ని వేసినా!" అని.

'బాబా! మేమూ కాదు మా తలపాగాలు కాదు, ఇదంతా భగవంతుడి మాయ! మాయ కాకపోతే మరేంటి? మీరు ఎక్కే అంతసేపూ మెయిలు నిలబడ్డమేమిటి? నేను దిగేలో 'దిగొద్దు! బండీ కదుల్తూవుంది' అని గార్డుకొర అనడమేమిటి? యిద్దూరంగా వుంది నేటి పొద్దు! తమకు మా దొడ్డమ్మ రాజులు మజ్లో రెండణాలు ఇప్పించండి!' అన్నాడు ఒక కూలి బండిలో వుండిపోయి. 'నీ వెక్కడ దిగుతావు మరి?' అన్నాడు ప్రయాణీకుడు రెండణాలు వాని చేత పడేస్తూ, వాని వైపు చూస్తూ.

'అంతా భగవంతుడి మాయ చూస్తూ వుండండి! ఎక్కడ దిగుతానో!' అని అల్లా మెల్లిగా దిగాడు కూలీ! బండి వేగం తగ్గిందగా! సుందరరావు అన్నాడు 'ఇదంతా కూలీల్లోవుంది' అని తెలుగు భాషను. ఆ భాష రానివాళ్లు తలలు త్రిప్పారు. 'ఎవరిలో మాయ వుంటేం! మెయిలందుకున్నాం!' అన్నారు క్రొత్తప్రయాణికులు నిశ్చింతగా! ★



ముగ్ధమోహనమూర్తి - హాంపి —ఫొటో: తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి.

సంఘానికి వెన్నెముక!

"ఏయ్ పంతులూ, మా చిన్నోడు తెచ్చుకున్న కాగితం వూళ్లాక్కున్నావుటగా? వాసంగతి నీకు తెలీదల్లేవుంది. ఈ రాఘవులు పేరు చెబితే యీవూరు మొత్తానికే హడల్ తెలుసా? జాగ్రత్తగా వుండు" అంటూ ఒక బుగ్గమీసాల ఆసామీ రామారావుని చెఱువుగట్టుదగ్గిర బెదిరించి చక్కాపోయాడు, కిర్రుచెప్పులు చప్పుడు చేసుకుంటూ.

రామారావుకి ఆవూరు క్రొత్త. స్కూల్ ఫైనల్ పరీక్షలకు వాచరుగా పైవూరు నుండి వచ్చాడు. పరీక్షలు ఆనాటినుండి ప్రారంభం. పరీక్ష హాల్లోకి వస్తూనే రామారావు విద్యార్థులను వారివద్దవున్న అనవసరమైన కాగితాలుకాని, చదువుకుందుకు తెచ్చుకున్న పుస్తకాలుగాని అవతల పెట్టి రమ్మని హెచ్చరించాడు. అంతా వెళ్ళి ఆ విధంగా చేసి వచ్చారు. రామారావు వరస వరసకీ మధ్య తిరుగుతూ అంతా తమ తమ నంబర్లు సరిగ్గా వేస్తున్నారో లేదో, పొరపాటున పేరు రాస్తున్నారో అని ప్రతి విద్యార్థి దగ్గిరకీ వెళ్ళి చూస్తున్నాడు. వాచరు తనవద్దకు రాగానే చివర కూర్చున్న రమణారావు అనే విద్యార్థి ముఖం వెలవెలపోయినట్లైంది. అది గ్రహించి రామారావు అన్సరు బుక్కులోని పేజీలు అటూ యిటూ తిప్పి చూశాడు. ఆ కాగితాలమధ్య ఒక జానెడు చదరంగావున్న కాగితం విద్యార్థి యింటి దగ్గిర వ్రాసుకొని తెచ్చినది కనబడింది. అందులో రెండు పద్యాలు, నాలుగు ప్రశ్నలకి జవాబులు వున్నాయి. ఇంకా పరీక్షాపత్రం ఇవ్వలేదు. వ్రాయడం ప్రారంభిస్తేగాని రిపోర్టు అవసరంలేదు. అందుచేత ఆ కాగితం తీసుకుని అక్కడనుండి వెళ్ళిపోయాడు రామారావు. ఆ సాయంకాలం షికారుగా ఆ వూరు చివరి చెఱువుగట్టు వైపు వెళ్ళాడు. అక్కడే తటస్థపడ్డాడు రాఘవులు.

ఆరు అడుగుల యెత్తు. అంతకుతగ్గ లావు. కాటికరంగు ఛాయ. బుంగ ముఖం. నోరు కప్పివేసివున్న దుబ్బు మీసాలు. రోకలి వంటి చేతికర్ర నేలమీద టక్కుటక్కుమని అనిస్తూ వచ్చాడు రాఘవులు.

రామారావుకి ఆ వచ్చిన అతను రాఘవులనీ, తను పొద్దున్న కాగితం లాక్కున్న కుర్రవాని తండ్రి అనీ అతని మాటలవల్ల తెలిసింది. మొదట ఎవరో తనలాగే అటు వస్తున్నారనుకున్నాడు. కాని, తన యెదురుగా వచ్చి నిలబడి, గుర్రురుముతూ, కేకలు పెట్టేసరికి ఖంగారుపడిపోయాడు రామారావు. రాఘవులు జేవురించిన కళ్లు, ముఖం చూసేసరికి భయంకూడా వేసింది. రాఘవులు వెళ్ళిపోయిన కొంతసేపటివరకు తను యెక్కడ వున్నదీ తెలియలేదు. రాఘవులు కట్టుపొగరుబోతు అని తెలుసుకున్నాడు రామారావు.

రామారావుకి అసలు వుద్యోగమే క్రొత్త. ఉద్యోగంలో ప్రవేశించి అది రెండో సంవత్సరం. బాల్యంలో పాఠశాలలో నేర్చిన నీతులు అతనిలో నాటుకుపోయాయి. సత్యానికీ, న్యాయానికీ, ఋజువర్తనానికీ ఎక్కువ ప్రాముఖ్యత యిస్తాడు.

వేదుల మీనాక్షీదేవి

అవి కలవారికే వ్యక్తిత్వం అంటాడు. లంచగొండితనం, కాపీ చెయ్యడం అవినీతి అంటాడు; పాపం అంటాడు. పరీక్ష పోయినా మంచిదే అని ఆనందిస్తాడుగాని కాపీచేసి ప్యాసైనవాళ్ళని చూసి బాధపడతాడు. చీదరించుకుంటాడు. దానికితోడు తమ స్కూలు క్రొత్తభవనానికి ప్రారంభోత్సవం చెయ్యడానికి వచ్చిన విద్యామంత్రి ఉపన్యాసంలో ఉపాధ్యాయుల బాధ్యతలగురించి చెప్పిన మాటలు అతని ఆశయాలను యింకా బలపరిచాయి.

ఉపాధ్యాయుడు నిజంగా సంఘానికి వెన్నెముకవంటివాడు. వెన్నెముక బలంగా వుంటేనే శరీరం బలంగా వుంటుంది. దేశంలో వున్నటువంటి ఉన్నతోద్యోగుల నందర్నీ తయారుచేసిం దెవరు? ఉపాధ్యాయుడే! అట్టి ఉపాధ్యాయుడు ఆదర్శవాదిగా వుండాలి. ఎల్లప్పుడూ తన కిచ్చే జీతమెంత? తను చేసే పనియెంత? అనుకోరాదు ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుల ఆర్థికపరిస్థితి బాగుపరచేందుకు మాప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోంది. ఒకవేళ ఆర్థిక పరిస్థితులవలన జీతాలను పెంచలేకపోయినా ఉపాధ్యాయుడు నిరుత్సాహపడకూడదు. నేటిబాలలే రేపు దేశనాయకులు కాబోతారు. అట్టివారిని ఆదర్శప్రాయులుగా చేయడమే తమ లక్ష్యంగా పెట్టుకోవాలి. ఈవిధంగా ఉపాధ్యాయుడు గొప్ప దేశసేవకుడు కాబోతున్నాడు."

ఆనాడు మంత్రి ఉపన్యాసం ఇంకా రామారావు చెవుల్లో మ్రోగుతోంది. నిజమే! కాని, ఉపాధ్యాయుని నీతులు, అతని ఆశయాలూ ఎవరికి లెక్క? అందులో స్కూలుమేష్టరు మాట ఖాతరుచేసేవాళ్లెవరు? అందరికన్నా లోకువైనవాడు స్కూలుమేష్టరు! అందుకే "బ్రతుకు తెరువు లేకపోతే బడిపంతులు" అన్నారు.

విద్యార్థులు అల్లరిచేసినా పంతులుదే తప్పు. ఆ అల్లరి ఆయన చేసినట్లే. నోరు పెట్టుకుని అరిచి పాఠం చెబితే విద్యార్థులు వినక, అల్లరిచేసి, చివరికి ఫేలయితే ఆతప్పు మేష్టరిదే! రిజల్ట్సు సరిగాలేవని రిమార్కు! వార్నింగు! తమ పిల్లలు చదవలేదని గాని, చెడు సావాసాలవల్ల పాడైపోయి పరీక్షలో తప్పారని ఏ ఒక్క విద్యార్థి తల్లి గాని, తండ్రి గాని అనరే! మేష్టరు చెప్పకపోవడంవల్లనే పరీక్ష పోయిందని వారి విశ్వాసం. చదవకుండా పరీక్షకి వచ్చి కాపీ చేస్తుంటే కేవలం నిర్లక్ష్యంగా చూస్తూగా వున్న మేష్టరు చూడలేక పోతుంటే ఆ తప్పు మేష్టరిదే. పిరికిపోయేవాళ్లో నైనా, యిగురుపొగరువాళ్లైనా సరే "ఏమాలాగా యీ న్యాయం? కాపీ చేస్తే తప్పులేదు. పట్టుకుంటే తప్పట." అని చెప్పకుంటే పోనీ వారైనా సాగుమాటిని తెలియజేస్తూ ఒక్క మాట అయినా అంటారేమోనని ఆశపడితే అదీ శూన్యమే! "పోనీ నీ సామ్మేంపోయింది. కాపీ చేస్తుంటే పూరుకోలేకపోయావా?" అంటారు.

ఇక ఏ పరీక్షపత్రాలు దిద్దడమో వస్తే (ఎగ్జామినర్ షిప్) మార్కులకోసం సోర్స్ రాయ్స్ కార్డులో పూళ్లోని పెద్దలకొందరు అంతా మేష్టరు ఇంట్లోనే తయారు! బెదిరించి మార్కులు వేయించుకుందుకు అతని పై అధికారిద్వారనించి సిఫార్సువుత్తరం తీసుకువస్తారు. నీతి, నియమం, ధర్మం, న్యాయం మొదలైనవాటికి స్వస్తిచెప్పి వారి చేతిలో కీలుబొమ్మ కావలసిందే మేష్టరు! డబ్బు చూపించి భ్రమపెట్టేప్రయత్నం కూడా లేకపోలేదు. దీనికి ఉన్నతాశయాలుగల మేష్టరు లొంగడు. కాని, స్కూలు మేష్టరు కంత ఉన్నతాశయా లేమిటి? ధనాదాయం తక్కువగల ఉద్యోగుల కంతంత పెద్ద ఆశయాలుంటే సాగదు.

మేష్టరు మధ్యతరగతికి చెందినవాడు.

(48-వ పేజీ చూడండి)



ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ

రామారావు, వీర్రాజూ, చెరో సైకిలూ ఎక్కి ఉషారుగా బయలుదేరారు, గుళ్ళ సంతదగ్గర దొంగరాముణ్ణి కలుసుకోడానికి.

రామారావు పట్టపగ్గాలు లేకుండా ఉన్నాడు. "రాజూ! ఈసరయ్య దుకాణానికి పదరా ముందర. పెసరట్లు లగాయించి, మా సుబ్బుల్ని చూసి మరీ వెళ్దాం దుళ్లిసంతకి. అయిన ఆలస్యం ఎలాగా అయింది" అన్నాడు.

ఈసరయ్య హొటేలులో వేడి వేడి ఇడ్డెన్లూ, చెరో పెసరట్టూ ఆరగించి కర్తవ్యం ఆలోచించారు. ఈసరయ్య ఇచ్చే ఇండియా కాఫీ ఏడుస్తూ తాగారు. కిళ్ళీబిగించి సిగరెట్టు ముట్టించి శివాలయం వీధంట బయల్దేరారు.

సుబ్బలక్ష్మి ఇల్లు ఆ వీధిలోనే వుంది.

"అడుగోరా సుందరంగాడు. దొంగ వెధవ" అన్నాడు రామారావు.

అరుగుమీద సుబ్బులు తండ్రితో సుందరం మాట్లాడేస్తున్నాడు— తలా చేతులూ ఊపేసు తిప్పుకుంటూ. ఆయన ఎంతో ఆదరంతో సుందరం మాటలు విని తలవూపుతున్నాడు.

"వీడా నీపాలిటి విలన్?" అన్నాడు రాజా సాలోచనగా. రామారావు మాట్లాడలేదు. ఎదురుగా కాలవనుంచి మంచినీళ్ల బిందె దంకనేసుకుని, ఎడంచేత్తో ఎనిమిదేళ్ళపిల్ల చెయ్యిపట్టుకుని కబుర్లు చెబుతూ వయ్యారంగా వస్తోంది సుబ్బులు. పమిట పరికిణీకుచ్చెళ్లు పనిమంతురాలైన ఇల్లాలి చీరెకుమల్లె ఒకపక్కకి ఎత్తి కట్టింది. పసుపు-పచ్చగా ఉన్న ఆమె కోలముఖంలో సన్నటి, కళ్ళనలుపు, కొంచెం చెదిరిన కాటుకవల్ల కొట్టొచ్చినట్లు కనబడింది. పక్కన నడుస్తున్న చిన్నపిల్ల మూలంగా, ఆమెవిగ్రహం నిండుతనం ప్రస్ఫుటంగా కనబడింది. ఒంటిరాయి ముక్కుపుడకవల్ల పొడుగైన నాసిక మెరిసిపోతోంది. ఎర్రటి మెత్తటిపాదాలు, వాటిని చుట్టుకుని ఉన్న సన్నని వెండి పట్టాలు, వాటికి మూడంగుళాలపైగా అడవి గుర్రం మెడమీద జూలులాగ ఎగిరెగిరి పడుతున్న తెల్లపరికిణీ తాలూకు నల్లంచు చూస్తే రామారావుకి దేవతలూ వాళ్లూ జ్ఞాపకం వచ్చారు. శ్రావణలక్ష్మి ఆకారం కొద్దిగా స్ఫురించింది. పక్కనున్న పిల్లతో ఏదో మాట్లాడుతూ మందహాసం చేస్తున్న సుబ్బలక్ష్మి పది అడుగులదూరంలోకి రాగానే దేవుడు బొమ్మల్లో తలకాయచుట్టూ ఉండే పచ్చటిచక్రం వుంటుందేమోనని వెతకబుద్ధేసింది రామారావుకి. అమ్మాయిల్ని చూసీ చూడగానే నవ్వేసి ఈలవేసే రామారావుకి ఈసుబ్బులు ఎదట పడగానే అలాంటి వెకిలి ఆలోచనలు ఆమడ దూరానికి పోతాయి. కళ్లు, ఎడంవేపు గుండెకాయమినహా మిగతాశరీరం యావత్తూ మరణిస్తుంది. మెదడు గడ్డకట్టుకుపోతుంది.

అందుకనే సుబ్బులు నాన్న సుంద్రావా అరుగుమీద వున్నా లెక్కచెయ్యకుండా, ఆయింటి ఎదట నడిరోడ్డు మీద నిలబడిపోయాడు రామారావు. సుబ్బులు తలఎత్తి చూసింది. నవ్వింది. క్షణంలో సగం సేపులో రామారావునిండా దీపాలు వెలిగిపోయాయి. సుబ్బులు నీళ్లబిందెతో సహా ఇంట్లోకి వెళ్లిపోయింది.

"నిన్నేనోయ్ రామం! ఎక్కడికి బయల్దేరావ్?" అని మూడోసారి అడిగాడు సుబ్బులు తండ్రి జగన్నాథంగారు.

"ఆయ - అయ్..." అన్నాడు రామారావు.

"ఆయేమిటోయ్. ఆయా ఓయాను. మీ మావయ్య ఏం చేస్తున్నాడు?"

రామారావు అప్పటికి బాగా తేరుకున్నాడు. "మావయ్యాండి....ఉన్నాడు.. ఉన్నాడండి - షికార్లెళ్లాడు......అదే... ఆకరణం గారింటికి—వస్తానండి- గుళ్లిదాకా వెళ్లాలి" అంటూ సైకిలెక్కాడు రామారావు

★ ముళ్లపూడి వెంకటరమణ ★



సుబ్బులు తండ్రితో సుందరం మాట్లాడేస్తున్నాడు—తలా చేతులూ ఊహుఁ తిప్పకుంటూ. ఆయన ఎంతో ఆదరంతో సుందరం మాటలు విని తలఊపుతున్నాడు.

జగన్నాథంగారు మళ్ళీ సుందరంతో మాటలకు దిగారు.

ఊరుదాటాక రామారావన్నాడు "అబ్బ! వాడేరా. సుందరం. వాడికే ఈ సంబంధం చెయ్యాలని మావయ్య ప్రయత్నం"

"వాడికేం. విశ్వేషంలా ఉన్నాడు. దీపంవంటి కుర్రాడు."

"నేను కాదన్నానురా! ఘట్టుగా ఉన్నాడు. చదువుంది. డబ్బు అట్టేలేదు బుద్ధిమంతుడు. పైగా పాటలు రాస్తాడు. ఇంచుమించు నాఅంత అందంగా వుంటాడు. ఎటొచ్చేలోటు ఒక్కటే - పూర్తిగా నా అంత అందంగా ఉండకపోవడం."

"అందుకనే నువ్వు సీతని పెళ్ళాడు"

"ఒరేయ్! సైకిలు దిగరా"

"ఏం? కొడతావా?"

"దిగు చెప్తా - అదక్కడ పడేసి ఇలా కూర్చో—"

దోవ పక్కన మామిడిచెట్టు నీడని కూచుని ఇద్దరూ సిగరెట్లు ముట్టించారు.

"రాజా! ఇంక వేళాకోళం ఆడకురా - నాకు ఏడుపొస్తోంది" అన్నాడు రామారావు.

"ఏడవడం మాత్రం వద్దు. సంగతి చెప్పి మరీ ఏడు"

"సుబ్బుల్ని నేను సీరియస్‌గా ప్రేమించానురా. నిజంగా పెళ్లి చేసుకుంటా"

"నీ తలకాయి. నీకు లవ్వేమిట్రా నా బొంద. ఊరికో లవ్వు, వీధికో లవ్వు, రోజుకోలవ్వూనూ"

"రాజా. హాస్యం కాదురా. నీ మీద ఒట్టు ఈ సిగరెట్టుమీద ఒట్టు. ఈ సారి సెలవలకొచ్చాక సుబ్బుల్ని చూశాక గట్టిగా తెలిసొచ్చింది... ఇంత చిత్రమైన తియ్యటి బాధ ఎప్పుడూ లేదురా—ఇదే ప్రేమనుకుంటా!"

"రావుడూ! నాకు తెలుసురా—సుబ్బులిక్కూడా నువ్వంటే ఇష్టమే. కానీ—వీలుపాలూ కూడా కొంచెం ఆలోచించు. నీస్థితికీ, నీహోదాకూ తగినదాన్ని మీ మావ కుదిర్చాడు. పెద్ద వాళ్లు మాట లిచ్చుకున్నారు. సుందరాన్ని కూడా సుబ్బులికి స్థిరపరచారట. నేను వాణ్ణెపుడూ చూళ్లేదనుకో..."

"నేనుమాత్రం చూసేడిశానురా. వాల్తేరులో అపుడపుడు లాంగ్ పాటులో చూసే వాణ్ణి. బొత్తిగా ఇంత క్లోజప్‌లో చూడ్డం ఈ వూళ్లోనే. మావయ్యతో పోటీ చేస్తున్నాడే— బంగారయ్యగారు - ఆయనకి ఎక్కడో అమడదూరపు చుట్టంట తల్లి లేదు. మొన్ననే తండ్రి పోయాట్ట. అందుకని చదువు మానేశాడు. ఆస్తికూడా ఏమంతలేదు. ఆ మాటకొస్తే ఏం లేదు. బంగారయ్యగారు ఎన్నికలకోసం అని వాణ్ణి లాక్కొచ్చాడు. పనిలో పని, పెళ్లికి ఏర్పాటు చేస్తున్నాడు ఆయనకి కొడుకూ గట్రా లేరుగా."

"బాగుంది" అన్నాడు వీర్రాజు నిట్టూర్చి.

"ఏం బాగుంది? నీ తలకాయా నా తలకాయానూ"

"కథ ఇంతవరకొచ్చాక ఇంక ఎవరేం చెయ్యగల్రా—బాగుందనక"

"నోరు మూసుకోగలరు. నన్ను హేళన చెయ్యడం మానగలరు. స్నేహితులయితే సాయం చెయ్యగలరు."

"సరేలేరా. నోరుమూసుకుంటా. నువ్వు మాత్రం ఏం చేస్తావు చెప్పు"


"ఏలాగేనా కరణంగారికూతుర్ని తప్పించుకుని సుబ్బుల్ని చేసుకోవడమే, నా కిష్టం—సుబ్బులిష్టం. మాఅమ్మను ఒప్పించగలను. చిక్కంతా ఇంటిమొగదిక్కు తగాదే"

"అదే ఎలాగంట! అయినా మీ మావకి ఇంత పట్టుదలెందుకురా!"

"అదే తెలీదురా. ఆరా తీద్దాంలే. ఇంకోటిరోయ్. కరణంగారి కూతుర్ని నాకు కట్టడం కోసం ఎంత తిప్పలు పడుతున్నా

ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ

హో, కుబుల్ని సుందరాని కిప్పించడానికి ఇక్కడా అంత తిప్పలు పడుతున్నాడురా. దానికోసం జగన్నాథం గార్ని మాలీసు చేస్తున్నాడు. సుందరం - ఇంతవాడు అంత వాడంటున్నాడు. కరణంగారిచేత బంగా రంగయ్యకి చెప్పిస్తున్నాడు. ఏమిటోమరి."



"ఈ రామాయణంలో దొంగరాముడి పిడకల వేటేమిట్రా—వీళ్ళకి ఈ దోవ్యాగం ఇస్తానంటావ్— ఈ గోలేమిట్రా—" అన్నాడు వీర్రాజు లేస్తూ.

ఇద్దరూ సైకిళ్ళెక్కారు.

"నేను కలగన్నా నేమిటి దొంగలసంగతి. నిన్నరాత్రి తప్పించుకోడానికి ఏదో ఎత్తు వేశాను.—దరిమిలాను ఓ ఊహతట్టింది. వీళ్ళని మన పనిలో ఎక్కడో వాడుకో వచ్చని..."

"అందాకా పోషిస్తావా?"

"పోవ తేముంది? ఇప్పుడు వాళ్ళ సైకిలు వాళ్ళకిచ్చేస్తాం. ఆపైన చెరో ఐదూ బయానా ఇస్తాం ఎల్లుండి కనబడమందాం. ఎన్నికలు ఆదివారం నాడేగా?" —అరుగో రామన్నా భీమన్నా "ఔను —ఏమోయ్. కులాసావా? ఆలస్యం అయింది ఏమనుకోకండి" అన్నాడు క్షమాపణ చెపుతున్నట్టు.

* * * *

చదువరీ—ఈ కథకు రంగస్థలం ఒక చిన్నగ్రామం. జనాభా పిల్లామేకా కలిసి ఏడువందలు పైచిలుకు. మేకల్ని తీసేస్తే దాదాపు ఏడొందలు. ఇందులో పిల్లలు రెండొందల పాతిక. పెద్దలు నాలుగువందల అరవైఅయిదుమంది. మిగతా పది మందిలో కథాకాలం నాటికి పెళ్ళీడు ఆడపిల్లలు ఇద్దరు. పెళ్ళీడు హీరో అతని చెలికాడూ కాక మిగతా ఆరుగురూ పెద్దమనుషులు. వీళ్లుకాక కొత్తగా కాపరంవచ్చిన కుర్రవాడు సుందరంతో కలిసిమొత్తం జనాభా 701. అయినా శ్రీ ప్రభుత్వంవారు ఈ గ్రామస్థులు ఎన్ని మహజర్లు పెట్టుకున్నా పంచాయితీ ఏర్పాటు చేయించలేదు. శ్రీ ప్రభుత్వంవారు, త్వరలోనే ఏర్పాటు చేయిస్తామన్నారు— పంచాయితీయే కాదు-శాసనసభ—ఆమాటకొస్తే పార్లమెంటు, ఇంకా చెప్పాలంటే ఐక్యరాజ్యసమితికూడా ఇక్కడే స్థాపించవచ్చు. ఆ గ్రామంలో పార్టీలూ, కక్షలూ పుష్కలంగా ఉన్నాయి. అప్పుడప్పుడు ఒకటీ అరాతలలు బద్దలుకొట్టుకోనడంకద్దు. నాగరికత లేదనకుండా ఈసరయ్య ఊరిచివర కాఫీ హోటలు పెట్టాడు. ఊరిమధ్యలోనే పెట్టునుగాని మునసబుగారిల్లు దగ్గరవున్నందువల్ల కూడదు పొమ్మన్నాడు. కరణంగారే పట్టుబట్టి ఊరిచివరేనా పెట్టవయ్యా అని ప్రోత్సహించి ఈసరయ్య ప్రశంసలకు పాత్రుడయ్యాడు.

ఒక ఏకోపాధ్యాయ పాఠశాలఅంటే— పంతులుబడి ఉంది. లేహ్యాలూ, చూర్ణాలూ ఇచ్చే దేవరగారు కాకుండా, పోస్టుద్వారా ఉమాపతీ నేర్చుకున్న వైద్యుడు పోటీ వున్నాడు. మూడురోజుల కొకసారి టపా వస్తుంది. కొలవరేవుకి నెలకోసారి ఉప్పు దోనెవస్తుంది. రావినాయుడి గుర్రబ్బండి

రోజూ పట్నం వెళ్లొస్తూంటుంది. ఊళ్ళో ఐదు సైకిళ్లున్నాయి. శివాలయం వుంది. పూజారిగారికో పార్టీఉంది. మాటా మాటా వచ్చి జనం రెండుపార్టీలయితే బలాబలాలు తేల్చేది పూజారిగారే.

ఇటీవలగా ఊరు రాజకీయాలతో కుతకుత లాడడానికి ఒక అపూర్వసంఘటన జరిగింది. రామనాథంగారని, ఒక వయోవృద్ధు ఉండేవాడు. ఆయన రామభక్తుడు. రెండెకరాల పొలం వినా చుట్టపక్కాలెవరూ లేరు. కృష్ణారామాఅని కాలక్షేపంచేస్తూ, అప్పుడప్పుడు తీర్థయాత్రలకి వెళ్లొస్తూఉండేవాడు. ఒకసారి తిరుపతి వెళ్లొచ్చాడు. మర్నాడు కరణం మునసబులతో మాటామంతీఆడాడు. వారంరోజుల నాటికి ఉన్న రెండెకరాలూ పూరికొంపా అయినకాడికి తెగనమ్మేశాడు. మాగాణీ కాబట్టి నాలుగువేల పై చిలుకు పలికింది. అవటా ఓనాడు రచ్చబండదగ్గర పెద్దలు నలుగురినీ సమావేశపరచి తాను సన్యాసం పుచ్చుకుంటున్నట్టు చెప్పాడు. అంతా ముక్కుమీద వేలేసుకుని ఔరా! అన్నారు.

మీ రిప్పుడు పడుతున్న సంసార తాపత్రయం ఏముందండీ ఇది సన్యాసంకాదా! పెద్దలు మా మధ్యనే కాలం వెళ్లబుచ్చెయ్యండి అవటాఅని బ్రతిమాలారు. రామనాథంగారు మందహాసంచేసి తల అడ్డంగా తాటిస్తూ ససేమిరా అన్నారు.

"ఊళ్ళో నా పేర ఒక రామాలయం కట్టించండి అందుకయే డబ్బు ఇదిగో" అంటూ నాలుగువేలు పెద్దలసమక్షాన మునసబు కరణాలకి ఒప్పగించి ఆ పైచిలుకు చేత్తో పుచ్చుకుని రామేశ్వరం వెళ్లిపోయాడు పోతూపోతూ ఒక్కపనిచేశాడు. రామాలయం కట్టించడానికి కార్యకర్తలుగా మున్సబు కరణాలతోపాటు, మరొక పెద్దమనిషినికూడా నియోగించాలనీ ఆ మూడో ఆయన చేతిమీదుగా ఆ సత్కార్యం చెయ్యాలనీ చెప్పి మరీ వెళ్లాడు.

అదే పేచీలకి నాందిఅయింది. ఆ మూడో పెద్దమనిషి ఎవరో తేలలేదు. కత్తులదాకా వెళ్లి ఎంతకీ తేలలేదు. దాదాపు అర్నెల్లయిపోయింది. చివరకి—ఏదిశాశ్వతం—ఎన్నికలు జరుపుదామన్నారు. సైఁ అంటే సైఁ అన్నారు. తలలూ తలలూ పట్టుకుని తలకిందులైన మీదట ఊళ్లోజనం అలవాటు ప్రకారం ముందర రెండుపార్టీ లయిపోయి బంగారయ్య అనే ఒక పెద్దమనిషికీ సూరయ్య అనే ఇంకో పెద్దమనిషికీ. మీ సాలు దువ్వి ముందరకి నెట్టారు. వీరో వారో నెగ్గాలి. బంగారయ్యకి నోరు మంచితనం వల్ల ఊరు మంచిదైంది. ఆయనకి మునసబుగారి అభిమానంఉంది. ప్రతిష్టకోసం పాకులాడే మనిషి. ఇక సూరయ్యగారు. ఈయనే రామారావు మావయ్య. ఆస్తికల కుర్రవాడి వేలువిడిచిన మేనమామ అవడం సూరయ్య అర్హత. అదే కరణంగారు అతనికి మద్దతు ఇవ్వడానికి కారణంకూడా. ఇందులో బోలెడు రాజకీయాలున్నాయి. ఎన్నో సమస్యలు ఇమిడి ఉన్నాయి.

ఎన్నికలు మూడురోజు లున్నాయనగా ప్రచారం విజృంభించింది.

సూరయ్యగారు బస్తీనుండి నికార్సయిన, రాటుదేరిన రాజకీయవాదుల్ని పిలిపించడానికి సన్నాహాలు చేస్తున్నాడు. డబ్బు కావాలి. ఓరోజుపొద్దున్నే వంటింట్లోచేరి సూరమ్మగారిని బ్రతిమాలాడు.

"చెల్లీ - నీకు పుణ్యం ఉంటుంది. ఒక పాతికరూపాయలు నీవి కావనుకుని ఇద్దూ. నీధర్మవాఁ అని ఇందులో గెలిస్తే కాస్త పేరు మోగుతుంది. నలుగురూ తెలిసొస్తారు. బస్తీలో ఉద్యోగం సంపాదించుకొంటా. లేపోతే ఏశాసనసభకో, బస్తీ మునిసిపాలిటికో మళ్ళీ పోటీచేసి గెలుస్తా. నీకు తెలీదు చెల్లీ - ఎంతకాలం ఇలా ఉండిపోను చెప్పు డబ్బూ దస్కం లేకుండా - జన్మలో నీకో రవికలగుడ్డ ఇచ్చి ఎరగను. నీయింటి మీదపడి తింటున్నాను - ఆడకూతురు వనేనా లేకండా - నాకు ఇదే చింతఅనుకో-రాత్రింబవళ్లు నిద్రపట్టదు" అన్నాడు.

సూరమ్మగారు జాలిగా నవ్వింది "పోదులే అన్నయ్యా! నువ్వు మరీని - అలాటిదానికి నిద్ర పాడుచేసుకుంటారా! నువు తినే పిడికెడు మెతుకులకీ మాకు బరువవుతావురా! - ఆ మారాజు మరీ అధ్వాన్నం చేసిపోలేదుగా - పైగా కుర్రాడున్నాడు. పొలం సంగతులు వాడికి తెలీవుగదా. నువ్వేనా ఆపనిమాని పెడుతున్నావా లేదా చెప్పు ఉద్యోగం సద్యోగంవద్దులే. ఇంటి పట్టున పడిఉండు." అందావిడ.

"అకేంముక్క చెల్లీ! రావుఁడి కీడొచ్చిందా - వాడూ కుడీ ఎడమా తెలుసుకుంటున్నాడా - రేపు పెళ్లీగిట్రా చేసుకు పిల్లామేకా కంటాడా వాడిల్లు వాడుచూసుకుంటే నాపనే వుంటుందమ్మా - పైగా నీకు అభిమానం ఉంటుంది కాని కోడలమ్మకి ఇష్టం ఉండద్దుటమ్మా - అబ్బె - అలా. తీసిపారెయ్యకు. నువ్వంటే తల్లివి కాబట్టి తప్పదనుకో - నే నెవణ్ణి?—"

"అదేవిటన్నయ్యా - అంతరాలుగాయని తెచ్చుకుంటామా ఇంటికి? కరణంగారిపిల్ల మంచిదే. పనీపాటావచ్చు. చదువుకుంటేనేం - ఒద్దికావందనం ఉంది!

"మరేనమ్మా - కరణంగారింట్లో కూడా అంతా ఈసంగతే చెప్పుకుని ఇదైపోతారు. మనపిల్లని సూరమ్మగారు కడుపులో పెట్టుకోడంకన్నా కావలసినదేవుంది - ఆవిడే ఊఁ అనాలిగాని. పిల్లా పిల్లాడూ చిలకా గోరింకలల్లే ఉంటారు, అవటా అని - ఎప్పుడూ ఇదై పోతారమ్మా ... ఇంకోటి చెల్లీ - మనలో మనమాటేసుమీ. ఆయన సీతమ్మ ఒక్కగాని ఒక్కకూతురాయె. రేపు ఆయన కాస్తా హరీ అంటే ఆ ఆస్తి కూడా రాముడే ఏలుకోవచ్చు. ఏమంటావ్ ...అహఁ — మాట వరసకి చెబుతున్నా"

"పోదూ అన్నయ్యా. అవేం మాటలు. మన కెందుకులే. ఆయన ఓకొడుకుని పెంచుకో కూడదా ఏం — రేపు నీళ్ళొదిలేవాడు వద్దూ వాళ్ళకి."

"అదికాదమ్మా—సందర్భం వచ్చినప్పుడు అనుకోవద్దూ మరి—ఇదిలాఉండా — ఈ రామిగాడు చూస్తే ఆ తైరీ అని అంటున్నాడు. నేను మెల్లిగాకదిపించి చూశాలే- తెలీదమ్మా—వీర్రాజా. మన వాడి చెలికాడు—మరేఁ-వాడు మెల్లిగా కదలేశాట్ట. అవటనా—నాన్సెన్స్ - నేను దాన్ని చేసుకోను. సుబ్బుల్ని తప్ప ఛస్తే ఇంకోత్తివి చూడను అన్నాట్ట!"

"అయ్యో! అదేం బుద్ధమ్మా వీడికి! సుర్రమంత పిల్ల అది. లేత వెధవాయ వీడూనూ-వరహీనం కూడానూ" అంది సూరమ్మగారు సందేహంగా.

"నాన్సెన్స్—అదేం కాదు" అంటూ సుడిగాలిలా వచ్చి వంటింటి గుమ్మంలో వాలాడు రామారావు. "వరహీనం ఏవిటమ్మా—వరహీనం గిరహీనం. నాకుపాతికేళ్ళు—సుబ్బులికి పద్దెనిమిది. నే నారడుగుల పొడుగు—లావు లేకపోయినా. పైగా నాకు కళ్ళజోడుంది. ఆఁ! ... ఇంకా వరహీనం ఏమిటి? నేను ఆసీతని చచ్చినా చేసుకోను, చేసుకోను చేసుకోను" అన్నాడు.

ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ

నూరమ్మగారు కొయ్యబారి పోయింది. ఉవ్వెత్తున కోపం వచ్చింది. "ఏమిట్రా—అధవా—అలా మిడిసిపడి పోతున్నావ్ - సిగ్గూ శరం లేకండా ఏమిటా మాటలు - ఏవిట్రా అగావు కేకలు - మంచి మర్యాదా పెద్దంతరం చిన్నంతరం లేదూ? ఎందుకులే వాడి వయస్సు వాడి కొచ్చిందని ఊరుకుంటున్న కొద్దీ పెచ్చురేగి పోతున్నావే - కూనా! - నాన్నతోపాటు అమ్మకూడా వచ్చిందనుకున్నావా ఏం!-పొగరు-పొగరా అని" అంటూ ఆయాస పడ సాగిందావిడ.

"నువ్వూరుకో చెల్లీ - నువ్వలా హైరాన పడద్దు. నే చెబుతా గా-ఒరేయ్ రాముడూ-చూడమ్మా- నీ గోలేమిటో నాకు తెలిసింది-కానీ మనకి ప్రేమేమిట్రా! - పుస్తకాల్లో రాసుకోడి చేదిగానీ - అల్లరి పెట్టక అమ్మ మాట విను. మీ నాన్నే బతికుంటే ఇలా చేసేవాడివిరా?"

"మా నాన్నే బతికుంటే నామాటకూడా కొంచెం కనుక్కొని ఏ పనేనా చేసేవాడు. మా నాన్న కొట్టినా, నేనంటే ప్రేమ."

"అయితే అమ్మ నీకు చేదట్టింది. కదూ-అను నాయనా అను - నేనే పోయి ఆయన ఉంటేపోతే ఎంత బావుండును. ఈ ఇడుమలన్నీ తప్పేవి." అంటూ కంటనీరెట్టుకుంది నూరమ్మగారు.

రాముం తల వంచుకున్నాడు.

జ్ఞానం వచ్చాక ఇంత రభస ఎన్నడూ జరగలేదు. అమ్మ నేడిపించలేదు. ఇంతకీ కారణం—....

మావయ్య వీపు తట్టాడు. "అంతలోకే అలా మొహం వాలిస్తే ఎలాగరా? ఆడకూతురు కష్టాలు సహించలేక కొప్పడింది.— దాన్ని సంతోషపెట్టరా నాయనా తల్లి ఋణం ఏమనుకున్నావో - ఏం? సరేనా - సీతని చేసుకుంటావుగా - నేను మాట ఇచ్చేసి వచ్చా కూడా" అన్నాడు.

"దానికేం - ఇచ్చినమాట మళ్ళీ అడిగి పట్టుకు చక్కా ఒచ్చెయ్" అంటూ లేచి పోయాడు రాముం.

రామూనికి ఒళ్లు మండిపోతోంది - నూరయ్య సంగనాచి వేషాలకి. నూరయ్యగారి కథ అతనికి అప్పుడే తెలిసింది. మొహంమీద అనెయ్యడానికి గుండెలు చాల్లేదు. అమ్మకి చెప్పినా నమ్మదాయె. పైగా మొగదక్షత-పెద్ద దిక్కు అంటుంది. మావయ్యమాటలు చూస్తే తేనెమాటలు. చేష్టలు చూస్తే దౌర్భాగ్యపు చేష్టలు. సరాసరి శివాలయానికి వెళ్ళి కూచున్నాడు రామూరావు విచారంగా.

"సోదరా రామూ! ఊళ్లోకి పెద్దమనుషులు దిగ్గారోయ్! కథ ముదిరి క్లైమాక్సు కొస్తోంది. కాస్కో నారంగా!" అన్నాడు శివాలయంగోడమీద వీర్రాజు.

"ఛవ్—ఏవిట్రా కోతిచేష్టలు? నిక్షేపం వంటి సింహద్వారం ఉండగా గోడలు దూకడం ఏవిట్రా"

"దొంగరాముడి సావాస ఫలంలే. ఏదో ప్రాక్టీసు—" అంటూ గోడ దూకాడు వీర్రాజు.

"కథ క్లైమాక్సు అన్నావేమిట్రా? అసలు కథ మొదలే కాలేదుగా"

"కాకేం! బోలెడయింది. అదీ కాక పురిట్లో సంధికొట్టినట్టు కొందరు విలన్ల ఎత్తులు మొదట్లోనే క్లైమాక్సు కెళ్ళిపోతాయిలే—అసలే మనవూరిలో బోలెడుకుంది పెద్దమనుషులు—వాళ్లు చాలక ఇంకో పెద్దమనుషులు దిగారు. క్లయిమాక్సు కాక మరేవిట్రా!"

"పెద్దమనుషులు రావడమేవిట్రా సంగతి చెప్పు"

"రావుడూ! మీ మావయ్య అగ్గిరాముడ్రా. లాకాయిలూకాయి రకం కాదు, పెద్ద బుర్రే! రాజకీయ బుర్ర!"

"రాజకీయ బుర్రేమిట్రా! నీ బొంద. తప్పు సమాసాలూ నువ్వూనూ-అదేం తెలుగురా చెవలాయా!"

"పోరా పో—ఇదేం తప్పు సమాసంలే కానీ, యమ సమాసాలు వినొచ్చా ఇందాక—హృదయపాట, వృద్ధతల్లి పువ్వచెట్లు లాటివి. పైగా సినిమాపాటలు రాస్తాట్ట—హుఁ!"

"ఏవిట్రా నీగోలకి"

"వీళ్లంది! ఆ తప్పు సమాసంగాడికి సుబ్బులిన్నివ్వడానికి మీ మొగదిక్కు పెద్దదక్షత తాంబూలాలిప్పించేస్తున్నాడు— ఇవాళ ......"

రామూరావు కొయ్యబారి పోయాడు.

"ఎవడ్రా వాడు?"

"ఇంకెవడు— సుందర్రావు - కవిగారు గారట అనుకో. పెద్దమనుష్యులు ఊరినిండా తిరిగేస్తున్నారు కాళ్ళకడ్డం పడుతూ"

"రాజా—సరిగ్గా చెప్పరా—కొంపంటుకు పోతూంటే గోవిందనామాలు పాడతానంటే ఎలాగరా"

"అయితే టూకీగా చెబుతా విను కథా సంగ్రహం. ఇందులో చాలాభాగం స్వకల్పితం. మిగతాది మా ప్రత్యేక విలేఖరి దొంగరాముడు అందుకో సంపాదించింది. మీ మావయ్య ఉద్దండుడు. అయితేనేం అప్పులు పీకలమీదకి తెచ్చుకున్నాడు"

"పేకాట సంగతేనా?"

"నల్లమందు కూడా"

"మొత్తం ఎంత?"

"అసలు ఫాయిదాలు కలిసి రెండొందల పాతిక పైచిలికింది."

"సుబ్బులి సంబంధం కుదిర్చినందుకు సుందరంగాడు ఎంతిస్తున్నాడు?— పైగా వాడు బంగారయ్య మనిషికదట్రా—బంగారయ్యకీ మా వాడికీ ఎన్నికలపోటీ ఏడుస్తోందిగా - మధ్య ఈ ప్రేమేమిటి?"

"అడ్డదిడ్డ ప్రశ్నలెయ్యకు. చెబుతా విను. మావయ్య బస్తీలో నల్లమందు హ్యాపు దుకాణం వాడికి 85 రూ॥లున్నా మూడు ముక్కలాటలో పాల్గొన్న కంట్రాక్టరు మావకి రెండువందలూ, సుబ్బిసెట్టి అనే శ్రేష్ఠికులశ్రేష్ఠుడికి పాతికా బాకీపడి నోటు రాసిచ్చాడనీ విశ్వసనీయంగా అభిజ్ఞవర్గాల ద్వారా తెలియవచ్చింది."

"హారినీ!"

"మధ్య హోరి 'నా' ఎందుకు? 'హోరి మొగదక్షతా' అనుకో - ఏం - కిందటివారం పేకాటలో తొండులు ఊసరవెల్లులై జుట్టూ జుట్టూ పట్టుకునేదాకా వెళ్లిందట. మీ మావెధవ నికార్సయిన బోడిగుండు కాబట్టి పీకమీదకెళ్లాయి చేతులు. వాళ్లిద్దరూ రచ్చరట్టూ చేస్తామున్నారు ఈ ఊరొచ్చి. మీ మొగదిక్కుకి, ఈఆపదలో అడ్డుకునే దిక్కు కనబడలేదు. మీ అమ్మ నెలా అడుగుతాడు చెప్పు-! దగుల్బాజీల దారి వేడీజే అన్నట్టు ఆకంట్రాక్టరుకీ సెట్టికీ బుర్రలు జమిలిగా పనిచేశాయి. 'పంతులు మా పంతులే - మాన్నూ మాన్నూ పంతులి పరువుతియ్యడం ఎందుకు' అని కంట్రాక్టరు అన్నాడట. 'మరేమరే - కడుపుచించుకుంటె కాళ్లమీద పడుతిది. పంతులు గుట్టుబయట పెడితే పెద్ద

మహాకులం కులం మాత్రం నలుగురినోళ్ళలో పడిపోతాం!' అని శెట్టి అన్నాట్ట. చివరకి మామా, కంట్రాక్టరు, శెట్టీ కలిసి పెద్దఎత్తు వేశారు. యమఎత్తులే! - అలాటిలాటి ఎత్తు గాదు."

"రాజా - ఎందుకురా ఇలా విసిగిస్తావు కథలూ కవిత్వం రాసుకు బతకాడదూ నాకు టూకీగా చెప్పేసి—"

"వినవోయ్ చవటా - రఘుగంధాయంలోకి వస్తున్నాం. రామనాథంగారు పవిత్రసం ప్పుకుంటూ రామాలయం కట్టించమన్నాడుగా. అది వాళ్ళబ్బురలకి ఏకకాలంలో తట్టింది. కరణం మున్నబుల చేతికి డబ్బు అప్పగించినా, మందిరం కట్టించే వ్యవహారంలో మంచీ చెడ్డా చూసి తేల్చడానికి ఊళ్లో నలుగురిచేతా తగుననిపించుకున్న పెద్దమనిషిని నియోగించాలని గదటోయ్ ఆయన ఆనాళ చెప్పాడు. అర్నెల్లయినా ఇంకా ఆ పెద్దమనిషి ఎవడో తేల్చలేదు. ప్రతివాడూ కండువా సవరించుకుని మీసాలు మెలేసీవాదేసారు. రేపు ఆదివారం ఎన్నికలాయె. ఎన్నికలు పెట్టాలన్న అయిడియా అదిలో మీ మావబ్బురలోంచే బయలేరిందట - కిందటివారం. ఈఎన్నికలకి మీమావ నిలబడుతున్నాడుగదా. ఈనకి పోటీగా బంగారయ్యగారొచ్చాడు - మునసబుపార్టీ మనిషి. రేపు మీ మావయ్య ఎన్నికయితే రామమందిరం కట్టడానికి కంట్రాక్టు ఇస్తే కంట్రాక్టరుకి ఇస్తాట్ట. వెయ్యా రెండు వేలా! నాలుగు వేలాయె. ఇదీ మీ మావకీ కంట్రాక్టరుకీ ఒప్పందం. ఈకంట్రాక్టు తనకిస్తే మీ మావ బాకీవున్న రొండొందలూ చెల్లకొట్టడం కాకుండా పైనో ఏభై రూపాయలు పారేస్తానని కంట్రాక్టరు మాటిచ్చాడు. అందుకని మీ మావ గెలవాలి."

"గెలవక పోతే?"

"ఆపైనభాగోతం వెండితెరమీద చూడాల్సిందే. మావ ఇంకోలా అప్పు తీర్చగలడా? కంట్రాక్టరూ, శెట్టీ ఏం చేస్తారు? సుందరం సుబ్బలక్ష్మిని చేసుకోగలడా? కథానాయకుడు రామారావు ఏమవుతాడు? వాడి చెలికాడు వీర్రాజుగానీ కొంపతీసి సీతని పెళ్ళాడేస్తాడా? మిగతా కథ వెండితెరపై చూడుడు. అంతే లెక్క—"

"ఇదెప్పటిన్నించిరోయ్?"

"ఏదీ?"

"అదేరా - నువ్వు కొంపతీసి సీతని పెళ్లాడడం"

"అబ్బే - అదేం వాంఛూత్లంగా తీసుకుని రేపు నలుగురిలోను పరువు తీయగలవు జాగర్త. ఊరికే అయిడియా - అంతే—"

"వీర్రాజూ - మానవ హృదయం ఎంత అగాధంరా - ఎంత చిత్రంరా - లోకంలో నీ అంతటి చవట చవటత్వంగల చవట అంటారని కలలోగూడా కలగనలేదురా—"

"ఏడికావు - పోకిళ్లుపోబోకు - సీతంటే దేవత".

"మరే మరే - మొత్తానికి నన్ను రక్షించావురే - అవునుగానీ తెలీకా - అజ్ఞానం కొద్దీ - కుతూహలం కొద్దీ అడుగుతా గానీ చూస్తూ చూస్తూ సీతమీద ఎలా ఇష్టం పుట్టిందిరా నీకూ?"

"నీ కర్థం కాదులేరా - నేను మొన్నటిదాకా వెర్రిదనుకున్నా..."

"అలాగేలే గానీ అసలు సంగతి చెప్పరా"

వీర్రాజు సిగ్గుపడ్డాడు. "నిన్న మా బామ్మకి నోరు బావుండక చింతకాయ పచ్చడి తెమ్మంటే వాళ్లింటి కెళ్లి అడిగా. సీత లోపలికెళ్లి చిన్న రాచిప్పలో వేసి తెచ్చింది. సావిట్లో ఎవ్వరూ లేరు. సరే- చేతికిస్తూ—నా కళ్ళల్లోకి చూసింది. ఎంత బావుందనీ! ఇలాగే చూసిందిలే. అలా కళ్లు పరస్పరం చూసేసుకుంటున్నాయి. ఈ చేతులు ఆ చేతులోని రాచ్చిప్ప నందుకుంటున్నాయి. కళ్ళు బిజీగా వున్నందువల్ల కంగారులో చేతులు తగిలాయి ... ఒరేయ్ సిగరెట్టియ్యరా"

"ఇదీ దేవుడి గుడి - దంపాలేసి చావగొడతారు. ఇక్కడ రామాయణాలే తప్ప అసలు ప్రేమాయణాలే మాట్లాడ గూడదు. పైగా సిగరెట్టోటూ... సరిలే ఏమయింది?"

"ఏమవడానికేముంది! చూపూ చూపూ కలిసింది. చెయ్యీ చెయ్యీ కలిసింది. మాటా మాటా కలిసింది. దరిమిలా మనసులు కలిశాయి."

"కనులు కనులు కలిసే - చిరు మనసులు వెన్నెలలు కురిసే - సరే పచ్చడి రాచ్చిప్ప ఏం చేశారు?"

"ఇంతలోకి వాళ్ల నాన్న వచ్చాడు. అయినా యిదేమన్నా సినిమాట్రా! మాటాడిన మరుక్షణంలో హే నాథా అని మీద వాలిపోడానికి... జీవితం!"

"కాదుమరీ అవునుగానీ సీత నీ కెన్నో నంబరురా?" అన్నాడు రామారావు.

వీర్రాజు మళ్ళీ సిగ్గుపడ్డాడు "లెక్కవేస్తే ఇది పదమూడో దనుకో. అయినా మిగతా వాళ్లంతా ఓ ఎత్తూ — సీత ఒక్కర్తీ ఒక ఎత్తూ - మన వూళ్లోనే మా వీధులోనే ఇంత మాణిక్యం వుండగా దాన్ని చూసుకోకండా ఇన్నాళ్లూ మసిబొగ్గులకోసం తారట్లాడాను. కానీ వాళ్లంతా సీత కాలిగోరికి సాటిరారని నిన్న తెలుసుకున్నా."

"కాలిగోళ్లక్కూడా రంగేస్తుందావేం?"

"ఆ! ఎంతబావుంటాయని! నే నెక్కువ సేపు కాలిగోళ్లే చూశా. మొదట్లో నే కళ్ళలోకి చూస్తే బావుండదని."

"భేష్ భేష్! కానీ మీరేం మాటాడుకున్నార్రా?"

"ముందరేమో - పచ్చడి కేగా నే-



ఇద్దరమ్మాయిలూ - ముగ్గురబ్బాయిలూ

పొచ్చింత కాదే నాండీ? - అన్నా. వెంటనే చిరునవ్వుతో తలవంచుకుని - అవునురాజ్! పాతపచ్చడే-నువ్వు 'దీదార్' చూశావా - అందిచూశా చూశానన్నా. ఆ కొద్దిసేపూ మా అభిమానతారల్ని గురించి మాటామంతీ ఆడుకున్నాం. లిటరేచర్ కూడా చదివిందిరా - శీఘ్రఘారం అయితే నేం - 'ప్రేమవాహిని'- 'హృదయజ్వాల' 'భగ్నహృదయాలు' - 'గతుకులబ్రతుకులు' అవన్నీ చక్కగా చదివి ఎనలైజ్ చేసింది ......ఒరేయ్ సుందరంగాడు లేడూ— వాడు మొన్న ఘాటుగా చూసి నిన్న పొద్దున్న పాటలపుస్తకం ఇచ్చి దాంట్లో ప్రేమలేఖ పెట్టాడుట్రా! తప్పుకాదూ! సంసారులను కున్నాడా పానులనుకున్నాడా? దాన్నిండా కవిత్వం ఉందట! 'ఓప్రియా- నువ్వు ఇది అనే అదివంటిదానివి నీ ఇదనే ఇది ప్రకృతి సౌందర్యంలోని అదనే అదిలా వెలిగిపోతోంది' అవంటూ సేని రాశాట్ట పైగా పాటలు సాంఘికవిత్వంట! బోడికవిత్వం. అవన్నీ పుస్తకంలో ఎక్కించాడు దాని పేరు 'హృదయపాటలు'"

"ఒకేయ్ రాజా-ఆగరా- అయిడియా-"

"ఏం మెచ్చి పడింది!"

"నీ తలకాయి. ఎవ్వడావాడు పూర్వం అయిడియా లిచ్చేసేవాడు-నిమిషాలమీద?"

"నేనే"

"నువ్వే కాబోలు...ఛా నీ బొంద. నీ కయిడియా లెక్కడివిరా నేనే కాబోలు. సరేలే. ఆ సుందరంవెధవరాసిన ఉత్తరం ఎలాగైనా తెచ్చావా నేను సుబ్బలక్ష్మిని పెళ్లాడేశానే."

"అది కుదర్దురా. అలాటివెదక్కు. 'నీ కెవడో రాసిన లవ్ ఇలాలెటరు ఇయ్యమని సీతనడగనా? ఛా! నాకు విడాకులిచ్చేస్తుంది' రాజ్! నీదింత సంకుచిత మనస్తత్వం అనుకోలేదు; అనేస్తుంది."

"వీర్రాజే! ఈ మాటలనేది? ఇంత దుర్మార్గుడ వనుకోలేదురా. మనస్నేహం చిన్ననాటి పాతకాల చెట్లనడుమ ఆటలలో......"

"నాన్సెన్స్. ఈ వేషాలన్నీ కుదరవ్"

"రాజా. మొన్న మొన్నటిదాకా నీకు ప్రేమలేఖలు రాసిపెట్టిందెవ్వరా? వాటికి ఫెయిర్ రాసి పోస్టుకి డబ్బులిచ్చిందెవ్వరా? నువ్వు నిరాశతో ఏగుస్తూ భగ్నహృదయంతో బాష్పకణాలతో వచ్చినపుడు నీ గోడువిని నిన్నూరుకోపెట్టి నీబదులు ఏడ్చిందెవ్వరా? ఇవన్నీ మర్చిపోయావా?"

"ఇవన్నీ ఏమిటి. గతజీవితం అంతా మర్చిపోయాను. అంతా కడిగేసి ముగ్గులు పెట్టాను. నిన్ననే పునర్జన్మమెత్తా." అన్నాడు వీర్రాజు.

రామారావు ఆలోచనలో పడిపోయాడు. కొస్త ఆగి బహ్మాస్త్రం వేశాడు "రాజా! విను. మా మావయ్య సీతని నాకు ఇప్పించ డానికి ఏర్పాట్లు చేశాడు. తెలుసుగా. కరణంగారు మాట ఇచ్చాడు. అమాంతంగా నేను ఇంటికెళ్లి మాఅమ్మదగ్గిర మారం పెట్టి రేపే తాంబూలాలు ఇప్పించేసుకుని ఎల్లుండే సీతని పెళ్లాడిపారేస్తా...అనకనువ్వు 'వేదనపాలై నా మనసంతా వేసారెనే-యె' అంటూ ఉనూరున ఏడవాలి. జాగర్త. మర్యాదగా సీతనడిగి సుందరం రాసిన ఉత్తరం పట్రా" అన్నాడు.

రాజు నిర్లక్ష్యంగా నవ్వాడు. "మీ మావకాదు. ఆయనమామ, వాళ్ళ వేలు విడచిన మావాకలిసి, దిలీప్‌కుమార్‌ని తీసుకొచ్చి నిలబెటినా, సీత కన్నెత్తి చూడదు. పన్నెత్తిపలకదు. తెలుసా?—డీప్ లవ్. హృదయం అంకితం ఇచ్చింది నాకు. వాళ్ళ నాన్నతో చెప్పి ఒప్పిస్తానంది ... పైగా నిన్ను గురించి ఏమందో తెలుసా?"

రామారావుకి కుతూహలం కలిగింది. అయినా ఒక రకంగా "ఏమంటుంది. దిలీప్ కుమార్ అంతటి అందగాడు. నన్ను నిర్లక్ష్యంచేశాడు అని ఉంటుంది అంతేగా" అన్నధోరణిలో చూశాడు.

రాజు నవ్వాడు. "ఏడిశావు. వెధవ చూపూ నువ్వూను. తగ్గిపో.. సీత నిన్ను వశిముఫ్ అంది చవటఅంది దద్దమ్మఅంది... ఆ...ఇలాటికే ఇంకోమాటఉంకేవిట్రా..."

"వాజమ్మ" అన్నాడు రామారావు గంభీరంగా.

"ఆ. మరే వాజమ్మ అంది. ఎందుకూ పనికిరాడు; చురుకుతనం లేదు, కళ్ళలో జీవంలేదు, ఏకుపుగొట్టు మొహం, జిడ్డు మొహం అంది.

'వటప్' అన్నాడు రామారావు కర్కశంగా.

"ఆ....ఇంగ్లీషు రాదనికూడా అంది కళ్లజోడు లేకపోతే కళ్లు కనపడవంది"

"అందేం! అలాగేం...ఎంత పొగరు! ఎంతపొగరు! ఒళ్లుబలిసి పట్నవాసం..."

"తగ్గరా తగ్గు.దాన్ని ఇంకొక్కమాటంటే నేను ఊరుకోను. అంటే అంది...ఏది ఆ కళ్లజోడుతీసేసి ఇవన్నివెళ్లో ఠపీమని చెప్పు. కాకపోతే లేచి తిన్నగావెళ్లి ఆ మూడో స్తంభంమీద కుడివేపు బొమ్మ ఎడంకాలు ముటుకుని వెళ్ళినదారివచ్చి కూర్చో. చూద్దాం" అన్నాడు వీర్రాజునవ్వుతూ.

రామారావుకి ఏడుపూ చిరాకూ కలిగాయి. మాట్లాడలేదు రాజు నవ్వుకుంటూ, జేబులోంచి సీతరాసిన ఉత్తరం తీసి చదువుకోడం మొదలుపెట్టాడు.

"రాజూ"

"ఏం?"

రామారావు గొంతు వణికింది. చిన్న ఏడుపుచారకూడా రాజుకి వినపడింది.

"ఛీ - ఆడదానిలా ఏడు పేమిట్రా... మొగాడివి నువ్వు పబ్లిగ్గా ఏడవమ్మా...ఛీ ఊరుకో"

"రాజా సుబ్బులుర్రా"అన్నాడు రామారావు దీనంగా "ఏం సుబ్బులికేమొచ్చింది?"

"సుబ్బులు జ్ఞాపకంవస్తోందిరా...ఒరేయ్ రాజా నాకు భయంగా ఉందిరా. నువ్వేలాగైనా ఈ వుత్తరం పట్రావాలిరా"అన్నాడు రామారావు.

"బావుండదు బ్రదర్....సరే ఎందుకు చెప్పు"

"ఏంలేదు సుబ్బులంటే నాకు చాలా ఇష్టమని మామావయ్యకి తెలుసు. నాకు సీతని కట్టబెట్టడానికి ఇది ఓ పెద్ద అంటంకం అనీ తెలుసు. అందుకని సుబ్బుల్ని ఇంకొకరికిచ్చి పెళ్లిచేయిస్తే నేను కాసేపు ఏడిచి సీతని చేసుకుంటానని మావాడి ఊహ. అందుకనే సుందరంగాడు అంతవాడు ఇంతవాడని జగన్నాథం గారికి సిఫార్సుచేస్తున్నాడు. ఇప్పుడు నువ్వుకనక సుందరం సీతకిరాసిన ఉత్తరం తెచ్చిపెడితే దాన్ని నేను తిన్నగా జగన్నాథం గారిచేతికిస్తే, ఆయన దాన్ని చదివితే, తక్షణం సుందరానికి సుబ్బుల్ని చచ్చినా ఇవ్వనని కుండబద్దలు కొట్టినట్టు చెప్పేస్తాడు అక్కడితో మా మావయ్య పన్నాగంలో ప్రథమ భాగం ధ్వంసంచేసిన వాడినవుతాను"అన్నాడు రామారావు.

వీర్రాజుకి ఉషారు పుట్టింది "రెండవ భాగం నేను నాశనం చేస్తాలే. రాజుకి నన్నిచ్చి పెళ్లిచెయ్యకపోతే నూతులో దూకుతానని'సీతా, సీతని నాకు చెయ్యకపోతే సన్యాసం పుచ్చుకుంటానని నేను ఎడాపెడా బెదిరిస్తాం."

రైట్ భేషుగ్గా ఉంది ... ఇదే జరిగితే కరణం గారికి మామయ్య అవసరం ఉండదు. అందుకని ఆయన రేపు ఎన్నికలకి మా మావయ్యకి ఓట్లు ఇప్పించడు. మావాడు అగ్గిరాముడై పోయి, పంతానికి నాకు ఇంకోపిల్లనిచ్చి పెళ్ళి చేస్తాడు. ఆ కోపంలో సుబ్బలక్ష్మి సంబంధము కుదిర్చేస్తాడు :...మనం అంతా హాయిగా ఉంటాం."

"శభాష్ ! కీడెంచి మేలెంచమన్నారు. మనం ముందర మేలెంచుకున్నాం. ఇపుడు కీడెంచుదాం" అన్నాడు వీర్రాజు.

"కీడేముందిరా ఏం లేదే"

"సుందరంగాడున్నాడు చాలదూ".

"ఏడిశాడు - వాణ్ణింక ఖాతరు చెయ్యక్కర్లేదుగా"

"విచ్చు రూపాయల్లే ఖంగుమని మోగిపోతూ ఊరంతా ఢమాయించి తిరిగేసి తలకాయలు మార్చేస్తూంటే వాణ్ణి ఖాతరుచెయ్యకపోతే ఎలాగరా!" అన్నాడు వీర్రాజు.

"సరే ఉన్నాడురా సుందరం. ఇంతకీ వీడెందు కొచ్చినట్లు ఈ ఊరు?"

"సినిమా తియ్యడానికి"

"అదేవిటది! కొత్తకథ. ఇదెక్కడ సంపాదించావు"

"చెపుతున్నాగా. ఊళ్లోకి పెద్దమనుష్యులొచ్చారని. వాళ్లతోపాటే ఇందాక ఒక సినీభాయ్‌గా డొచ్చాడు చెన్నాపట్నం నుంచి.

"వాడెవడు ?"

"వాడు సినిమా పరిశ్రమకి లైజాను ఆఫీసరు అనుసంధాన కర్త. ముందు వాడికీ వీడికీ పోట్లాట తెచ్చి,ఆపైన తను ఓ వేపు చేరి రెండో వాణ్ణి తిప్పలు పెట్టి మొదటి వాడి దగ్గర డబ్బు వడేస్తాడు - శాశ్వత ఋణం పద్ధతిలో - ఆపైనా మళ్ళీ వాళ్ళిద్దర్నీ నేస్తాలు చేసిపారేసి రెండో వాడి దగ్గర గుంజుతాడు. ఇప్పుడు పేపరు పెడతాట్ట".

"ఈ ట్రేడు సీక్రెట్లు నీ కెలా చెప్పాడు ?"

"ఆc! పనుండి ఊళ్లోకి వస్తానే నన్ను సుందరం ఇల్లెక్కడని అడిగాడు. వాడి వాటం, ఆ న్యూస్ పేపరు బుష్ కోటూ, మూతి మీద ఈగ వాలినట్లు మూడువెంట్రుకల మీసం, గిరజాల వ్యవహారం చూసి సినిమా వాడని గుర్తు పట్టేను. వసపిట్టలా ఛెడవాగుతాడులే. ఒక విధంగా వెర్రిబాగులాడు. నేను బొంబాయిలో అసిస్టెంట్ కెమేరామాన్ అని చెప్పేసరికి తారునమ్మేసి తన పురాణం చెప్పాడు. నాకు తోచిన ట్రేడు సీక్రెట్సు, సినిమా పత్రికల్లో చదివినవి నాలుగూ చెప్పేసరికి గుట్టూ మట్టూ లేకండా అన్నీ చెప్పాడు. తనకి బొంబాయిలో ఛాన్సు ఇప్పించమన్నాడు. నేను వచ్చే నెల, హాలీవుడ్ వెళ్ళుతున్నానని వెళ్ళొచ్చాక తప్పక చూస్తాననీ చెప్పా. గుమ్మైపోయాడనుకోరా మన్నినమ్మేసి!"

"తిప్పకొారురా - నీ కివేం బుద్ధులు. ఆ తరువాత తిరువాత?"

"తరూ లేదూ వాతా లేదూ. వీడిరాక సుందరం వీపున వాతయి కూర్చుంది.'

"ఏం? ఏం? సుందరం మంచివాడు కాడా ?"

"కాకేం? బోలెడుమంచి. బంగారయ్య దగ్గర వెయ్యి రూపాయలు వడేస్తే, సినిమా తీసి, మళ్ళీ వచ్చి బంగారయ్య ఇంటిని బంగారంతో నింపి పారేద్దామని ఉద్దేశంట. హృదయం, ఆశయం మంచివే పాపం."

"నీ విధవ స్టైలు చిరిగిపోయిన టైరులా వుంది. సంగతి చెప్పు"

"చెప్పడాని కేముంది! ఇదే సుందరం ఆశయం. బంగారయ్యకి ఎన్నికల్లో సాయపడి ఎలాగైనా ఓ వెయ్యి రూపాయలు పుచ్చుకు మద్రాసు మెయిలెక్కాలని వచ్చాడు. వీడికోసం అక్కడ సినీభాయ్ కాసుక్కూచున్నాట్ట. వీడు రాగానే సినిమా తియ్యడానికి"

"వెయ్యి రూపాయలతో సినిమా ఏమిట్రా! - నువ్వు మరీని"

"వెయ్యేం కర్మం. ఇపుడు ఇంకోమూడు వేలు కలిసొస్తున్నాయిగా."

"ఎక్కడనించి"

"మీ మావయ్య నీ మీద ప్రేమకొద్దీ, సుబ్బలక్ష్మిని వాడికట్టబెట్టబోతున్నాడు కదూ! సుబ్బలక్ష్మి తండ్రి ఉన్న మూడెకరాలలోనూ ఎకరన్నర తెగనమ్మి వీడికి ఆ మూడు వేలూ కట్నం పోస్తాట్ట. వాడి మొహం చూసి కాదనకో - బంగారయ్య చుట్టంకదా - మంచివాడేననే ఉద్దేశంతో.



ప్రణయ ముగ్ధ

బంగారయ్యకి, ఈ సుందరం చెన్నపట్నంలో ఆడే భాగోతం తెలీదు. వాడేది చెబితే అదే. బంగారయ్య అనుకోడం - వీడు మందుల కంపెనీలో మేనేజరని"

"బాప్రే. మూడు వేలి స్టేమాత్రం కి ఏదేం చేస్తాడు మద్రాసులో!"

"సినీభాయ్ గారు దక్కగా కోసరి దాకొని. వెయ్యినూటపాయిలు వాలట. అంతకన్న ఎక్కువైనా అకాతిల పారేస్తాట్ట. ఏం లేదు— ఈ వెయ్యి పెట్టే సినిమా పేపరు కి తీయటం. ఆ కొత్తేంచి బ్రిటిష్ టెక్నిక్ ప్రకారం నిర్మాకం చేసి, ఓ ప్రొడ్యూసర్ని, ఓ తారకేశ్వరిని, ఓ తారకాసురుడ్ని మంచి చేసుకుంటాట్ట. ఈలోగా సుందరం గాడేమో దాంట్లో, 'వెండి తెర కో నిమిషగాథ - తెలుసుకివ్వ' అని హెడ్డింగులు పెట్టి ఏక టాకీని కథలు కుప్పించేసి, సినేరియోలు రాసేస్తూంటాడుట. పాటలూ అవి ఇప్పటికి మూడు వేలు రాసిపడేశాట్ట - ఎక్కడ, ఏవి లేవి, కుర్బంసిలో కూడుని పాడేసి. ఎవడో వచ్చి సినిమాతీస్తానంటాడు- ఆ నాంతం దానికి మాటలూ పాటలూ సుందరం రాస్తాడు

సినీభాయ్‌గారు హీరోలైతే పేరు మార్చుకుని హీరోగానీ లేక సైడు హీరోగానీ వేస్తా నట."

"పెద్ద ప్లానే"

"ఇదేం పెద్ద! ఇంకొకటుంది. ఇలా కొద్ది మొత్తంతో పెట్టిన సినిమాపత్రికని మెల్లిగా ఇంగ్లీషులోకి మార్చేసి అక్కడినించి "అవర్ ఆంధ్ర' 'అవర్ సౌతిండియా', అవరిం డియా' అవరేషియా', అవర్ యూరే షియా' అంటూ మెట్టుమెట్టూ ఎక్కించేసి 'అవర్ వరల్డ్' చివరికి 'అవర్ యూని వర్స్' అనే పేరుతో పెద్ద పేపరుగా వేసే స్తాడు. అప్పటికి చంద్ర అంగారక, కుజ - నాకు పేర్లురావు - మొదలైన అన్నిగోళా లలో అమెరికాయ్ వాళ్లు ఇళ్లూ హోటళ్లూ కట్టి విమాన సర్వీసు వేస్తారట.

వీడు అప్పటినించీ ప్లానెట్ కో ఎడిషన్ చొప్పున వేస్తాట్ట. బావుందే అయిడియా!"

"ఫస్టుగా వుంది. సర్వీసుప్రడే సీటు కొనుక్కో"

"ఇందాకే కొన్నాగా. పాపలా అర్థణా పేరు. ఈ నరయ్య హోటల్లో కాఫీ తాగాంలే. అమాంతం వాడి పర్సు పోయిం దన్నాడు. పర్సు పోయినా బాధలేదు కాని —సిగరెట్ పెట్టె—మళ్ళీ కొత్తది పోదకిన నెండిలోది ఇరవై సిగరెట్లతో పోయిం దన్నాడు. బాధపడిపోయాడు. పరిశీలనే పావలా చెల్లించి ఓక్కటు కొట్టి కొనిచ్చా. 'మా వెంచర్ లో ఇది మీ పెట్టుబడి' అనేశాడు. రేపో మాపో నా బుజం బద్దలు కొట్టేసి."

రామారావు విరగబడి నవ్వేడు.

"ఇంకో తమాషాయ్. వీని ఈ నరయ్య హోటలు గోడమీద చావాలమ్మ పటం కొడుతూంటే చూసి విరవి విరిచి 'పూర్ ఇండియా!' అని జాలిపడ్డాడురా"

"ఏం పాపం?"

"అసలు వాడికి ఇండియా అంటే చిన్న ప్పటినించీ నచ్చదుట"

"ఏం?"

"ఇక్కడ నైట్ క్లబ్బులు లేవుట. కేలి నిజవ్‌లు లేవట. బాల్ డాన్సులు కోకనాకీ రకంట"

"ఈ సినీభాయ్‌గారు అమెరికా గానీ వెళ్ళొచ్చాం మిత్రా?"

"వీడు వెళ్ళలేదు కాని వీడి మేనమామ ఓయారెస్టు ఫ్రెండు వెళ్ళొచ్చాట్ట. వాళ్ళ మామయ్యది సర్గామం ఈ జిల్లాలట. అందుకే చాలా రోజుల్నుంచీ ఈ జిల్లాలో ఉంటు న్నాట్ట. అక్కడే ఆయనకి ఫ్రెండు. ఆ ఫ్రెండు అమెరికా అవీ చూసొచ్చాడు. ఆ గోరోజనం యావత్తూ వీడికి అంటుకుంది. అందుకని—'ఇండియా నిషిద్ధ' కాదు. ఇండియాలో ఏం లేదు. వాడి బొంద

ఘుంటట. వాడే అన్నాడు. 'ఇక్కడ కేముం దండీ నా బొంద' అని"

"ఇంతకీ వాడిలా అమాంతం ఊడిపడ్డా డెందుకూ?"

"సుందరం వాడికి ఒక్కేసి వచ్చాట్ట. మూడు రోజుల్లో వెయ్యి రూపాయలు పట్టుకు వచ్చేస్తానని. అక్కడ అప్పుల వాళ్లు పీక్కు తిన్నారు. మూడు కాదుగదా నాలుగు రోజులయినా వీడు రాలేదుట. ఇలాగయితే ప్రోగ్రాంలు దెబ్బ తినవా? ఇకేం ఇంకోటా ఇంకోటా! సినిమా పరిశ్రమ! అంపటా అనుకుని దగ్గిరుండి తీసుకెళ్దామని ఈయనగారు సామానేదో తాకట్టు పెట్టి కట్టాకటిగా డబ్బులుచ్చుకుని ఇక్కడ దిగాడు. ఇంక ఇద్దరూ కలిసి నిర్వాకం చేస్తారు."

"జగన్నాథంగారి కివంతా తెలిస్తే!"

"కొంప లంటుకున్నాయే! అటు సూర్యుడిటు తిరిగినా ఆయన పిల్ల నివ్వడు. ఒరేయ్ అన్నట్టు అటు సూర్యుడిటు తిరిగాడు రోయ్. చీకటి పడిపోతోంది. వెళ్లాలి"

"ఏవిట్రా ఆ రాచకార్యం?"

"పెళ్లికి పెద్దమనుషు లొచ్చారని చెప్ప లేదూ. వాళ్లని సత్కరించద్దూ మరి" అన్నాడు పీర్రాజు.

"అవును పెద్దమనుషు లన్నావు—ఏమీ చెప్పనే లేదూ! మళ్ళీ నీ పెళ్లి సాక్షికబుర్లు చెప్పావ్."

రాజు కోపం వచ్చింది. నీ పెళ్లి నా పెళ్లిగురించి మాట్లాడితే వెధవ గోలంటావా!"

"సారి సారి—సరే కానీ చెప్పు ఎవ రొచ్చారు?"

"ఎవరేమిటి! సుబ్బిశెట్టి, కంట్రాక్టరు నాగా, ఇంకో సబ్రాజా దిగారు. పెళ్లికే మా నాన, మరియూ మొగపెళ్లి దెబ్బ బాకీ—మావాడి చిక్కేటాల మజా"

"ఎందుకొచ్చారు?"


"ఎల్లుండే కదరా రామాలయం కట్టించే పెద్దమనిషి ఎన్నికలు. మీ మావయ్యకే ఓట్లెయ్యమని పిల్ల ప్రోపగాండా చేస్తారు"

"నాలుగు వేలు రూపాయలు రామ మందిరం కట్టడానికింత గోలవట్రా!" అన్నాడు రామారావు ఆశ్చర్యంగా.

"ఏం చేశా ఏమిటి! ఒకటా రెండా మూడా! నాలుగు వేలు! మీ మావ గెలిస్తే కట్టించే కాంట్రాక్టు తను బాకీ ఉన్న బస్తీ కాంట్రాక్టరు కిస్తాడు. వాడు బాకీ చెల్లగొడ్తాడు."

"ఇక మిగిలే దేమిటి?"

"నీ తలకాయ. నీకు ఇంజనీరింగు సంగతి తెలీదు. అందుకనే నిన్ను వట్టి వెధవన్నా, మఫ్ మరియూ వాజమ్మ అంది. కంట్రాక్టరు బాబు రామమందిరాన్ని వెయ్యి రూపాయల్లో కట్టి పారేస్తాడు. వాడిదగ్గరున్న



విరహాదగ్ధ

నఖచిత్రకారుడు: సి. సంపత్కుమార్—మద్రాస్.

డొక్కు సరుకూ మనవూరి మట్టి పెళ్ళలూ కలిపేసి. రెండు వేల పైచిలుకు మిగులు చేరాయేం!"

"అయ్యా బాబోయ్!—అది సరే—మావాడు గెలిస్తే కంట్రాక్టరు బాగుపడ్డం ప్రజలు మోసపోవడం అటుంచు. నా సంగ తేవిట్రా? ఆ కరణంగారు మావయ్యకు ఓట్లు వేయిస్తే గెలిచిన మర్నాడే పెళ్లి చేయించమంటాడు కాబోలు—ఆం కూతురికే నాకూ! ఓ భగవాన్! అలా చూస్తావేమిటయ్యా!- నీ కళ్లెదురుగా ఎంత అన్యాయం జరుగు తుంటే!"

"ఏం చేస్తాడురా. కొత్త పాప పుణ్యం దేవుడూ దెయ్యం ఆలోచించి భయపడే వాళ్లని దేవుడయినా మందలించి బాగు చేస్తాడు. మొహం ఎదుటే ఘోరాలు చేసి బరి తెగిస్తాం లే. నిర్వాహాయి చూస్తు న్నాడు. మొండివాళ్లే రాజేం చేస్తాడు!"

"బావుంది. మతం, జపం, తపం, పుణ్యం, పాపం వదిలేసి మా మావయ్య సంగతి చూద్దాం...ఒరేయ్ రాజా ఒక్కటి తోస్తోందిరా. గోపాలానికి జీతం ఇచ్చి ఎందుకి ఇక్కడ నా పనికిరావమ్మ. ఈ పెద్దమనుషుల్ని మత్తుగా తప్ప తాగిలెయ్య మందాం"

"ధా!-దవటలా ఆలోచించావురా.

వాళ్లని పబ్లీకున అవమానిస్తే డేంజరు. చూడు ఇది కార్తీకమాసం. పైనెలలో పంటలు కోస్తారు. తిండి గింజలు అమ్ముకోవాలి. సుబ్బిశెట్టి ఈమాటు చాలా ధాన్యం కొంటాడు మన ఊళ్లో. ఎక్కడో టెండర్లు తెచ్చుకున్నాడు శెట్టి. మనం కనక తన్నించినట్లు తెలిస్తే కసి కొద్దీ ఇక్కడ మానేసి ఇంకోచోట కొంటాడు. ఉత్తపుణ్యానికి మనం పాడుపనులు చెయ్యొద్దు. నేచెప్పేది విను. పెద్దమనుషులు ముగ్గురూ ఇంకాక పొరుగూరెళ్లారు. వాళ్లింకాసేపటికి తిరిగొస్తారు కాలవొడ్డున దొంగరాముణ్ణి భిముశినీ, అక్కడెక్కడో అటకాయించి డబాయించి బస్తీకి తరవమని చెప్పి పంపాలే. నీకన్న తెలివైనవాణ్ణే."

"బొత్తిగా ఇంత పెద్ద బుర్రుందనుకోలేదురా రాజా. ఏదో నాటురకం అనుకున్నాసుమా."

"సంతోషించాం కానీ చీకటిపడుతున్నది. పోదాం లే. కరణంగారింటికెళ్లాలి."

"ఏం గిరాకీ?"

"మా బామ్మకి ఉసిరికాయపచ్చడి కావాలి"

"ఒరేయ్. రోజూఓపచ్చడి కావాలంటూ వెడితే కరణంగారు అనుమానపడి తంతాడు రోయ్"

"తంతేసేం రా! సీత మనపిల్లాయె- పైగా అమరప్రేమ ఇలాటివి ఖాతరు చెయ్యదు. పోతే ఇవ్వాళ కాపోతే రేపేనా నేను ఆయనింటికి..."

"మెల్లిగా మాట్లాడరా. చెవులకిగోడలు మొలుస్తాయి."

"గోడలుకాదు - కొండలు మొలచినా ఐ డోంట్ కేర్! నాకు ఖాతరులేదు బ్రదర్. ......" రాజు గబుక్కున ఆగిపోయాడు- రామారావు నివ్వెరపాటు చూసి. మెల్లిగా వెనక్కి తిరిగాడు సుందర్రావు నించున్నాడు వెనకాల - మాటామంతీ ఆడుకుంటున్న లైలా మజ్నూలమధ్య దిగిన లైలాతండ్రికిమల్లే.

వీర్రాజు ఎందుకయినా మంచిదని ముందుకు జరిగి గిర్రున తిరిగి సుందరంవంక చూశాడు.

సుందరం ఆజానుబాహుడు. పాల్ రాబ్సన్ గొంతుక

"గోడలికి చెవులేకాదు. మనుషులు కూడా మొలుస్తారు తెలుసా?" అన్నాడు గంభీరంగా నడ్డిమీద చేతులు వేసుకుని అపరాధ పరిశోధకుడు అజయ్‌బాబు పోజులో-

(ఇంకావుంది)

వాన వెలిసింది

సరోజినితో నావివాహం నిశ్చయమైంది. పెద్ద వాళ్లు నలుగురూ చేరి ఒకళ్ళ వంశమర్యాదలు ఒకళ్లు కూడబలుక్కుని కట్నం కానుకల విషయంలో ఏ పేచీ పూచీలూ లేకుండా ఖచ్చితంగా తేల్చుకుని నిశ్చయం చేసుకునే బాపతు పెళ్ళికాదిది. అసలు పెద్దలంటూ ఎవరూ లేకపోబట్టే పొట్టకోసం దేశాంతరాలు ఇలా వచ్చి, నదిలో కొట్టుకునిపోయే రెండు పుల్లల్లా కలుసుకున్నాం నేనూ సరోజినీను. మొదట స్నేహంగా రూపొందిన ఈపరిచయం చివరికిలా పరిణమించబోతోందంటే అందుకు బాధ్యత ఇద్దరిదీ సరిసమానమే అని చెప్పాలి. నా అంతట నే వెళ్ళి ఆమె పాదాక్రాంతుడ్నై నా వ్యక్తిత్వాన్ని ఆమె ముందు తాకట్టుపెట్టి 'నా జీవితాకాశంలో నువ్వు లేకపోతే మబ్బేసినట్టుగా' ఉంటుందంటూ నే నేమీ ప్రణయ కవిత్వం అప్పచెప్పలేదు. అలాగే ఆమె కూడాను. నిండు కుండలా ఏమాత్రం పైకి తొణక్కుండా మసులుకుంది. అయితే ఈ జరగబోయే వివాహం ఎలా నిశ్చయమైందని మీరు ప్రశ్నించొచ్చు. అదంతా ఓ విచిత్రమైన గాథ.

జీవితంలో ఎన్నో కలలు కని, ఏవేవో ఊహించుకుని, అవన్నీ నన్ను మోసం చేసినప్పుడు, ఆకులేని మోడైపోయిన నా జీవితం సరోజిని పరిచయంతో తిరిగి చిగురు తొడిగింది. నా మనసు వికసించినట్టయింది. నాది ప్రేమనండి, కాకపోతే వ్యామోహం అనండి సరోజిని నా వస్తువైపోవాలని మనసులో మహా తహతహలాడిపోయాను; పైకి వ్యక్తిత్వం నిలబెట్టుకుంటూను. కాని తెగించి ఎలా ఆ ప్రస్తావన తీసుకురావాలో చేతకాక వానకురిసి వెలిసిన ఓ సాయంత్రం "మీతో ఓమాట చెప్పాలనివుంది అలా వెళ్దాం వస్తారా?" అని నే ననగానే "నేనూ ఓమాట చెబుదామనుకుంటున్నాను. పదండి" అంటూ ఒక అడుగు కిందికి జారిపోయానా అనుకుని పోయినవ్యక్తిత్వంకోసం బాధపడుతున్న నన్ను మళ్ళీ నిలబెట్టింది. ఇద్దరం అడగదల్చుకున్న దేవిటో కాగితాల మీద రాసుకుని ఒకళ్ళ కాగితం ఒకళ్ళం చదువుకున్నాం. మా ఇద్దరి ముఖాలూ సిగ్గుతో జేవురించాయి. కళ్లు మూతలు పడిపోతున్నాయి. కంటి చివరినించి ఒకళ్లి నొకళ్లం చూసుకున్నాం. ఇదంతా రెండు నిమిషాల్లో జరిగిపోయింది.

ఫలానారోజు ఫలానా ఇన్ని గంటలకు, ఫలానా ఫలానావారి సమక్షంలో రిజిస్ట్రార్ ఆఫీసులో మా వివాహం జరుపుకుందుకు నిశ్చయించుకున్నాం. పెళ్లిఖర్చు పాతిక, ముప్ఫైకి మించకూడదు. అప్పట్నించి మా ఇద్దరిమధ్య దనువు హరించుకుపోవటం మొదలెట్టింది. పక్కనే కూర్చుని కబుర్లతో కరిగించి కిలకిలా నవ్వి పకపకా నవ్వించే సరోజిని రెండురోజుల కొకమారు కనిపించి, ఆ కాస్తసేపూ మూతి బిడాయించుకుని అడిగితే జవాబు చెప్పి, అడగాలనుకున్న ప్రశ్నలు మనసులోంచి బైట పెట్టలేక ఇలా సతమతమైపోతోంది. ఆమే కాదు నేనుకూడా అలాగే మసులుతున్నానా అనే ఆత్మపరీక్ష చేసుకుంటే నాగురించి కూడా సరోజిని ఇలాగే భావిస్తూండవచ్చు అని తేల్చుకున్నాను.

పురాణం సూర్యప్రకాశరావు

పెళ్లి!... ఈ రెండక్షరాల ముక్క గతించిపోయిన స్మృతుల నెన్నిటినో మెదడులో గిరగిరా తిప్పేసింది. బుర్ర వేడెక్కిపోయింది. కళ్లు మండాయి. హృదయం బరువెక్కిపోయింది రెండు కన్నీటిచుక్కలు అప్రయత్నంగా నా కంటినించి చెంపల మీదుగా జారటం సరోజిని చూడలేదు. కాని సరోజినికూడా కళ్లు తుడుచుకోవటం నేను గమనించాను. నేను గమనిస్తున్నానని గ్రహించి తత్తరపడుతూ తెచ్చికోలు నవ్వుతో సిగ్గుపడుతూ ముఖం తిప్పేసుకుంది. ముందు కొంత కంగారుపడ్డా అవి ఆనందబాష్పాలని తీర్మానించుకుని నా మనసుకు ఊరట కల్గించాను. మాకు వంశమర్యాదలతో పని లేదు, కులభేదాలతో పనిలేదు, అసలా ప్రస్తావనే రాలేదు. 'మీదే కులం?' అని నే నామెను అడగలేదు. ఆమె నన్నూ అడగలేదు. కాని ఒక విషయంమాత్రం నాకు తెలుసు. సరోజిని మాంసాహారి మటుకు కాదు. ఆహార విషయంలో, ఆచారాది విషయాల్లోనూ మా ఇద్దరిమధ్యా వైరుధ్యం లేనప్పుడు ఆమె ఎవరైతేమటుకు నాకు దేనికి? అదే అభిప్రాయం ఆమెకూడా వెలిబుచ్చింది. సరోజినికి ఎంత ఆస్తిఉందో నాకూ అంతే ఉంది. కాకపోతే సంపాదించిన దానిలో నే జాగ్రత్తగా వాడుకుని కొద్దిగా వెనక వేసుకునే లక్షణం సరోజిని దగ్గర ఉందిగాని నాదగ్గిర లేదు. ఆ విషయంలో భార్య అజమాయిషీలో మా సంసారం ఏ ఒడుదుడుకులూ లేకుండా సాగిపోగలదనే ధైర్యం నాకుంది.

సరస్వతిమటుకు సరోజినిలాంటిది కాదు. నా మోస్తరుగానే ఖర్చుమనిషి. ఆదివారం అందలం సోమవారం జోలి. సరస్వతి తలపుకు రాగానే మనసంతా ఏదో అవ్యక్తంగా కుమిలిపోతుంది. ఏపనీ చెయ్య బుద్ధిపుట్టదు. అమాయకమైన ఆమె నవ్వు నా మనసంతా నిండిపోయి ఏపని తోచనివ్వదు, మరో చెంప సరోజినిని అసలు నిజం కప్పిపెట్టి మోసం చేస్తున్నానా అనే బాధ. రెండు వైపులనించి మనిషిని దహించివేస్తున్నాయి. ఒకదాని వెంట మరొకటి చొప్పున ఆలోచనలు తోసుకు రాసాగాయి. నన్ను నేను సమర్థించుకుందుకు పూనుకున్నాను. అవును తప్పేముంది? ఒకభార్య చనిపోతే మరో

★ 'వానవెలిసింది' ★

పెళ్లి చేసుకుంటున్న నాకు మువ్పైఏళ్ళైనా నిండలేదే? యౌవ్వనం సడలని నేను పాతికకై బడ్డ సరోజినికి ఈడూజోడూ కానూ? అర్హనకేమీ లోటు లేదు. కాకపోతే ఈ రహస్యం ఆమె చెవిని వేసినందువల్ల ఒరిగే దేమిటి? ఆమె మనసు మార్చుకుంటే?— భయంకరమైన ఆలోచన నన్ను వెన్ను చరిచినట్టుగా లేపి నిలబెట్టింది.

"చీకటిపడింది. ఒస్తాను సరూ" అంటూ హోటల్ వేపుకి బయల్దేరాను. నాలుగడుగులు వేసి వెనక్కి చూశాను. సరోజిని నావైపు చూస్తూ నిలబడిఉంది. నాకళ్లు చెమ్మగిలాయి. బలవంతాన మనసుని అదుపులోకి తెచ్చుకున్నాను. ఏమైనా సరే ఈరహస్యం బైటపెట్టి సరోజినికి దూరం కావటం నాకిష్టంలేదు. సరోజిని నా వస్తువు. అందుకెవరూ ఆటంకపర్చలేరు. హోటల్లో భోజనం చేస్తున్నంతసేపూ ఇదే ఆలోచన. అన్నం సయించలేదు. గబగబా ముగించి ఇంటికి వచ్చేశాను. హరికేన్ లాంతరు వెలిగించి టేబిల్ ముందు కుర్చీలో కూర్చుని చేతికితగిలిన పాతపుస్తకం చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పసాగాను. సరస్వతి తనస్నేహితురాలితో కలిసి తీయించుకున్న ఫోటో నాకంటబడింది. కళ్లుమూసి పెదాలు బిగపట్టి దుఃఖాన్ని అణచుకున్నాను. గడుసుతనం లేని సరస్వతిని అందంచూసి పెళ్లి చేసుకున్నానుగాని ఆస్తిని చూసికాదు. అలాగే చేసుకుని ఉంటే వంశం నిలబెట్టటంకోసం అంటూ ఆమె తండ్రి మరుపెళ్లి చేసుకున్నాడు కనీసం సరస్వతి దగ్గరైన ననిగేవాడ్ని. అసలా ఉద్దేశమే లేనప్పుడు అలా సంకుచితంగా సంచరించటం ఎలా జరుగుతుంది? సరస్వతిని నేను చాలా గౌరవించాను. ఆనాడు ఆయింట్లో నాకెంత అధికారం ఉందో ఆమెకీ అంతే ఉంది. ఆమె బ్రతికిన నాలుగు సంవత్సరాలూ నాలుగురోజులుగా గడిచిపోయాయి. ఆతర్వాత సరోజిని పరిచయం అయేవరకూ నిమిషం యుగంగా గడిపాను. కృంగిపోయిన హృదయాన్ని సరోజిని పరిచయంతో కుదుటపరుచుకున్నాను. నా సరస్వతి ఈ రూపంలో మళ్లా నాదగ్గరకొచ్చిందా అనిపించింది. అలాగే భావించాను. కాని తొందరపడి మనసు బైటపడేస్తే ఆమె పెదవి విరిస్తే పర్యవసానం చాలా ఘోరంగా ఉంటుందనే అభిప్రాయంతో బైటికి ఇంతవరకూ తొణకలేదు. ఒక భార్యచనిపోతే మరోపెళ్ళి చేసుకోవటం తప్పా? సరోజిని అభిప్రాయం ఏమై ఉంటుంది? ఆ మాత్రం సంస్కారం ఆమెలో లేకుండా పోతుందా? ఆపాటి సంస్కారమే ఆమెలో లేనిపక్షంలో అటువంటిమనిషిని వివాహం చేసుకుంటే ముందు ముందు నేనెలాంటి సమస్యల్ని ఎదుర్కోవాలో, ఒకవేళ ఎప్పుడైనా ఈరహస్యం బైటపడితే అప్పుడు అటువంటి వ్యక్తితో కాపరం ఎంత అవాంఛనీయంగా పరిణమిస్తుందో నాకు తెలుసు. నేనీరహస్యం మనసులోనే దాచిపెట్టుకుని అతలాకుతలమైపోవాల్సిన అవసరం లేకుండా సరోజిని నాకు మనశ్శాంతి చేకూర్చలేదా? ఆమె కౌగిలింమీద రాసినట్టుగా నన్నంత గాఢంగా ప్రేమిస్తున్న పక్షంలో ఈపాటి చిన్నవిషయాన్ని క్షమించి తోసిపారెయ్యటం సరోజినికి చేతకాదా?—లక్ష ప్రశ్నలు నాలో ఉద్భవించాయి. అంతే కాదు సరోజిని మనస్తత్వమెలాంటిదో ఈ విషయం మీద తేలిపోవాలని కూడా నిర్ణయించుకున్నాను. ఇలా ఒక నిశ్చయానికి వచ్చింతర్వాతగాని నాకారాత్రి నిద్రపట్టలేదు.

* * *

ఉదయం. గడియారం పదిగంటలు కొట్టింది. 'ప్రకాశరావుగారూ' అంటూ సరోజినికంఠం వినిపించగానే "నేనూ రెడీగా ఉన్నాను" అంటూ చొక్కా సర్దుకుంటూ ఇవతలికి వచ్చాను. సరోజిని కుర్చీలో కూర్చుని పత్రిక తిరగవేస్తూ నన్ను చూసి తలెత్తి "ఇవాళనించీ నేనూ మీహోటల్లోనే భోజనం చేస్తాను. ఇవ్వాళే టిక్కెట్లు తీసుకుంటాను" అంది. సరోజిని నేనూ పనిచేసేది ఒకటే ఆఫీసులోనైనా భోజనంమటుకు వేరేవేరే హోటళ్ళలో. "నేనే మార్చుకుందాం అనుకుంటున్నాను. ఎలాగైతేనేం? మంచిపని చేశారు," అన్నాను, అద్దంముందు నిల్చుని తలదువ్వుకుంటూను. రాత్రి నిర్ణయం మటుకు నేమర్చిపోలేదు. సమయం కనిపెట్టి అడగాలనే ఆత్రుత నాలో క్షణక్షణం ఎక్కువై పోతోంది.

తలుపు తాళంవేసి ఇద్దరం రోడ్డుమీదికొచ్చేశాం. ఎండ ఎర్రగా పాకిపోతోంది. "మా స్నేహితుడొకడు ముప్ఫై ఏళ్లొచ్చిం తర్వాత మొందటి పెళ్లాం చనిపోతే ఇప్పుడు మళ్లీ పెళ్లి చేసుకుంటున్నాడు. రెండో పెళ్లి చేసుకునేవాళ్ళగురించి మీ అభిప్రాయం ఏమిటి?" అన్నాను ఉన్నట్టుండి. అంటూనే ఆమె ముఖంలోకి పరిశీలనగా చూశాను. ఆమె ముఖం ఎర్రబడి గంభీరంగా ఉండటం గమనించాను. సరోజిని నాకు దగ్గరయేదీ దూరం అయేదీ ఇప్పుడే తేలిపోవాలి. నాగుండెలు వేగంగా కొట్టుకున్నాయి. పెదాలు వణికాయి. ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. నా ఆత్రుతకి తగ్గట్టే సరోజిని నోరు మెదపటం లేదు. వినిపించుకోనట్టుగా రోడ్డునార చెట్లమీద కాకిగూళ్ళకేసి చూస్తోంది. ఆమెకి వినబడలేదు కాబోలు అని మరోమారు ఆ ప్రశ్న రెట్టించాను. ఆమె ముఖం చిట్లించి విసుగ్గా "పోనిద్దురూ. మధ్య మనకెందుకీ మెదడు ఖరాబు?" అంటూ తేలిగ్గా తోసిపారేసింది. నా మనసులో ప్రశ్న ప్రశ్నలాగానే ఉండిపోయింది. ఆమె అభిప్రాయం మటుకు బైటపడలేదు. సరోజిని ఎందుకు విసుక్కున్నట్టు? నాకంతా అయోమయం అయిపోయింది. ఈ సంఘర్షణ అంతమైపోయి నా మనసు శాంతిస్తుందనే ఆశతో ఉన్న నేను మళ్ళీ ఎప్పటిమాదిరి స్థితిలోకి వచ్చి పడ్డాను. చివరికి తెగించి వున్న విషయం చెప్పేద్దామా అనిపించి మనసులో ఉన్నది నాలిక చివరిదాకా వచ్చాక ప్రయత్నించి ఆపుకున్నాను. ఒకవేళ ఆమెకి ఇష్టంలేకపోతే? ఆమె మనసు విరిగిపోదూ? నా హృదయంలో హృదయం సరోజిని నాకు దూరం అయిపోవటం నేను సహించగలనా? అలాగని ఈ రహస్యం దాచిపెట్టి ఆత్మవంచన చేసుకోనా? ఉన్న నిజం గ్రహించి సంస్కార హృదయంతో సరోజిని ఈ చిన్న అపశ్రుతిని పెదవి విరిచి "ఇంతేనా?"

...ది, నన్ను ప్రేమించగలిగిన్నాడు మా కాపరం ఆనందంగా ఉంటుందా? కాకపోతే ఆ రహస్యం నేను దాచిపెట్టి ఇప్పుడే నూతనంగా వైవాహిక జీవితం గడుపుతున్నట్టుగా ఆమె భావిస్తూంటే నేను అవునన్నట్టుగా మనసులో తిరుగుబాటును అణిచిపెట్టి నటిస్తే హాయిగా ఉంటుందా? నా అంతరాత్మ అందుకీ ఒప్పటంలేదు ఇందుకూ ఒప్పటంలేదు. కారణం సరోజిని ఎల్లాంటి మనిషో పూర్తిగా నాకు తెలియకపోవటం. ఎలా చావటం! ఈ సంఘర్షణతో నేను నలిగిపోతూనే సరోజిని కూడా ఎందుకో అదో మాదిరిగా ఉండటం గ్రహించాను. "అదేం సరోజినీ అలా పరాగ్గా ఉంటున్నావు?" అని అడిగాను ఓమారు. "అబ్బే! ఏమీ లేదు! మామూలుగానే ఉన్నాను" అంటూ గొణిగింది.

మరోమారు అదే ప్రశ్న సరోజిని నన్ను వేసింది "అలా ఉంటున్నావేం?" అని.

గతుక్కుమన్నాను. గుండెలు కొట్టుకున్నాయి. "ఏమీలేదు" అంటూ నాన్చేశాను.

తనకి ఒక్కగానొక్క తమ్ముడున్నాడని, వాడంత విద్యాధికుడు కాడని, ఎక్కడ ఎలా ఉంటున్నాడో అంటూ నిట్టూరుస్తూ బాధపడుతూ నాతో చాలాసార్లు చెప్పింది. ఆమె ముఖంలో ఈ మార్పుకి కారణం ఆ తమ్ముడు జ్ఞప్తికి రావటం అయిఉంటుందని నేను ఊహించాను. ఆమెను ఓదార్చాను. "తమ్ముడికోసం బాధపడకు సరూ. మనిద్దరం కలిసి సంపాదిస్తున్నాం. మన సంపాదన ముగ్గురికి చాలకపోతుందా, అతన్నీ ఒచ్చెయ్యమందాం" అంటూ నచ్చచెప్పాను.

ఆమె పేలవంగా నవ్వి ఊరుకుంది.

హోటల్లో భోజనం పూర్తిచేసుకుని ఆఫీసుకి వెళ్లిపోయాం. ఎవరి సీట్లలో వాళ్లు వెళ్ళి కూర్చున్నాం. ఆడ గుమాస్తాలంతా సరోజినిని చుట్టేశారు. నేను నవ్వుతూ వాళ్ల మధ్యనించి సరోజినిని చూస్తుంటే పకపకా నవ్వే కొంగ గొంతుకలు నన్ను చుట్టుముట్టాయి. అంతా ఎవరికి తోచినట్టుగా వాళ్లు వేళాకోళాలు మొదలుపెట్టారు. ఉక్కిరిబిక్కిరైపోయాను. ఇదంతా ఒక్క నిముషం. అధికారి కంఠం వినిపించగానే అంతా కిక్కురుమనకుండా ఎవరి స్థానాల్లోకి వాళ్ళెళ్ళి కూర్చున్నారు.

* * *

రాత్రి మంచంమీద వారబడి ఆలోచించసాగాను. ఎటూ పాలుపోవటంలేదు. హరికేన్ లాంతరు మసక మసకగా వెలుగుతోంది. లేచి టేబిల్ ముందు కూర్చుని కాగితం కలం తీసి సరోజిని పేర ఉత్తరం రాయసాగాను.

"ఒక ముఖ్యవిషయాన్ని నీముందు విప్పి చెబుతున్నాను. ఏమాత్రం ఆవేశానికి, ఆగ్రహానికీ లోనుకాకుండా నిశితంగా ఆలోచించి ఒక నిర్ణయానికి రాగలవనీ, ఆ నిర్ణయం నాకెంతో సంతృప్తి కలిగించగలదనీ నమ్ముతున్నాను. ఒక నిజాన్ని నీ ముందు దాచి, నిన్ను మోసంచేసి, నీ ముందు ఘరానాగా సంచరించటం నా ఆత్మకు సమ్మతంకాదు. ఎందుకంటె నాకు కాబోయే భార్య ఎంతో సంస్కారం కలిగిందైతే నాకు చాలా తృప్తిగా ఉంటుంది. ఉన్న నిజాన్ని నీముందు ఉంచుతున్నాను. అదేమీ నువ్వు క్షమించలేని విషయంకాదు. సంస్కారహృదయం ఈ చిన్నవిషయాన్ని పట్టించుకోనట్టే మసులుకోగలదు. నేనైతే అలాగే చేసేవాణ్ని. మీరుకూడా నాతో ఏకీభవించగలరని ఆశిస్తున్నాను. నాకు ఇదివరకే వివాహం అయింది. ఆమె పేరు సరస్వతి. నాలుగు సంవత్సరాలు ఆమెతో కాపరం చేశాను. ఆ తర్వాత ఆమె చనిపోయింది. పిల్లలు లేరు. నీ జవాబుకోసం ఎదురుచూస్తూంటాను."——ఇలా రాశాను ఉత్తరం. నా మనస్సు తేలికపడింది. ఈ ఉత్తరం మొర్నాడే పోస్టు చెయ్యటానికి గట్టిగా నిశ్చయించుకున్నాను.

* * *

తెల్లవారి లేచేసరికి బారెడు పొద్దెక్కింది. బద్ధకంగా లేచి కళ్లు నులుపుకుంటూ తలుపు తీసుకుని మధ్యగదిలోకి వచ్చాను. బ్రష్ పేస్టూ తీసుకుని వీధి అరుగుమీదికి నడిచాను. దూరంగా చేతి సంచీతో సరోజిని ఇటు వైపే రావటం గమనించాను.

నేను ముఖం కడుక్కుంటూంటే సరోజిని వచ్చింది. "అలా లోపలికి వెళ్ళి కూర్చో." అన్నట్టుగా సౌజ్ఞ చేశాను. ఆమె లోపలికి వెళ్ళిపోయింది. సరోజిని కంటిముందు కనిపిస్తే మునుపటిలా మనసు ఆనందంతో ఉరకలు వెయ్యటంలా. గుండెలు గబగబా కొట్టుకుంటున్నాయి. చేజేతులా ఈలంపటంలో ఎందుకు దిగబడ్డానా అనిపిస్తోంది.

నేను లోపలికి వచ్చేసరికి సరోజిని కిటికీ వారగా నిలబడి ఆకాశంలోకి చూస్తోంది. ముఖం తుడుచుకుని ఆమె వెనకాతలే వెళ్ళి నిలబడ్డాను. చల్లటిగాలి తెరలు తెరలుగా వీస్తుంటే ఆమె ముంగురులు మెల్లగా అటూ ఇటూ కదుల్తున్నాయి.

"సరోజినీ!"

సరోజిని ఉలకలేదు. పలకలేదు. కనీసం ముఖమైనా ఎత్తలేదు.

మళ్లీ పిలిచాను.

ఈమారు సరోజిని ముఖం నావైపు తిప్పింది.

ఆకళ్లలో కాంతిలేదు. ముఖం బరువుగా కనిపించింది. "అదేం అలాగున్నావ్?" అన్నాను ఆత్రుతగా.

"మిమ్మల్ని ఒకటడుగుతాను. సూటిగా జవాబు చెబుతారా?" అంది సరోజిని.

"ఏమిటది? అడుగు"

"ఒకభర్త చనిపోతే ఆడది మరో పెళ్లి చేసుకోవటం గురించి మీ అభిప్రాయం ఏమిటి?" అంది సరోజిని.

"ఏం అలాగడుగుతున్నావు?"

"నాకిదివరకే వివాహం అయింది. నాలుగు సంవత్సరాలు కాపరం చేశాం. తర్వాత ఆయనపోయారు. పిల్లలులేరు. నన్ను పెళ్లిచేసుకోవటం ఇప్పుడు మీకిష్టమేనా?"——ఆమె ఆత్రుతగా నా ముఖంలోకి చూసింది, ఈమాటలని.

క్షణం నివ్వెరపోయాను. మరుక్షణం నామనసంతా ఉల్లాసంతో గంతులు వేసింది. మా ఇద్దరిలోనూ ఎవరూ ఎవరివిషయంలోనూ ఔదార్యం చూపించాల్సిన అవసరంలేదు. అసలు సమస్యేలేదు. ఇన్నాళ్లూ జరుగుతున్న సంఘర్షణ ఆ నిముషంలో చప్పగా చల్లారిపోయింది. ఆనందాతిశయంతో ఆమెను హృదయానికి హత్తుకుని "నువ్వు నాదానివిసరూ" అన్నాను. ఆమె ముఖం వికసించింది. సిగ్గుతో కుంచించుకుపోయింది. నాలో స్వార్థం కొంత దాక్కుని ఉంది కాబోలు క్షణం నారహస్యం బైటపెట్టటానికి వెనకాడాను. ఈవిషయం బైటపెట్టాల్సిన అవసరంలేదు నిజానికి. కాని నన్నుగురించి ఆమె ఎలా భావిస్తూంటుంది? ఈ రహస్యం బైటపెట్టటంవల్ల వచ్చేనష్టమేమీ లేనప్పుడు ఆత్మవంచన చేసుకోవటమెందుకు? తనకంటె నేనెంతో ఉత్కృష్టమైన వ్యక్తిననీ, కాబట్టే జీవితంలో మొదటిసారిగా వివాహం చేసుకుంటూనే వితంతువుని సుమంగళిని చేశాననీ ఆమె అపోహపడి, జీవితపర్యంతం నాకు కృతజ్ఞురాలుగా ఉండటం నా ఆత్మకి సమ్మతం కాలేదు. అందుకనే మనసు విప్పి రహస్యం బైటపెట్టేశాను.

సరోజిని క్షణం నివ్వెరపోయినట్టుగా చూసి, లిప్తలో ముఖంఅంతా వికసింప చేసుకుని, గుండెలమీద బరువంతా తీరిపోయేట్టుగా నిట్టూర్చి, "మనిద్దర్నీ దేవుడు విచిత్రంగా జతపర్చాడు" అంది.

ఇప్పుడు ఇన్నాళ్లకి నామనసు పూర్తిగా కుదుటపడింది. గాలివాన కురిసి వెలిసినప్పటి ప్రశాంతత నాహృదయాన్ని ఆవరించింది. అనవసరంగా తన్నుతాను తక్కువచేసుకుంటే ఎదుటివాడు తనకంటె ఉన్నతమైన వ్యక్తిగా భావించాల్సిన అవసరంలేకుండా ఆమెను సమానమైన అంతస్థులో నిలబెట్టగలిగానన్న సంతృప్తితో ఆమె ముఖంలోకి చూశాను. అంతవరకూ నావైపు చూస్తున్న సరోజిని తన దృష్టిని కిటికీవైపుకి తిప్పుకుంది. ★

'వాడికేం తెలుసు?'

మూలం: **ఐ. టర్గినీవ్**

అనువాదం: **"గోపాల్"**

ఏ మాత్రం తెలివితేటలు లేని ఒక మూర్ఖుడు వుండేవాడు ఒక వూళ్లో. చాలా రోజులవరకూ అధి వ్యాధి లేకుండా ఎంతో సంతోషంగా తన జీవితాన్ని గడిపాడు. కాని ఆవూళ్లో అందరూ తనని వొట్టి తెలివి తక్కువదద్దమ్మకింద జమకట్టేశారని ఆనోటా ఆనోటా పుకారుగా తెలిసింది.

ఎప్పుడైతే ఈ సంగతి తనకి తెలిసిందో ఆనాటినుంచీ ఈ పుకార్లని ఏవిధంగా అరికట్టడమా అని అనేకవిధాల ఆలోచించాడు.

ఇలా ఉండగా ఒకనాడు ఒక చక్కని ఆలోచన మెరుపులా మెరిసింది....అంతే! ఆ క్షణంనుంచే అమూల్యమైన ఆ ఆలోచనని ఆచరణలో పెట్టేశాడు. ! –

ఆనాడు వీధిలో వెళుతూండగా ఒక పరిచయస్థుడు ఎదురై ఒక ప్రసిద్ధ చిత్రకారుణ్ణి పొగడడం మొదలు పెట్టాడు.

మనమూర్ఖుడు "హారి భగవంతుడా! ఇంకా నువ్వు పెరటిదారినే వున్నావ్? ఆ చిత్రకారుడు అసలు ఇక్ష్వాకులకాలంలో వుండతలసినవాడు – అతని చిత్రాలు బూజుపట్టి ఎన్నాళ్లో అయింది! నువ్వుకూడా అతణ్ణి ఇన్నివిధాల పొగడుతూంటే నిన్నేమనాలో అర్థం కావడంలేదు!" అని తడుముకోకుండా వల్లించాడు.

ఆ పరిచయస్థుడికి వచ్చి వెలక్కాయ గొంతుకలో పడ్డంతపనైంది. మళ్లీ జవాబు చెప్పకుండా మూర్ఖుడితో ఏకీభవించి వెళ్ళిపోయాడు.

ఇంకొక కొంతదూరం వెళ్ళాక మరొక పరిచయుసుడు కనబడి "ఇవాళ నేను ఒక మహత్తరమైన గ్రంథాన్ని చదివాను; ఏమి రచన! ఎలాంటి అభిప్రాయాలు!!"

"ఔరా! ఆ చెత్తపుస్తకాన్నా ఇన్ని విధాల వర్ణిస్తున్నావు?—అసలీ రోజులలో ఆ పుస్తకాన్ని ఎవరైనా తెరుస్తున్నారటయ్యా? వొట్టి బుర్ర లేనివాళ్లావున్నావే! ఈ రోజుల్లో వుండవలసిన మనిషివి కావు! అంతా పురాతనపు సరుకు!" అంటూ ఊపిరి సలపకుండా ఏకరువు పెట్టాడు.

దీనికి సమాధానం ఏమి చెప్పాలో తోచక ఆ పరిచయస్థుడు "ఔను! ఔను" అంటూ చల్లగా జారుకున్నాడు.

ఇంకొకనాడు మరొక పరిచయస్థుడు ఎదురై "మనవాడు" వున్నాడే ఎంత మంచివాడు! ఒకళ్లచేత మాటపడి ఎరగడు సుమా. చాలా తెలివిగల మనిషి!"అంటూండగా అడ్డం వచ్చి

"ఇక తగ్గు మరి. అతడి సంగతి నాకు చెప్తావేమిటి? వాళ్ళ సంసారాన్ని నిలువునా గంగలో దింపింది వాడేగా! ఈ సంగతి ఈ వూళ్లో ప్రతీవాడికీ తెలుసు. నీలాంటి పురాతనపు మనిషిని నేనెక్కడా చూడలేదు—అంటూ ఒక తెర వల్లించాడు.

ఈ మూడో పరిచయస్థుడికి కూడా ప్రాణం విసిగి, మన మూర్ఖుడితో వాదించలేక 'ఔను నీమాట నిజమేస్మీ!' అంటూ వెళ్ళిపోయాడు.

ఎంత గొప్పవాడైనాసరే, ఎంత గొప్ప విషయమైనాసరే మన మూర్ఖుడిదగ్గర ఎవరైనా ఎత్తారంటే ఒక్కటే సమాధానం! "వాడికేం తెలియదు ఒట్టి దద్దమ్మ" ఇంకా ఎదుటివాడు మాట్లాడడానికి ప్రయత్నిస్తే 'అసలీవిషయాలన్నీ వొడి కడపోసిన నాబోటిగాణ్ణే నువ్వు కాదంటావ్!' అని కళ్లెర్ర జేసేవాడు. –

"ఒట్టి కోతిరకం! తల విసురుమనిషి! అంటూ ప్రజలు తలొకమాటా అనేవారు ఆ మూర్ఖుని చూసి. ... అయినా ఏం తెలివితేటలు!" అని మెచ్చుకొనేవారు.

"ఏంవాక్కు – ఏం ఉపన్యాసధోరణి!! ప్రతీదీ గళగ్రాహి కదూ!..." నిజంగా తెలివైనవాడు!!" అని మరికొందరు అనేవారు.

ఈవిధంగా అందరూ తలొకవిధంగానూ చెప్పుకొంటూండగా ఒకనాడు ఒక సుప్రసిద్ధపత్రికాధిపతి మనమూర్ఖుని తన పత్రికలో ప్రధానసమీక్షకుని గానియమించాడు.

ఆక్షణంనుంచే మన మూర్ఖుడు ప్రతిపుస్తకాన్నీ, ప్రతివ్యక్తినీ మామూలుధోరణిలోనే విమర్శించడం మొదలు పెట్టాడు.

ప్రతిఉద్గ్రంథాన్నీ, శాస్త్రాలలో నిధులైనవాళ్లనీ ముందూ వెనుకా చూడకుండా విమర్శించిన మూర్ఖుడతనే ఇప్పుడు ప్రతి విషయంలోనూ 'నిధి' యై కూర్చున్నాడు. యువకులందరూ అతణ్ణి మహావ్యక్తిగా పూజిస్తూ, అతనంటే ఎంతో భయపడసాగారు. భయపడక చేసేదేముంది – మన మూర్ఖుడి అభిప్రాయంలో ఇతరులని పొగడడం తప్పైనా, ఈ విషయంలోమాత్రం తన అభిప్రాయాల్ని పాపం ఆయువకులు శిరోధార్యంగా తీసికొనవలసి వచ్చింది లేకపోతే వాళ్లు ఈ కాలంలో ఉండవలసినవాళ్లు కారన్నమాట! వాళ్ల అభిప్రాయాలు బూజుపట్టిపోయాయన్నమాట!!

అందుచేతనే మూర్ఖులు పిరికివాళ్ళని ఉపయోగించుకుని బ్రతుకుతూంటారు! ★



గృహనిర్వహణ: తూకములు నాణెములు

పాపాయి గుక్కపట్టి ఏడుస్తున్నది. గ్లాసుతో పాలు తాగలేదు - దంచాతో తాగదు. పుట్టినప్పటినుంచీ అలవాటయిన పాలసీసాను కోపముకొద్దీ నెట్టి పగులకొట్టింది.

అది సాయంకాలము. తల్లికి పనివేళ. స్కూలునుంచి పిల్లలు ఇంటికి వస్తారు; కచేరీనుంచి పెనిమిటి వచ్చే వేళ అయింది. అందరికీ కాఫీలు ఉపాహారాలు అందించాలి. పెనిమిటిగాని పిల్లలుగాని అక్రిందటి రోజునుంచీ తెమ్మని చెప్పిన పాలసీసాను కొని తెస్తారేమోననుకుంటే, అందరూ వట్టి చేతులతోనే ఇంటికి వచ్చారు. పైగా— 'నీవు బజారుకు వెళ్ళి తెచ్చుకోకూడదూ - అన్నిటికీ మా మీద ఆధారపడకపోతే? ఇంట్లోకి కావలసినవన్నీ చూసుకొని తెచ్చుకో. పగలంతా ఏంజేస్తావు? అయినా మేము తెచ్చినవి నీవు మెచ్చుతున్నావా? తెచ్చిన ప్రతివస్తువునూ తిప్పిపంపటములేదూ?' అని పెనిమిటి ఎదురుప్రశ్న వేస్తాడు.

ఈ స్థితిలో ఇల్లాలిపరిస్థితి కళ్లనీళ్ల పర్యంతముగా ఉంటుంది.


కాని - గృహస్థుమాటలలో యథార్థము లేకపోలేదు. ఒక పాలసీసావిషయమే కాదు - మిగతా సామానుల విషయములో కూడా ఇంతే. వంటయింటి సరుకులూ వాటి నాణ్యమూ యజమానికి ఎట్లా తెలుస్తుంది? వాటిని ఉపయోగించేవాళ్ళకు తప్ప ఇతరులకు ఆ వివరాలు ఎట్లా తెలుస్తాయి? ఒక్కొక్క బావినీళ్ళతో కందిపప్పు ఉడకదు. ఉడకనికందిపప్పులో సోడా వేయ

ఇల్లిందల సరస్వతీదేవి

చాయపప్పులో ఉన్న జిగురు చాలి నట్లనిపించదు. వక్కపొడి కొన్నదానికంటె మంచి వక్కలు కొని ఇంట్లో చేసుకొంటేనే రుచిగా ఉంటుంది; పైగా చౌకగా కూడా ఉంటుంది. సెనగపిండి కొన్నదానికంటె సెనగపప్పు విసరించుకొంటే బాగుంటుంది. ఇలాగే ఇంట్లో చేసుకోవటానికి గాని, చేయించుకోవటానికి గాని వీలయినవి ఇంట్లో తయారు చేసుకొంటేనే బాగుంటాయి.

వస్త్రాల విషయములో కూడా పిల్లలకు కావలసినవీ గృహిణికి కావలసినవీ మగవాళ్ళకు ఎట్లా తెలుస్తాయి? ఇల్లాలి కట్టుడు చీరెలు ఏ రకముగా ఉండాలో, అడపాదడపా కట్టుకొనేవి ఎట్లా ఉండాలో ఆమెకు తెలిసినట్టుగా ఇతరులకు తెలిసే అవకాశము ఉండదు. పిల్లలకు కావలసిన వాటి విషయమైనా అంతే. మగపిల్లలకూ ఆడపిల్లలకూ అవసరమయినవి వేరు వేరు రకాలు. ఆడపిల్లలకు పరికిణీలు, జాకెట్లు, గౌనులు కుట్టటానికి వీలయిన బట్టలను కొనాలి. మగపిల్లలకు నిక్కర్లకూ, లాగులకూ, షర్టుకూ, కోట్లకూ ఉపయోగకరమైనవి కొనాలి. పిల్లలలో కొందరికి లేతరంగులు బాగుంటాయి. కొందరికి చీటీలు బాగుంటే కొందరికి చారలు బాగుంటాయి. కొన్ని రకాలు కంటికి నచ్చుతాయి. కొన్ని ఒంటి రంగుకు ఈడవుతాయి. పసిపిల్లలకు బట్టలు కుట్టించేటప్పుడు గమనించవలసిన అంశము గుడ్డయొక్క విలువకాదు. వాళ్ళకు చౌకధరవయినా సరేగాని సంఖ్య ఎక్కువ ఉండాలి. తెల్లటిరంగు శ్రేష్ఠము. ఎన్నిసార్లు ఉదికినా రంగు పోతుందనే భయము లేదు. ఖరీదుగల దుస్తులు చిరిగిపోకుండే

(30-వ పేజీ చూడండి)



"నీటి కడుపున దాగి
నిదురపోయే కొండ..."



పాపికొండలవద్ద దృశ్యం :

ఫోటో—పాళం కామేశ్వరరావు : రాజమండ్రి.

గృహనిర్వహణ: తూకములు నాణెములు

పిల్లలు పెరుగుతారు కనుక అవి వృథాకావటము సంభవిస్తుంది. ఈవిధముగానే దుప్పట్లకు, తెరగుడ్డలకూ, కావలసిన బట్టలూ రకాలు వేరువేరుగా ఉంటాయి.

పాత్రసామగ్రికూడా ఇల్లాలికి తెలిసినట్టు ఇంకొకరికి తెలియదు. ఏగిన్నె ఎంత ఉడుకుతుందో - ఏపూటకు ఏగిన్నె అవసరమో - ఆమెకేగాని ఆయన కెట్లా తెలుస్తుంది? గిన్నె మూతికి తగినమూత అమిరితేనేగాని వార్పు కుదరదు. వార్చిన అన్నముగాని యజమానికి సహించదు. దేనికి కావలసిన సామాను దానికి ఉంటే, ఇల్లాలికి ఇంటిపనిచేయుటము సులభముగాను సుఖముగాను ఉంటుంది. పనిచేయాలన్న ఆసక్తీ ఉత్సాహమూ వాటంతట అవే పుట్టుకొస్తాయి.

వీటన్నిటికంటె స్త్రీలే బజారుపనులను చూసుకోవటములో మరొక గొప్పవిశేషము ఉన్నది. ప్రతి స్త్రీ ఇంటి సామానులను జాగ్రత్తగా వాడుకోవలసినదే. వాడుకోవటములో హెచ్చు తగ్గులు ఉంటేఉండవచ్చుగాని ఈ విషయముమాత్రము సాధారణముగా అందరికీ తెలిసే ఉంటుంది. ఆహార పదార్థాలుగాని, మరే యితరసామగ్రిగాని, స్త్రీలే కొని తెచ్చుకొన్నట్లయితే ప్రతివస్తువు యొక్క విలువనూ తెలిసికోవటానికి అవకాశము కలుగుతుంది. అంతధరపెట్టి కొన్నందుకు జాగ్రత్తగా వాడుకోవాలనిపిస్తుంది. ఇంతేకాక వెచ్చించిన పైకానికి తగినసరుకు లభిస్తున్నదా - లేదా - అనేవిచక్షణకూడా కలుగుతుంది. డబ్బు విలువ, వస్తువు విలువ తెలిసికోవటమే కాకుండా, తనకుఉన్న లోకజ్ఞానాన్ని అనుభవముతో సమ్మేళనపరచి ఉపయోగించటానికి ఇల్లాలికి వీలవుతుంది.

'ప్రతిచిన్నదానికీ ఆడవాళ్లు స్వయముగా బజారుకు బయలుదేరాలన్న ఉబలాటము ఇప్పుడే చూస్తున్నాము. మగవాళ్లకయినా ఆడవాళ్ళను వెంటతీసుకొని పోవాలన్న సరదాతప్ప ఇంకేమీ లేదు'ని కొందరు పెద్దవాళ్లు అంటూ ఉంటారు. ఆ పెద్దవాళ్లు కూడా దేవుడి తిరునాళ్ళప్పుడు రథోత్సవాలకు వచ్చిన దుకాణాలకు మధ్యాహ్నపువేళ వెళ్లి రాతిచిప్పలు దీపపు సెమ్మెలు కొంటూనే ఉండేవారు. 'ఇంటిబాధ్యతలన్నీ స్త్రీలే నిర్వహించుకోవాలి, ఇంటికి కావలసినవన్నీ వాళ్లే కొనుక్కోవాల'ని అంటే కొంతమంది మగవాళ్లు 'ఆడవాళ్లు నగలూ చీరెలూ కొనుక్కోవటానికి బజారుకు బయలుదేరుతారు గాని. బియ్యము పప్పూ కొనటానికి వెళ్ళరు' అని ఆక్షేపిస్తారు. ఈ ఆక్షేపణలకు ఎక్కువగా ఆధారాలు లేవు. ఎక్కడో - ఎవరో ఒకరన్నంతమాత్రాన అందరినీ కలిపి అనటము కొందరికొక అలవాటు. మంచివిషయాలనూ, లాభకరమైన విషయాలనూ, చెప్పేటప్పుడుగాని, నిర్ణయించేటప్పుడుగాని సగటున చూడాలిగాని స్వల్పసంఖ్యాకుల మాటలను పాటించటము ఉచితముకాదు. ఇకపోతే విమర్శకుల విషయము ఎట్లా ఉంటుందంటే ఎదుటి వ్యక్తి ఎంత లోకువ అయితే అంతజోరుగా ఆక్షేపణలు సాగిపోతాయి - నల్లేరుపైబండి సాగినట్టుగా.

స్త్రీలకు జంకు సహజముగా ఉంటుంది. ఇది విద్యావతులలోకూడా లేకపోలేదు. నలుగురిలో తిరుగుతూ - పదిమందితో వ్యవహరిస్తేగాని ఈజంకు వీడిపోదు. జంకును పోగొట్టుకోవటాన్ని చాలామంది తెగబడటము క్రింద పరిగణిస్తారు. కొంతమందికి పరాయిమనిషిని చూడగానే మాట తడబడుతుంది. ఒకటి అడుగబోయి మరొకటి అడుగుతారు. ఒకటి నిర్ణయించబోయి మరొకదాన్ని నిర్ణయిస్తారు. తమకు కావలసిన వస్తువులను ధైర్యముతో అడిగి, బేరము చేసికొనటానికి కొందరికి జంకు. దీనిని పోగొట్టుకోవటానికి ప్రయత్నించటములో దోషము లేదుకదా!

స్త్రీలలో కొందరికి అనవసరమైన జంకు ఎట్లా ఉంటుందో, అవిధముగానే కొందరికి మితిమీరిన ధైర్యము, విచ్చలవిడిగా మాట్లాడటము, అమర్యాదగా ప్రవర్తించటమూ అలవాటు. 'ఈగుడ్డ రంగుపోయినట్లయితే మాకు తెచ్చి ఇవ్వండి' అని ఏ అంగడివాడయినా అన్నాడనుకొందాము. అది నిజముగా రంగుపోవటమే తటస్థించితే - ఆ అంగడికి వెళ్లినప్పుడు ఈమాట చెప్పితే బాగుంటుందిగాని, దురుసుతనముతో ఆ వెలిసిపోయినగుడ్డను వర్తకుడి ముఖాన పడవేసి నానాతిట్లూ తిట్టినస్తే ఎట్లా ఉంటుంది? కొందరు వస్తువుయొక్క విలువను గ్రహించకుండా బేరాలు చేయటానికి ప్రారంభిస్తారు; అదేపనిగా కొసరుతారు కొందరు. కొంతమంది ఇల్లాండ్రు పదికొట్లకు వెళ్లి, పదిమందిని విసిగించి అన్నివస్తువులనూ తీయించి చూసి, తరువాత కొనకుండానే వెళ్ళిపోతారు. కొంతమంది బేరసారాలు సరకులలో రకాలు చూడకుండా, తమకొ దుకాణదారుడు సరిగాఆహ్వానించి మర్యాదలుచేయలేదని తగవులాడి ఇళ్లకు వెళ్లుతారు. మరికొందరు 'మా వారు అధికార పదవిలో ఉన్నారు. సరియైన ధరలు చెప్పకపోతే రిపోర్టు చేస్తా'మని అదరించి బెదరించి బేరాలు చేస్తూఉంటారు. ఇటువంటి స్త్రీలనుగురించి చాటుకు ఎంత హేళనగా, అవమానకరముగా వర్తకులు మాట్లాడుకుంటారో మనము ఊహించటానికి శక్యముకాదు. మన ఆధిక్యతలు, గొప్పతనాలు, హోదాలు, అధికారాలు వ్యాపార వాణిజ్యాలలో అక్కరకురావు.

కొనటానికి బజారుకు బయలుదేరినపుడు అనేకరకాల వ్యక్తులు తారసిల్లుతూ ఉంటారు. మనము అడిగినదొకటీ, వాళ్లు చెప్పేది మరొకటీ అవుతూఉంటుంది. ఆడవాళ్లు వచ్చారుకదా అని మాటలలోకి దింపాలని కొందరు వర్తకులు చూస్తారు. ఏదో కొనటానికని బజారుకు వెళ్ళితే కాఫీ తెప్పించి, డ్రింకు తెప్పించి, కొందరు ముఖమాటపెట్టుతూ ఉంటారు. ఈ మాట ఆ మాట తియ్యగా చెప్పి బేరాలు చెయ్యనీయకుండా వస్తువులను సంచులలో నింపి, బిల్లుతోపాటు చేతికిస్తూఉంటారు. కొన్ని కొన్ని షాపులలో అందముగా అలంకరించు కొన్న జవ్వనులను సరుకులను అమ్మటానికి నియమిస్తారు. కొనబోయిన మగవాళ్లు చాలామంది ఆ జవ్వనులతో సమానముగా

మాట్లాడితేక అడిగినంత యిచ్చి చెతికందించిన సరకును యింటికి తెస్తారు. ఆ విధము గానే కొన్ని దుకాణాలలో యువకులను నియమిస్తారు. కొనబోయినవారు వాళ్లమాటల తోనే మూకలయిపోతారు. కనుక అనేక రకాల వ్యక్తులతో దక్కగా మసలు కోవటము, వాళ్లతో మర్యాదగా సంభాషించటము, అన్నిటికంటె ముఖ్యమైనది కావలసిన వస్తువులేవో కొనుక్కొని మర్యాదగా ప్రవర్తించి ఇంటికి చేరుకోవటమూ ప్రధానాంశాలు.

ఇంటికి కావలసిన వస్తువులన్నీ స్వయముగా కొనుక్కోవటము, వాటిని జాగ్రత్తగా పొదుపుగా వాడుకోవటములోనే గృహపరిపాలనాదక్షత ఇమిడి ఉన్నది. ఈ వస్తుసామగ్రిని కొనటములో మరొకసూత్రము అంతర్భూతమై ఉన్నది. అది ఆర్థికసంబంధమైనది. సాధారణముగా మనకు కావలసిన వస్తువులజాబితా చాలాదీర్ఘముగా ఉంటుంది. ఆ జాబితా డబ్బుసంచీననుసరించి చలామణీ అవుతుంది. ఎన్నో హెచ్చుతగ్గులూ సర్దుబాట్లూ చేసుకోవలసిన సందర్భాలు కలుగుతూ ఉంటాయి. గృహపరిపాలనలో ఆర్థికముగా దేనిక్రింద ఎంత వ్యయము చేయవచ్చునో నిర్ణయించుకోవటమే నైపుణ్యముగా భావించబడ్డది. మెట్రిక్ పరీక్షలో నూరు రూపాయల ఆదాయము గల కుటుంబములో నలుగురికి ఆదాయవ్యయపట్టికను తయారు చేయవలసినదన్న ప్రశ్నకు ఒక విద్యార్థిని, సమాధానముగా, నెలకు 20 రూపాయల వస్త్రాలకు ప్రత్యేకించిందట. వంటయింటి సామగ్రి, పాలు, ఇంటిఅద్దె, చాకలిఖర్చు మొదలైన ఖర్చులకు ఆమె అంతగా ప్రాధాన్యత నివ్వలేదు. కనుక ఆమె అంచనాలో కొంత ఏర్పడినట్లే.

ఇంటివిషయాలలో దేనికి ఇవ్వవలసిన ప్రాముఖ్యత దానికి ఇవ్వవలసే ఉంటుంది. కొన్నిటికి డబ్బు ఖర్చుపెటితేనే చాలు; కాని కొన్నిటికి స్వయముగా పరిశీలనచేస్తూ శ్రద్ధగా గమనించటము అవసరమవుతుంది. ఇవి ఒక్కొక్క యింటినిబట్టి నిర్ణయింపబడుతాయి.

గృహనిర్వహణలో మిగతా విషయాలన్నీ ఒకఎత్తూ, కొలతలు లెక్కలూ ఒక ఎత్తూను. కొలతల విషయములో ఒక్కొక్క ప్రాంతములో ఒక్కొక్కవిధము ఆచరణలో ఉన్నది. భారతదేశములో ప్రభుత్వామోదము బడసిన సేరుకు 80 తులాలు, 40 సేర్లు 1 మణుగు, తులానికి 180 గ్రెయినులు. ఆంధ్రదేశములో 3 తులాలయితే 1 పలము. ఎనిమిది పలాలు 1 సేరు. ఈ సేరుకు 24 తులాలు. ఒకవీసెకు 5 సేర్లు. సవాసేరంటే సేరుంబావు, దానికి 30 తులాలు. నాలుగు సవాసేర్లుగాని 5 సేర్లుగాని ఒకవీసె అవుతుంది. రెండువీసెలను ఒక కట్టు అనికూడా అంటారు.

మదరాసులో పడి అని వాడుకలో ఉన్నది పడిఅంటే సేరున్నర.

హైదరాబాదు రాష్ట్రములో సేరుకు 80 తులాలు. ఒక ఛటాకులో 5 తులాలుంటాయి. మణుగులో 40 సేర్లు ఉంటాయి. 120 సేర్లు ఒకపల్లా. మదరాసులో బియ్యపు బస్తా కొంటే 120 సేర్లు ఉండవు. మైసూరులో పల్లాకు 100 సేర్లని అర్థము.

లెక్కలలో కూడా హైదరాబాదులో లెక్కలు వేరు, ఇతర ప్రాంతాలలో లెక్కలు వేరు. హైదరాబాదులో సైకా అంటే శతమానము. దీనిలో కూడా పళ్ళ లెక్క వేరు, కాయలలెక్క వేరు. చేతికి ఆరువంతున 21 చేతులువేసి కొసరుకాయలతో సహా 128 పళ్లు లెక్కిస్తారు. అదే కాయల విషయములో లెక్క మారిపోతుంది. చేతికి ఆరువంతున 32 చేతులువేసి, మొత్తము 192 కాయలను ఇస్తారు. మామిడి కాయలు సైకాకు 192 వస్తాయి. మామిడి పండ్లు 128మాత్రమే వస్తాయి.

మొత్తము మీద అంతర్జాతీయముగా శాస్త్రీయమైన కొలతలు ఈ క్రిందివిధముగా ఉన్నాయి ఒక మీటరుకు 10 డెసీమీటర్లు, నూరు సెంటిమీటర్లు, వెయ్యి మిల్లిమీటర్లు. ఇది దీర్ఘపరిమాణము (కొలతకు). ఒక కిలోగ్రాముకు వెయ్యి గ్రాములు. ఇది తూకపు పరిమాణము. ఒక మీటరుకు వెయ్యి ఘన సెంటిమీటర్లు. ఇది ఘనపరిమాణము. ఇవి మెట్రిక్ పద్ధతి పరిమాణాలు; దశాంశ పద్ధతిలో ఉంటాయి

సాధారణముగా అన్ని ప్రాంతాలలో మనకు వాడుకలో ఉన్నవి గోరంత, అంగుష్ఠము, అడుగు, జేన, మూర, బార, అంగ మనుష్యుని ప్రమాణాన్నిబట్టి ఏర్పడ్డాయి. ఇవి దూరాన్ని కొలిచేవి. ఇక వస్తువుల ప్రమాణాన్ని తెలుపటానికి పిడికెడు, దోసెడు, అని వాడుకలో ఉన్నాయి ఇవి కూడా పైవిధముగా ఏర్పడ్డవే. వీటి నాధారము చేసుకొనే కొలతలప్రమాణాలు ఏర్పడి ఉంటాయి.

తూకములో ఆంగ్లప్రమాణము 16 అవున్సులు 1 పౌను అవుతుంది. 28 పౌనులు 1 క్వార్టరు; 112 పౌనులు 1 హండ్రెడు వైటు, 2000 పౌనులు చిన్న టన్ను, 2240 పౌనులు పెద్ద టన్నుగా నిర్ణయించారు. కట్టెలకు బొగ్గులకు వాడుకలో ఉన్నవి టన్నులు, స్టోనులు.

సాధారణముగా మందులకు వాడుకలో ఉన్నవి దంచాలు, అవున్సులు, డ్రాములు, గ్రెయినులు. దంచాలలో టీ స్పూను, టేబుల్ స్పూను, డెసర్టు స్పూను, అని మూడు రకాలున్నాయి

పెట్రోలు నూనెల లెక్కలు గాలనులు పైంట్లలో ఉన్నాయి. 8 పైంట్లు ఒక గాలను.

కొన్నివస్తువుల లెక్కలు 12అంటే డజను. 12 డజనులు 1 గ్రోసు. కాగితాల లెక్కలు 24 కాగితాలు 1 దస్తా; 20 దస్తాలు 1 రీము; 10 రీములు 1 బేలు.

ఈపైన వివరించినవన్నీ కొలతల మానాలను గురించినవి. ఈ విషయాలన్నీ అందరికీ తెలిసినవే కాని సందర్భానుసారముగా, ఒకదానివెంట ఒకటి, తీగవెంట డొంక కదిలినట్టుగా ఉదహరింపబడ్డాయి. ఇక మిగిలిపోయినది నాణెముల లెక్క. ఇది అన్నిటికంటె ముఖ్యమైనది కనుక ప్రత్యేకముగా చివరకు వివరించటము జరిగింది.

భారతదేశములో రూపాయకు 16 అణాలు ఒక అణాకు 12 పైసలు. అర్థరూపాయ, పావలా, బేడ అన్నవి రూపాయలోని భాగాలను తెలిపేవి. మొత్తము మీద పెద్ద నాణెము రూపాయ, చిన్న నాణెము దమ్మిడీ, మధ్యది అణాగానూ నిర్ణయించబడ్డది.

హైదరాబాదులో 1953 వరకు హాలీసిక్కా నాణెములలో వాణిజ్యము జరుగుతూ ఉండేది. ప్రభుత్వపరముగా కూడా ఆ నాణెములే చలామణి అవుతూఉండేవి. 1953 నుండీ ప్రభుత్వము భారతీయనాణెములలో (కల్దారు) వ్యవహరించటము మొదలుపెట్టింది. హాలీ నాణెములు ఇప్పటికీ వాణిజ్యవ్యవహారములలో చలామణీ అవుతున్నాయి. చాలావరకూ ధరలు అన్నీ భారతీయనాణెములలోనే నిర్ణయింపబడుతున్నాయి. హాలీసిక్కా రూపాయ మీద 16 పైసలయితే ఒక కల్దారు రూపాయ అవుతుంది. కల్దారు అణాకు 7 హాలీ పైసలని నిర్ణయము.

ఈమధ్యనే భారతప్రధాని నెహ్రూగారు దశాంశపద్ధతి నాణెములనుగూర్చిన బిల్లును లోకసభలో ప్రవేశపెట్టించారు. ఆ సభ దీనిని సిద్ధాంతరీత్యా ఆమోదించింది. నాణెములో దశాంశపద్ధతి అంటే ఏమిటన్నది గృహిణులు తెలిసికోవలసిన అంశము. ఏ విధానములో వివిధనాణెములు ఒకదానికొకటి 10,100,1000 రెట్లు లేక 10వ వంతు, నూరవవంతు, వెయ్యవవంతు - ఈ విధముగా సంబంధము కలిగిఉంటాయో అది దశాంశపద్ధతి అని అంటారు.

ఫ్రాంసులో ఫ్రాంకు, 10 ఫ్రాంకులు, 100 ఫ్రాంకులు, 10 సెంట్లు (ఫ్రాంకులో 10వ వంతు), సెంటునాణెములుఉన్నాయి. అమెరికాలో డాలరు, సెంటు (డాలరులో 100వ భాగము సెంటు) వాడుకలో ఉన్నాయి

నాణెముల దశాంశ పద్ధతిని ఇండియా బ్రిటను తప్ప, మిగిలిన ప్రముఖదేశాలన్నీ, నాంగా కాలము క్రిందటనే అవలంబించాయి

గోరంతలు కొండంతలు

మూలం: నారాయణ్ హరి ఆప్టే
అనువాదం: కె. జానకిరామ్ పట్నాయక్

“సుధా!”

“ఏమాజ్ఞ?” వంటింట్లోనుంచి వినోదంగా సుధ జవాబిచ్చింది.

భాస్కరానికా వినోదం బాగనిపించింది కాదు. ఒకనిముషం ఉక్రోషంతో మాటాడలేకపోయాడు.

లోనుంచి స్టవ్ వెలుగుతున్న శబ్దం, టీట చేసిన చప్పుడు, కప్పు సాసర్లు సరిచేస్తున్న టక్-టక్‌లూ వినవచ్చాయ్!

భాస్కరానికి వుక్రోషానికి తోడు విసుగూ, చిరాకూ కలిగాయ్! గొంతెత్తి అరిచాడు—

“సుధా! ఇక్కడుంచిన పదిరూపాయిల నోటేదీ?”

సుధ జవాబివ్వలేదు. స్టవ్ లో గాలి నింపుతున్న శబ్దం మాత్రం బయటికి స్పష్టంగా వినిపించింది.

భాస్కరం సుధను పిలవలేదు. అతని కోపం నసాళానికంటుకొని ‘భగ్గు - భగ్గు’ మనిపిస్తున్నది. పిచ్చివాడిలా అన్నీ గాలించేస్తున్నాడు. మేజామీది ప్రతీ వస్తువూ దిగువ దొర్లుతున్నది. డ్రాయరు లాగిన చప్పుడు, వేసినచప్పుడు ఆ గదిని దడదడలాడించివేస్తున్నది! చిత్తుకాగితాలబుట్ట చిత్తయిపోయింది!...కాని లాభం లేకపోయింది. కావల్సిన పదిరూపాయిల కాయితం కనిపించలేదు.

ఒక్కవిసురుగా అతను వంటింటివేపు పర్వెత్తి ద్వారం సమీపించాడు.

సుధ స్టవ్ మీదనుంచి కాఫీ దింపుతోంది.

“సుధా!” గట్టిగా అరచాడు భాస్కరం.

పాల తపేలా స్టవ్ మీద వుంచుతూ సుధ భాస్కరంవేపు తలతిప్పి చూసింది పొత్తు రాయిలా!

“నేనక్కడ పదిరూపాయిల కాయితం వుంచాను! కన్పించలేదు!” అన్నాడు భాస్కరం తీక్ష్ణంగా!

“నాకుగాని చూపించి వుంచారా యేఁవిటి?” కనుబొమలు ఎగరవేస్తూ తల పక్కకు తిప్పి సుధ అడ్డుప్రశ్న వేసింది.

“అంతగా ఎగరనక్కరలేదు. నాకు కావల్సిందంతా పదిరూపాయిల కాయితం!” అన్నాడు కఠోరంగా భాస్కరం.

“ఇల్లాగిరిపోయేలా ఎందుకా కేకలు? అడిగేదో కాస్త శాంతంగా అడరాదూ?” అన్నది సుధ పాలవేపు దృష్టి నుంచుతూ.

“నే నడిగిందానికి జవాబిస్తావా లేదా?” మరింత గట్టిగా అరిచాడు భాస్కరం!

సుధ కాతని ప్రవర్తన అసభ్యంగా కనిపించింది. కాస్త కటువుగా “మీ పదిరూపాయిల కాయితం సంగతి నాకు తెలీదు. అవతలకు దయచెయ్యండి!”

భాస్కరం ఒక్క వుదుటున స్టవ్ దగ్గరకు వెళ్ళాడు. స్క్రూ తిప్పి గాలి వదిలేశాడు. స్టవ్ ఆరిపోయింది!

సుధ నిల్చుండిపోయి అతనివేపలా చూస్తున్నది!

భాస్కరం ఆమె భుజాన్ని పట్టుకుంటూ అన్నాడు—

“ఆ కాయితం ఎక్కడుంచావో పట్రా!”

“నాకు తెలీదు. నేను తియ్యలేదు!”

“మళ్ళీ అదేమాటా?...అయితే అదేఁవయినట్టు?” అన్నాడు అదే స్వరంతో భాస్కరం!

సుధకు ఓరిమి పోయింది. వెంటనే కోపంతో అన్నది. “అయితే నేను దొంగ

గృహనిర్వహణ: తూకములు నాణెములు

అమెరికా 1786 లోను, ఫ్రాంసు 1799 లోను, జర్మనీ 1878 లోను, జపాను 1871 లోను, ఇతర పాశ్చాత్యదేశాలు 19వ శతాబ్దములోను ఈ విధానాన్ని ఆచరణలోనికి తెచ్చాయి.

మన భారతదేశమువలెనే ఇంగ్లండుదేశము ప్రాచీనపద్ధతులపైన అభిమానము కలది. క్రొత్తసంస్కరణలను బాగా ఆలోచించి పరిశీలించిగాని ప్రవేశపెట్టదు. నాణెముల దశాంశపద్ధతినిగురించి కొన్నిసార్లు అక్కడ రాయల్ కమిషన్లు ఏర్పాటైనవి. కాని మార్పు నేటివరకూ జరుగలేదు. అయినప్పటికినీ రావలసిన మార్పుల స్వరూపాలనుగురించి ప్రతిపాదనలను చేయుటమాత్రము జరిగింది. 1 పౌనుకు 10 ఫ్లారినులు, 1 ఫ్లారినుకు 10 సెంట్లు, 1 సెంటుకు 10 మిల్లులు ఏర్పాటుచేయవలెనని ఒకసూచన బయలుదేరినది. ఇంకొక విధానములో 1 ఫార్దింగును ఆధారముగా తీసుకొని 10 ఫార్దింగులు 1 సెంటు, 10 సెంట్లు ఒక ఫ్లారిను, 10 ఫ్లారినులు 1 పౌనుతో ఒక మానము సూచింపబడ్డది. ఈ విధముగానే మరికొన్ని విభాగపద్ధతులు, ఇంకా, అమెరికను ఇంగ్లీషు ఫ్రెంచి నాణెముల విలువలను సమన్వయపరచి, దశాంశపద్ధతిలో ఏకముఖము చేయవలెనను సూచనలుకూడా చేయబడ్డాయి.

ఇక భారతదేశము విషయములో ప్రపంచములోని ఆధునికదేశములన్నిటివలెనే దశాంశ పద్ధతిని ప్రవేశపెట్టవలెనని మన ప్రభుత్వము ఉద్యమించినది. మనకు నిర్ణీతమైన నాణెము 1 రూపాయ. ప్రస్తుతము 1 రూపాయకు 16 అణాలు, అణాకు 4 కానులు, కానికి (*Piee*) 8 దమ్మిడలు (*Pies*). దశాంశ పద్ధతిలో 1 రూపాయకు 0వ వంతు, నూరవవంతు, విలువగల నాణెములు ఉండవలసి ఉంటుంది. రూపాయకు పైకి పోయినకొలదిల 10 రూ, 100 రూ, విలువగల నాణెములుగాని కరెన్సీ నోటుగాని ఉండాలి. ఈ లెక్కలో నాణెములు రూపాయలో దశాంశము, శతాంశము సూచించే రాగిలోహములో ఉండే అవకాశము ఉన్నది. నెహ్రూ పండితుడు సూచించినట్లు ఇప్పుడు ప్రచారములో ఉన్న అణా, పైస అన్న పేర్లు మారకుండా ఉంటే ఏమీ అభ్యంతరము ఉండదు. కాని వాటి విలువలు మాత్రము మారకతప్పదు. వీనికితోడు 2 అ, 4 అ, 8 అణాలు గాని, 2, 4, 5 పైసలు గాని విలువను కలిగిన నాణెములను అవసరాన్నిబట్టి ఏర్పాటు చేసుకోవటములో ఆక్షేపణ ఉండవలసిన పనిలేదు. బీదవారికి వారి అవసరాలనుబట్టి చిన్న చిన్న నాణెముల బాహుళ్యమును ఏర్పరచవలసి ఉంటుంది. చిన్న చిన్న తూకములలో కూరగాయలు, కొత్తిమిరి, కర్వేపాకు, సుంఠు సూదులు, పిన్నులు, నల్లపూసలు కొనవలసిన గృహిణులకు కూడా చిన్న నాణెముల బాహుళ్యము సౌకర్యముగా ఉంటుంది. ★

తనంగా తీశానసా మీ అనుమానం! చాల్చాలు! ఎవరేనా వింటే నవ్విపోతారు!"

"ఈ యింట్లో వున్నది మనిద్దరం పొద్దుట్నుంచీ మరెవరూ రాలేదు ఆ కాయితం ఎలా పోయిందంటావ్?"

సుధకు కోపం మిన్ను ముట్టుకుపోయింది. కాని తమాయించుకొని వ్యంగ్యంగా అన్నది—

"మీ పదిరూపాయీల కాయితం కాజేసేటంత ఖర్మ నాకింకా పట్టలేదు!"

"అవును! ఎందుకు పడుతుంది?...... నెలకు నూటాయేభైరూపాయీలు సంపాయిస్తున్నావ్ కదా మరి?...అందుకే యింత గోరోజనం!...అయితే మొన్న మీ అన్నగారికి డాక్టరు పరీక్షకు కట్టడానికి కావాలంటే యొకాయొకీని వంద రూపాయీలిచ్చాను. అప్పట్లో తమ ఖజానా ఏమైందో?"

"ఓహో! దెప్పిపోట్లవఅకూ వచ్చిందీ వ్యవహారం?...అయితే ఆనాడు మీయమ్మగారు కాశీయాత్రకు వెళ్తానంటే ఇచ్చిన ఆ రెండొందలూ మీ ఖజానాలోనిదేనా ఏఁవిటి?"

"నోర్ముయ్!...చదువుకున్నాననీ, ఉద్యోగస్తురాలననీ, కళ్లు నెత్తిని పెట్టుకొని మాటాడుతున్నావ్? జాగ్రత!...దేనికైనా ఒకహద్దు ఉంటుంది!...అది దాటితే పరిస్థితులు విషమించిపోతాయ్!...

"నే నన్నది అదే!...ఈపాఠం తమరు కూడా కొస్త చదివి, జీర్ణింపజేసుకోండి!"

"ఏఁవిటన్నావ్?—" అంటూ భాస్కరం రెండడుగులు వేసేసరికి

"భాస్కరం!" అన్న పిలుపు వినబడ్డది!

భాస్కరం నిల్చున్నచోటనే ఉండిపోయాడు. కాసేపలా ఉండి, ఏదో గొణుక్కుంటూ, డ్రాయింగ్ రూమ్‌లోనికి పోయాడు!

అక్కడ శేఖరం అతనిభార్య లతా కన్పించారు. భాస్కరం బలవంతాన నవ్వు తెచ్చుకుంటూ "ఏమోయ్ శేఖరం! అలా కూచో!" అని సోఫా మాపించి వంటింటివేపు తల తిప్పేసరికి, చిర్నవ్వుతో సుధ లతదగ్గరకు రావటం కనిపించింది.

అప్పట్లో సుధా భాస్కరాలను చూస్తే ఇంతకుముందు కయ్యానికి కాలుదువ్వుకుంటూ బయల్దేరిన ప్రబుద్ధులు వీళ్లేనా అనిపిస్తుంది.

"భాస్కరం! రేపు మాయింట్లో సత్యనారాయణవ్రతం! మీ రుధియములా ఉదయాన్నే వెళిపోరావాలి!" అన్నాడు శేఖరం!

"ఏఁవిటి సంగతి?" నవ్వుతూ ప్రశ్నించాడు భాస్కరం.

"అబ్బే ఏఁవీలేదు! ఆ మధ్య లత జబ్బుపడ్డదికదూ — వాళ్ళ మ్రొక్కు మొక్కిన మొక్కు తీర్చుకుంటున్నాం!" అన్నాడు శేఖరం చిన్నగా నవ్వుతూ.

కాసేపు పిచ్చాపాటీ మాటాడుకున్నాక ఆ స్నేహితులు కాఫీ ఫలహారాలకని కూచున్నారు. ఎదురుగా సుధా లతలు ఉన్నారు.

భాస్కరం కాఫీకప్పుతీసి ఒక గుక్క పీల్చాడు. చప్పగా ఉంది. మనసులో రగులుకొంటున్నకోపంవల్ల సుధ కాఫీలో పంచదార వేయటం మర్చిపోయింది!

భాస్కరానికి మంచి సమయం దొరికింది. వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాడు—

"మా యావిడకు ఉపన్యాసవేదికమీద నిల్చుని ప్రజల్ని పరవశత్వంలో ముంచేలా మాటాడగల శక్తివుంది కాని పాకశాస్త్రంలోమాత్రం ఏపాటి శక్తీ లేదు!"

సుధకా మాటలు బాణపు ములుకులా తగిలాయ్! క్షణకాలం ముఖం జేవురించుకుపోయింది. కాని వెంటనే సమాళించుకొని బలవంతంగా నవ్వుతూ జవాబిచ్చింది—

"మా ఆయనగారు నాలాంటి వుపన్యాసకురాలిని కాకుండా మంచి వంటలక్కను వివాహంచేసుకొని ఉండాల్సింది!"

ఆ దంపతుల సంభాషణ విని లతా శేఖరులు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. మన కెందుకన్నట్టుగా లత సంజ్ఞ చేసింది.

ఓ నిముషం అందరిమధ్యా మౌనం ఆవరించుకుంది! దాన్ని భంగపరుస్తూ శేఖరం అన్నాడు—

"పొరపాటు మానవసహజం!... మొన్న మాయింట్లో లత సేమియాపాయసం చేసింది. అందులో పంచదారకు బదులు వుప్పువేసింది!"

"దాన్నలానే ఆరగించావన్న మాట!" అన్నాడు భాస్కరం వ్యంగ్యంగా నవ్వుతూ.

"ఏంచేయమంటావ్?...మస్తుగా పంచదార కలుపుకొని తిన్నాం!...కాని తమాషా ఏఁవిటంటే అదొక రుచిలో తేలింది!" అన్నాడు శేఖరం సహజంగా నవ్వి!

ఏదోవిధంగా కాఫీ ఫలహారాలు పూర్తయాయ్! తరువాత లోకాభిరామాయణంలో పడ్డారు నలుగురూ.

లతమాత్రం సుధా భాస్కరాలమధ్య వైమనస్యాన్ని ఇట్టే పసికట్టేసింది. అటేకే పక్కడ కూచొనివుండటాని కామె ఇష్టపడలేదు. ముఖకళవళికల్లో తన అభిప్రాయాన్ని భర్త కందించింది. శేఖరం "ఉండు" అన్నట్టు కనుసంజ్ఞతో వారించాడు.

కొంతసేపటికి వారిసంభాషణ సేకి రతయితలమీదకూ, వాళ్ల రచనలమీదకూ పోయింది!

"అరుణకిరణాలనే గేయాలు చాల రసవత్తరంగా ఉన్నయ్! కాని దాని రచయిత ఎవరో జ్ఞాపకం రావుండా వుంది!" అన్నది లత.

గోరంతలు కొండంతలు

"అరే! ఇంతమాత్రం జ్ఞాపకంలేదా?... ప్రఖ్యాతగేయ రచయిత దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిది!" అన్నది సుధ.

"అవునవును! దేవులపల్లి వారిదే అన్నట్టు నాకూ జ్ఞాపకం!" అని శేఖరం సమర్థించాడు.

భాస్కరం పెద్దపెట్టున నవ్వి అవహేళన స్వరంతో అన్నాడు —

"శభాష్!...మీ జ్ఞాపకశక్తులు వూహాకు అతీతంగా ఉన్నాయ్! ఎవరిదో ఒకరి పేరు చెప్పేస్తే సరిపోతుందా? .... రుజువు చేయక్కర్లా?"

"మీ జ్ఞాపకశక్తి భ్రష్టమైంది కాబోసు! చెప్పరాదూ అసలు రచయిత ఎవరో?" అన్నది రోషంగా సుధ!

"మొదట్లోనే అలా అడిగి తెలుసుకుంటే చిన్నతనం కావాలి?" అన్నాడు భాస్కరం.

"అయితే యింతకూ ఎవరంటావ్?" అన్నాడు శేఖరం.

"ఎవరా?...రాయప్రోలు సుబ్బారావు గారు!" ధీమాగా అన్నాడు భాస్కరం!

"భేష్ భేష్!' అని చప్పట్లు చరుస్తూ సుధ పగలబడి నవ్వనారంభించింది!

దాంతో భాస్కరానికి పౌరుషం, ఉడుకుబోతుతనం వుప్పెనపెట్టుగా వచ్చాయ్! ముఖం ఎఱ్ఱబడిపోయింది!

"ఎందుకూ సిగ్గూ బిడియం లేకుండా నవ్వటం?... చదువుకున్నంతమాత్రాన అంతిపోగరు —" అంటూ వెంటనే సమాళించుకొని వూరుకున్నాడు.

"నోటి కొచ్చినట్లల్లా పేలకండి!... బి.ఎ అంటే ఫస్టుక్లాసులో ప్యాసయ్యాంగాని తెలుగంటే ఎంతసత్తావుందో ఇందులోనే తెలుస్తున్నది!" అన్నది సుధ రూక్షంగా.

"చాల్చాలు! మహా తెలుగు తెలిసినదానివి వచ్చి వూడిపడ్డావ్! తెలియకపోతే నోరు మూసుకు వూరుకోవాలిగాని తగుదునమ్మా అని మొండివాదన చెయ్యకు!...అరుణకిరణాల రచయిత రాయప్రోలుసుబ్బారావే అయితే నాలుగుచెప్పుదెబ్బలు తింటావా?" అన్నాడు పెద్దగా అరుస్తూ భాస్కరం!

లతా శేఖరాలు ఆ దంపతుల వైఖరి గమనించి చకితులైపోయారు. వెంటనే శేఖరం అన్నాడు—

"భాస్కరం! ఏమిటిదంతా!...ఛా!"

"అది కాదు శేఖరం!...ఈవిడగారి వ్యవహారం చూస్తూనే వున్నావుకదూ?...ఏమిటా గోరోజనం?...ఎందుకా అహంకారం? ఇదంతా చదువుకున్నాననేనా? ...వుద్యోగస్థురాలి ననేనా?... మగవాడంటే యింత అలుసా?...నోటి కెలావస్తే అలా కూయటమేనా?...మంచీ చెడూ, సభ్యతా - అసభ్యతా గమనించక్కర్లా?" బుసలు కొడుతూ అన్నాడు భాస్కరం!

భర్తమాటలు వినేసరికి సుధకు దుఃఖమూ, క్రోధమూ ఉవ్వెత్తుగా వచ్చింది. దెబ్బతిన్న త్రాచులా ఒక్క వుదుటున లేచి ఏదో అనబోయేసరికి లత, ఆమెను బలవంతంగా పడకగదిలోనికి లాక్కుపోయింది!

"సుధా!...ఆయన కోపంలో ఏదో అన్నారని నువ్వూ, ఆయనతో సమానంగా ఢీకొంటే ఎలానవుతుంది?" అనునయంగా అడిగింది లత!

సుధ తలగడలో తలదూర్చి వెక్కి వెక్కి ఏడుస్తున్నది. "ఛా! అదేమిటలా చిన్నపిల్లలా యేడుస్తావ్?...మనిషిదగ్గర మనిషి వుంటే ఒకమాట రాకమానుతుందా?... దానికింత ఇదైపోతే ఎలా?...అయినా ఇవ్వాళ ఆయన మనసెందుకో బాగాలేనట్టుంది! ఆ చికాకులో ఏదో అనేశారు. మనం ఆడాళ్లం!... కాస్త సహించుకోవాలి—" ఇంకా ఏదో అనబోతూంటే సుధ చివాల్న లేచి ఉక్రోషంతో ఇలా అన్నది—

"అవును!... ఆడాళ్లం. సహించుకోవల్సినవాళ్లం కాబట్టే ఆత్మగౌరవాన్ని బూడిదలో కలిపేస్తున్నాం!....ఇంకా ఎంతకాలం ఇలా మండి మాడిపోమంటావ్?" అన్నది సుధ మధ్య మధ్య వెక్కుతూ!

అంతలో బయటనుంచి శేఖరంపిలుపు వినిపించింది. లత లేస్తూ "వెళ్లొస్తా సుధా!... నువుమాత్రం కాస్త సమాళించుకోవాలి!... ఈ ఒక్క రోజుతో అయిపోయేది కాదు!... ఇలా అన్నానని మాత్రం వేరేగా అనుకోవద్దు!" అన్నది.

లత, శేఖరం భాస్కరం దగ్గరకు వచ్చారు. భాస్కరం వాడినముఖాన్ని రెండుచేతులమధ్యా వుంచి, మేజాకానుకొని, కుర్చీలో కూచున్నాడు.

శేఖరం అతని వీపుమీద తట్టి అన్నాడు—

"భాస్కరం! ఇప్పుడు నువ్విక్కడ వుండటం అంత మంచిదికాదు! .... ఈ పూటకు మాయింటికొచ్చేస్తే బావుంటుంది. అక్కడే భోజనం చేదువుగాని!"

"నేను రాలేను శేఖరం! క్షమించు!" నీరసంగా జవాబిచ్చాడు భాస్కరం.

"అదికాదు భాస్కరం!... ఈ ఒక్క పూటా నువ్వు -" మధ్యలోనే భాస్కరం అన్నాడు.

"నువ్వెందుకిలా అంటున్నావో నాకు తెలిసింది శేఖరం!...కాని నువ్వూహించినట్టుమాత్రం నేను ప్రవర్తిస్తాననుకోకు! కావల్సొస్తే సుధకు డైవోర్సు యిస్తాను! కాని ఆవిడమీద చెయిమాత్రం చేసుకోను! ...క్షమించి నన్ను మరి వేధించకుండా వెళ్లు!"

"సరే!" అంటూ శేఖరం లతతో బయటికి దారి తీశాడు.

వాళ్లింకా రోడ్డుమీద కాళ్లుంచారో లేదో, భాస్కరం ఒక్క వుదుటున లేచి 'షెల్ఫు'లోని పుస్తకాలన్నీ బయటకు లాగాడు! దేవులపల్లివారివీ, రాయప్రోలు వారివీ, ముఖ్యంగా గేయసంపుటాలు తిరగేశాడు. వాటిలో అరుణకిరణాలు దొరకలేదు!

హతాశుడై పదినిముషాలు 'షెల్ఫు'దగ్గర నిల్చుండిపోయాడు!

అంతలో వెంకట్రాం కంపెనీవారి పుస్తకాల కేటలాగు కనిపించింది. దాన్ని తీసి పుటలు తిరగవేశాడు.

ఆ కాగితాలమధ్యనుంచి పదిరూపాయిల నోటు ఒకటి దిగువపడ్డది! దాన్ని అతడు గమనించలేదు!...పేజీలు తిప్పుతున్నాడు!

ఒక పుటలో "కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి గ్రంథములు" అన్నదాంట్లో "అరుణకిరణాలు" ఉంది.

భాస్కరం నీరైపోయాడు. కేటలాగు మేజామీద గిరాటువేసి బయటకు వస్తుంటే పాదానికి పదిరూపాయిల కాయితం తగిలింది!

అప్పుడతనికి జ్ఞాపకం వొచ్చింది. పొద్దున్న ఆ కాయితం ఆ కేటలాగులో వుంచినట్టు!

అతని పాదాలు అనుకోకుండా సుధ గది వేపు దారితీశాయ్! ★



మీరు-మేము

కవిరావు

పెద్దవారలకంటె
బుద్ధిమంతులము.
ముకుపచ్చలారనీ
ముద్దుపాపలమైన,
పెద్దవారలకంటె
బుద్ధిమంతులము...

హెచ్చువేతలతోడ,
పిచ్చికూడికలతో
సంతోషమే లేక
సతమతమ్మయ్యెదరు.

పుడకలాకులు కొన్ని
ప్రోగుచేసుక మేము
అస్తమానమ్మల్లె
ఆడుకొందుము కనుక
పెద్దవారలకంటె
బుద్ధిమంతులము...

వెండి బంగారాల
వెర్రిమోహములోనె
అనుదినమ్మును మీరు
ఆరాట పడుచుండ,

వట్టొట్టి వంటలను
వండి మట్టితో మేము
అందులో ఆనంద
మనుభవింతుము కనుక
పెద్దవారలకంటె
బుద్ధిమంతులము...

'ఆశ కంతము లేద'
టన్న సామెత మరచి
కాలమ్ము వ్యర్థముగ
గడిపివేతురు మీరు;
అందినట్టిదె కాక

అన్యమెరుగక హాయి
హాయిగా యెల్లప్పు
డాడుకొనెదము మేము
పెద్దవారలకంటె
బుద్ధిమంతులము...

మట్టి మాణిక్యముగ
మలచి యాటాడగల
కళ, ముద్దుపాపలకు
కరతలామలకంబు,

ఆనందమును పొందు
ఆటలన్ని మఱచి
పిచ్చియాటల నేడు
ప్రేమించుచున్న మీ
పెద్దవారలకంటె
బుద్ధిమంతులము...

[ఆధారము: టాగోర్]



కోతి - ఒంటె

గారడివా డొక కోతిని
గారాబముగా పెంచెను.
నిత్యము శ్రమపడి యా కపి
నృత్యముచేయుట నేర్చెను.

కపివరు డొక్క దినమ్మున
కలకలలాడు వనమ్మున
మెకముల నన్నిటి జేర్చుక
నొకచో సభ గావించెను.

వానరమంతట సొగసుగ
వాలము అటు నిటు ఎగురగ
'ధింతక ధింతక' నృత్యము
సంతసమొప్పగ చేసెను.

మృగములు భళిరా యంచును
నృత్యము నెంతో మెచ్చెను.
వహవా యంచును కోతికి
బహుమతు లెన్నో యిచ్చెను.

కోతిని చూచినతోడనె
కుట్టెను కన్నులు ఒంటెకు.
బహుమతులను గొన మదిలో
తహతహ పుట్టెను దానికి.

అంతట నిలబడి తన మెడ
నటునిటు త్రిప్పుచు వెడవెడ
సభికులు వలదనుకొలదిని
రభసముగా నటియించెను.

చీదర కలుగుటచేతను
ఛీయని మెకములు తిట్టెను.
ఛీత్కారములను లొట్టెయు
సత్కారముగా తలచెను.

ఎంతకు నృత్యము మానక
పంతముతో నటియించగ,
తుంటెలు విరిగెడునట్టులు
ఒంటెను మృగములు బాదెను.

ఈసప్ కథలు : 15

నండూరి రామమోహనరావు



నీతి

ఒరుల కలిమి చూచి మదిని
ఓర్వలేనివార లెపుడు
ఒంటెవలెనె భంగపాటు
నొందుదురని దీని నీతి!

(పెద్దకథ)

హిరణ్మయి

7

మర్నాడు మేల్కొనటంతోనే హెర్మియా పుష్కలావతికి పోవాలనుకుంది. కాని పాదం బాగా వాచి, ఆమె అడుగు క్రిందమోపలేకపోయింది.

'నీ పాదం నయమవటానికి కొన్నాళ్లు పడుతుందమ్మా' అంది గాయత్రీదేవి.

"మా ఎగెయూసు నేను కనపడకపోతే బెంగతో పిచ్చెత్తిపోతాడు. మీ అబ్బాయిని పంపి 'నేనిక్కడ ఉన్నా'నని చెపితే ఎగెయూసు వచ్చి నన్ను తీసుకు వెడతాడు" అంది హెర్మియా.

"నిజమే కాని మేము ఈ గుహలో తల దాచుకున్నట్లు ఎవరికీ తెలియకూడదు. నయమవడంతోనే నిన్ను సురక్షితంగా అక్కడకు పంపుతాను" అంది గాయత్రీదేవి'

హెర్మియా చేసేదిలేక 'సరే'అంది. సిగ్గువల్లనో ఎందుచేతనో గాని హారప్రియుడు ఆమెతో తరుచూ మాట్లాడేవాడు కాదు. క్షమావతి మాత్రం ఆమెకు ఇష్ట ప్రాణస్నేహితురాలైంది.

ఆమె అంటే కిట్టనిది ఒక్క రోహిణికే. 'శత్రువుల పిల్లను ఇంత గారంగా చూడట మేమిటి? మన కెలాగో చిక్కింది గనుక ఈపిల్లను ఖైదీగా చెయ్యాలి! పుష్కలావతి తిరిగీ మనవశమయేవరకూ ఈ పిల్లను మనం వాళ్ళదగ్గరకు పంపకూడదు!' అన్న దామె.

'గ్రీకులవల్ల మనకు అన్యాయం జరిగినమాట నిజమే. కాని ఈపిల్ల ఏంచేసింది పాపం? నమ్మి మన పంచ చేరినవాళ్ళని మనవాళ్ళకుమల్లేనే చూసుకోవాలి.' అంది గాయత్రీదేవి.

'ఈవిడ పాములకుకూడా పాలుపోసి పెంచమంటుంది!' అని గొణుక్కుంది రోహిణి.

రోజులు గడిచినకొద్దీ ఆ కుటుంబంవాళ్ళంటే హెర్మియాకు ప్రేమా గౌరవం ఎక్కువయాయి. రాణీ గాయత్రీదేవి ఆ పిల్ల గాయాన్ని రోజూ కడిగి కట్టు కట్టేది. లభించినదాంట్లో మంచి ఆహారంతీసి ఆమెకు పెట్టేది. గొప్పఇంటి బిడ్డలు ఎంత సున్నితంగా పెరుగుతారో తనకు తెలుసును గనుక హెర్మియాకు ఉన్నంతలో ఏ లోపం రాకుండా చూసేది.

ఒకనాడు క్షమావతితో 'మీ అన్నయ్య నీకు ఎన్నో కథలు వచ్చునన్నాడు. ఒక్కటైనా చెప్పేవు కాదు.' అంది హెర్మియా

'సీత కథ చెప్పమన్నావా?' అంది క్షమావతి.

'సీత ఎవరు?'

'మిథిలా నగరపు రాజకుమార్తె, అయోధ్య రాజ కుమారుడైన శ్రీరాముని భార్య.'

'చెప్పు.'

క్షమావతి హెర్మియాకు రామాయణ కథ చెప్పింది. రావణాసురుడు సీతను ఎత్తుకుపోవడం, రాముడు వానరులతో సముద్రం దాటి వెళ్లి యుద్ధంలో రావణాసురుణ్ణి చంపేసి, సీతను విడిపించుకు రావటం విని, హెర్మియా, 'మాకూ ఇలాంటి పురాణం ఒకటి ఉంది. అది కూడా ఇలాగే చాలా బాగుంటుంది' అంది.

'ఐతే చెప్పు' అంది క్షమావతి. హారప్రియుడు

★ పాలంకి వెంకటరామచంద్రమూర్తి ★

కూడా చేతిలో ఉన్న పనిమానేసి హెర్మియా ప్రారంభించిన కథ విన్నాడు.

'ట్రాయ్' అనే పట్టణం ఉండేది. ఆ పట్టణాన్ని 'ప్రియాం' అనే రాజు పాలించేవాడు. ఆయనకు చాలామంది కుమారులుండేవారు.' అంది హెర్మియా.

'పూర్వం రాజులకు చాలామంది కొడుకులుండేవారు కామోసు. మా ధృతరాష్ట్రుడికి నూరుగురు కొడుకులుండేవారుట' అంది క్షమావతి.

హారప్రియుడు అందుకుని, 'నూరు ఒక లెక్కా. సగర చక్రవర్తికి పద్ధానుగువేలమంది కొడుకులుండేవారట!' అన్నాడు.

'వాళ్ళ కథలు చెప్పరూ?' అని అడిగింది హెర్మియా.

'ముందు మీ 'ప్రియాం' కథ చెప్పు. తర్వాత మేం చెపుతాం.' అంది క్షమావతి.

'ప్రియాం' కొడుకులలో 'పారిసు' అనేవాడొకడు. మీ రావణాసురునికి మల్లేనే వాడు ఒక గ్రీకు రాజకుమారుని భార్యమైన 'హెలెన్' అనే అందగత్తెను ఎత్తుకు చక్కాపోయాడు.' అంది హెర్మియా.

'ఊ.'

'ట్రాయ్‌వాళ్లైన ట్రోజన్లకూ, మా గ్రీకులకూ గొప్పయుద్ధం జరిగింది.'

'ఆ యుద్ధంలో ఎవరు నెగ్గేరు?'

'గ్రీకులే నెగ్గేరు. ట్రోజన్లలో హెక్టరూ మొదలైన మహాయోధులెందరో ఉన్నా జయం గ్రీకులకే లభించింది.' అన్నది హెర్మియా.

'ధర్మమే జయిస్తుంది. రావణుడు మహాపరాక్రమవంతుడైనా ధర్మబలం లేకపోవడంవల్ల ఓడిపోక తప్పిందికాదు.' అన్నాడు హారప్రియుడు.

'కాని గ్రీకులకు విజయం కలిగినా అంత సులభంగా రాలేదది. బాహుబలంతోబాటు బుద్ధిబలం కూడా వినియోగించవలసి వచ్చింది.' అంది హెర్మియా.

'ఏం చేశారు గ్రీకులు?'

'ఎంత శ్రమపడ్డా ట్రాయినగరం గ్రీకులకు స్వాధీనం కాలేదు. ప్రాణం విసిగి తిరిగిపోతూన్న వాళ్ళకిమల్లే నటించి తమ ఆయుధాలన్నీ ఓడల్లోకి ఎక్కించుకుని లంగర్లెత్తేసి ప్రయాణం కట్టారు గ్రీకులు. పోతూన్న గ్రీకు ఓడల్ని చూసి, ట్రోజన్లు 'మనల్ని ఏమీ చెయ్యలేక తిరిగిపోతున్నారు గ్రీకులు!' అని లేవిడీ కొట్టారు. సముద్రపుటొడ్డున గ్రీకు లేమైనా మరిచిపోయారేమో చూద్దామని తలుపులు తెరుచుకొచ్చి చూసేసరికి అక్కడ వాళ్ళకొక పెద్ద కర్ర గుఱ్ఱం కనపడింది.'

'కర్ర గుఱ్ఱమా?'

"ఔను. చాలా ఎత్తుగానూ, పొడుగ్గానూ ఉందా గుఱ్ఱం. ఆ గుఱ్ఱం బొమ్మనుచూసి ట్రోజన్లు మురిసిపోయారు. 'ఇలాంటి అందమైన ఈగొప్ప మానుగుఱ్ఱాన్ని మరిచిపోయారేమిటి గ్రీకులు!' అనుకుంటూ, చక్రాల బల్లకెక్కించి తాపటం చేసిఉన్న ఆ మహా విగ్రహాన్ని బరబరా కోటలోపలకి ఈడ్చుకుపోయారు.'

'ఊ.'

'ఆ పగలల్లా విందులారగించి కోట తలుపులు మూసి, రాత్రి హాయిగా నిద్రపోయారు ట్రోజన్లంతా.'

'ఊ.'

'అర్ధరాత్రి అయేసరికి మాను గుఱ్ఱం ప్రక్కలు రెండూ తలుపులకుమల్లే తెరుచుకుని గుఱ్ఱం కడుపులోంచి ఉక్కుతునకలలాంటి గ్రీకుయోధులు బిలబిలా బయటకు ఉరికేరు.'

క్షమావతి ఆశ్చర్యంతో 'కోటలో ప్రవేశించటానికి గ్రీకులు ఈ ఎత్తువేశారన్నమాట!' అంది.

'ఔను. ఆ యోధులు గబగబా వెళ్ళి కోట తలుపులన్నీ బారెట్టేశారు. పోయినట్టు నటించిన ఓడలన్నీ అప్పటికప్పుడే తిరిగివచ్చి సముద్రపుటొడ్డున సిద్ధంగా ఉన్నాయి. కోటతలుపులు తెరవటంతోనే ఓడలలోని గ్రీకులందరూ నిరాఘాటంగా ట్రాయినగరం ప్రవేశించారు. త్రాగి మత్తుగా నిద్రలో పడి ఉన్న ట్రోజన్లు ఏం జరిగిందో తెలవక ఉలిక్కిపడిలేచి తొడ తొక్కిడిగా ఆయుధాలకోసం పరుగెత్తారు. ఆ యుద్ధంలో ట్రోజన్లు చాలామంది

ప్రాణాలు కోల్పోయారు. గ్రీకులకు విజయం లభించింది.' అని ముగించింది హెర్మియా.

8

కథలు చెప్పుకోడంలో ఒకనాడు 'మినర్వా' ప్రశక్తి వచ్చింది. "మినర్వా ఎవరు?" అంది క్షమావతి.

'మినర్వా అదృష్టదేవత.' అంది హెర్మియా.

'మా లక్ష్మీదేవిలాంటిదన్నమాట.' అంది క్షమావతి. 'ధనంకోసం, ఐశ్వర్యంకోసం మేము లక్ష్మీదేవిని కొలుస్తాము.'

'ఆమె వరాలిస్తుందన్నమాట' అంది హెర్మియా.

'ఇస్తుంది. కాని ఆమెను మేము 'చంచల' అని కూడా అంటాము.' అంది క్షమావతి.

'అంటే?'

" 'చంచల' అంటే ఉన్నచోట ఉండకుండా మారుతోండేది అని అర్థం. ఒకప్పుడు లక్ష్మీదేవి మమ్మల్ని అనుగ్రహించి మాకు రాజ్యం, అంతఃపురాలూ ఇచ్చింది. ఆమె మనస్సు మారటంతోనే మమ్మల్ని వదలి ఇలాగ అడవులపాలు చేసింది." అంది క్షమావతి.

క్షమావతి తలవని తలంపుగా అన్న ఈ మాటలు హెర్మియా మనస్సును కలచివేశాయి. వాళ్ల అంతఃపురాలలో తాను ఉండటం తటస్థించిందన్న ఊహవచ్చి ఏదో నేరంచేసినదానికిమల్లే చిన్నబుచ్చుకుని, 'క్షమా, మేం నిజంగా మీకు అన్యాయమే చేశాము.' అంది.

క్షమావతి తానన్న మాటకు వెంటనే నొచ్చుకుని, 'హిరణ్మయీ! మాటల సందర్భంలో ఏదో అన్నాను గాని, నీ మనస్సుకు నొప్పి కలగాలని కాదు. మనం చిన్నపిల్లలం. ఈ యుద్ధాలూ దండయాత్రలూ మన చేతుల్లో లేవు.' అంది.

'ఓడిపోయినా గుహాలలో ఉండి మీకుమల్లే కష్టపడక్కర్లేదుకదా. మా నాన్న వచ్చాక మీ సంగతి ఆయనతో చెపుతాను.' అంది హెర్మియా.

'మీ నాన్న ఏం చెయ్యగలరు? సెల్యూకసుకు మేమంటే కిట్టదు. మా నాయన అలెగ్జాండరు చక్రవర్తికి పంపుకున్న అర్జీని ఆ దుర్మార్గుడు చక్రవర్తికి అందనివ్వక మామైై లేనిపోని నేరాలుమోపి అడవుల పాలు చేశాడు.' అంది క్షమావతి.

వాళ్ళు ఆరోజున ఇంక కథలేమీ చెప్పుకోలేదు. క్షమావతి పుల్లలూ, చితుకులూ ఏరి తేవటానికి అడవిలోకి వెళ్ళింది. హారప్రియుడు దుంపలు తవ్వి తేవటానికి వెళ్లేడు. ప్రొద్దుటనుంచీ చాకిరీచేసి అలసట చెందిన గాయత్రీదేవి కూర్చున్నచోటే నడుం వాల్చి కన్నుమూసింది. రోహిణి ఏదో పనిచేసుకుంటూంది.

ఆ సమయంలో విశ్వజిత్తు మేల్కొని,' దాహం, అమ్మా.' అని పిలిచాడు.

హెర్మియా వెంటనే లేచి కుంటుకుంటూ వెళ్లి విశ్వజిత్తుకు మంచినీళ్ళపాత్రను అందించింది. 'ఇంకా కొంచెం నీరు కావాలా? మీకు సులువుగా ఉందా?' అని అడిగింది. ఆ మాటవిని గాయత్రీదేవి లేచింది. 'ఏవమ్మా, నువ్వే వచ్చావా? నన్ను లేపలేకపోయావా? క్షమావతి లేదా?' అందామె. 'నేనూ క్షమావతిలాంటిదాన్నే కదా మీకు?' అంది హెర్మియా నవ్వుతో. గాయత్రీదేవి సంతోషంతో ఆ బాలికను కౌగలించుకుంది.

ఇప్పుడు రోహిణికికూడా హెర్మియా అంటే ఇదివరకుమల్లే కిట్టకపోవడమనేది లేదు. ఆమె, 'ఈ పిల్ల చాలా మంచిది. గ్రీకులలో పుట్టవలసినది కాదు!' అంది. గ్రీకులంతా రాక్షసులే అని రోహిణి అభిప్రాయం.

9

క్రమంగా కొన్నాళ్ళకి హెర్మియా పాదం నయమైంది. ఆమె బాగా నడవగలిగాక ఒకనాడు 'ఇంక నన్ను మా యింటికి పంపించెయ్యండి.' అని గాయత్రీదేవి నడిగింది.

'హారప్రియుణ్ణి సాయమిచ్చి పంపుతాను. రాత్రిపూట అడవిలోంచి వెళ్ళటానికి భయంలేదుకదా?' అని అడిగింది గాయత్రీదేవి.

'భయంలేదు. కాని పగటిప్రయాణమంటేనే నాకు సరదా' అంది హెర్మియా.

'నిజమేకాని అది మాకు మంచిదికాదు. హారప్రియుణ్ణి గనక ఎవరైనా చూశారంటే మా గుహ

సంగతి వెల్లడైపోతుంది.' అంది గాయత్రీదేవి.

'తెలిసిపోతేమాత్ర మేమిటి? మా గ్రీకులు మీరనుకున్నంత దుర్మార్గులు కారు. నేను మిమ్మల్ని ప్రేమించినట్లే వాళ్లూ మిమ్మల్ని గౌరవిస్తారు' అంది హెర్మియా.

'అలాగ చెప్పటానికి వీల్లేదు హిరణ్మయీ! చిన్నపిల్లవు నీకు రాజకీయాల సంగతి తెలియదు. మేము జాగ్రత్తగానే ఉండాలి. మా గుహ సంగతి నువ్వు ఎవరికీ చెప్పకూడదు. చెప్పేవంటే ఆ నోటా ఈ నోటా సెల్యూకసుకి తెలిసిపోతుంది. క్షమావతి తండ్రికి జబ్బుగా ఉంది కూడాను. సెల్యూకసు సైనికులు మా సంగతి తెలిసివస్తే ఇక్కడనుంచి ఈ జబ్బు మనిషితో తప్పించుకుపోవటం కూడా కష్టం.' అంది గాయత్రీదేవి.

హెర్మియా గాయత్రీదేవి చేతిలో చెయ్యి వేసి, 'అయితే మీ సంగతి నేనెవరికీ తెలియనివ్వను! ప్రాణం పోతుందన్నా సరే చెప్పను!' అని వాగ్దానం చేసింది.

ఆరోజు చీకటిపడటంతోనే హెర్మియా పుష్కలావతికి ప్రయాణమైంది. ఆమె వెడుతూ తన చిట్టి చేతులతో గాయత్రీదేవికీ విశ్వజిత్తుకీ భారతీయుల పద్ధతిలో నమస్కారం చేసింది. క్షమావతిని కౌగలించుకుని, 'మనం తరచూ కలుసుకుంటే ఎంత బాగుండును?' అంది. రోహిణితో, 'అవ్వా, వెళ్ళివస్తాను.' అంది.

రోహిణికి కూడా హెర్మియా వెడుతోందంటే బాధగానే ఉంది.

హారప్రియుడు అడవిలో ఏ క్రూరమృగమైనా ఎదురైతే అవసరమౌతుందని తన ఖడ్గాన్ని మొలకు తగిలించుకున్నాడు. కూడా ఒక కొమ్ముబూరాను తెచ్చాడు.

'ఈ బూరా ఎందుకు?' అంది హెర్మియా.

'నేను నీతో అడవిచివరకే వస్తాను. అక్కడనుంచి నువ్వు పుష్కలావతి ప్రాకారంవరకూ ఒక్కర్తివే వెళ్లాలి. నువ్వు వచ్చినట్లు కోటలోవాళ్ళకి తెలపటానికి బూరా ఊత్తాను.' అన్నాడు హారప్రియుడు.

ఆరాత్రి వెన్నెల పుచ్చపువ్వులా కాసింది. అడవి గనుక ఎక్కడ చూచినా చెట్లూ, తుప్పలూ, డొంకలూ—వీటి నీడలే కనపడ్డా, చెట్లు లేనిచోట వెన్నెల నేలపైపడి, ఆ వెన్నెలలో నడిచిపోతూన్న వాళ్ళిద్దరికీ బలే సరదాగా ఉంది. ఏ కుందేలైనా బెదిరి పారిపోతూ చప్పుడుచేస్తే హెర్మియా ఉలిక్కిపడి హారప్రియుని భుజం పట్టుకుని ఆగిపోయేది. కాని వెంటనే ఏ కోకిల గానమో వినపడి, ఆ ధ్యాసలో తాను బెదిరిన మాటే మరిచిపోయేది.

ఆరాత్రి ఆ అడవిలో ప్రయాణం చేస్తోంటే హెర్మియాకి హిపోలిటా చెప్పిన కథలు జ్ఞాపకానికొచ్చాయి. అడవిలో దెయ్యాలూ దేవతలూ ఉంటాయంది హిపోలిటా, దేవతలు రెక్కలుండి ఎగురుతూన్న పసిపిల్లల ఆకారాలలో ఉంటారుట. దెయ్యాలు మిడిగుడ్లతోనూ చింపిరిజుట్టుతోనూ చూడటానికి అసహ్యంగానూ, భయంకరంగానూ ఉంటాయిట. వెన్నెలలో వెడుతూన్నప్పుడల్లా హెర్మియాకు ఆ రెక్కల దేవతలు కనపడుతోన్నట్లే ఉండేది నీడలలో నడిచినప్పుడల్లా దెయ్యాలు ఎదురౌతాయేమో అనిపించేది. కాని తన పక్కనే హారప్రియుడు ఉన్నాడన్న ధీమాతో ఆమె దెయ్యాలు వచ్చినా భయపడనక్కర్లేదు అనుకుంది.

వాళ్ళు పుష్కలావతిని చేరుకునేసరికి తెల్లవారుతోంది. 'హిరణ్మయీ! ఇంక నేను దిగడతాను. నువ్వు ఆ దారమ్మటే వెళ్ళి కోటద్వారం చేరుకో. నేను ఈ చెట్టుచాటున ఉండి బూరా ఊత్తాను. మీ మనుష్యులెవరైనావచ్చి నిన్ను తీసుకువెళ్లేవరకూ ఉండి, తర్వాత మా గుహకు పోతాను...మమ్మల్ని మరిచిపోవుకాదూ?' అన్నాడు హారప్రియుడు.

'ఎప్పటికీ మరిచిపోను. మీ అంత మంచివాళ్ళని నేనెలాగ మరువగలను?...మీరంటే మా ఎగయూనుకున్న అభిప్రాయం తప్పు అని కూడా చెప్పి అతని మతం మారుస్తాను.' అంటూ హెర్మియా మెల్లిగా పుష్కలావతివైపు నడిచింది. ఆమె కోటగుమ్మం చేరుకునేసరికి హారప్రియుని కొమ్ముబూరా ధ్వని వినపడింది. మరో క్షణానికి తలుపులు తెరుచుకుని కళ్లు నులుముకుంటూ గ్రీకుసైనికుడొకడు బయటకు వచ్చాడు.

వాడు రావటంతోనే ఆమె ఒకసారి అడవివైపు చూసి, 'నువ్వింక వెళ్ళవచ్చు'నన్నట్లు హారప్రియునికి తెలియజేసి, కోట ప్రవేశించింది.

(ఇంకా ఉంది.)

అమర ప్రేమ

మొ. యు. చౌ

'వాంగ్‌చా'కు పదిహేడేళ్ళ ప్రాయములోనే తండ్రి గతించాడు. ఒంటరిగాడయి పోయాడు. అయినా అతనికి స్వశక్తి మీద ఆధారపడి జీవించగల తెలివి తేటలున్నాయి. మరణశయ్యమీద ఉండగా అతని తండ్రి 'హెంగ్‌చౌ'లో నివసిస్తున్న తన చెల్లెలివద్దకు వెళ్ళమని చెప్పాడు. చెల్లెలి కో కుమార్తె వుంది. వారిద్దరిలో ఎవరికి కుమార్తె, కుమారుడు కలిగినా ఇద్దరూ వియ్యమందుదామని వాగ్దానంకూడా చేసుకున్నారని చెప్పాడు తండ్రి 'చౌ'కు. తండ్రి చెప్పినప్రకారం 'చౌ' స్వగృహం వదలి 'హెంగ్‌చౌ'కు ప్రయాణమయ్యాడు. చిన్నతనంలో ఏనాడో చూచిన మరదలుపిల్లను మళ్ళీ చూడబోతున్నాననే ఆనందంతో హృదయము పొంగిపోయింది. అత్తగారిఇంటివద్ద ఎపుడు వాల్తానా అని ఆత్రంగా వుంది. కాని ప్రయాణ సౌకర్యం అంతగా లేకపోవడంవల్ల గమ్యస్థానం చేరుకొనేటప్పటికి ఇరవైరోజులుపట్టింది.

అతని మేనత్త మొగుడు 'చాంగ్‌యీ'కు అక్కడో ఔషధశాల వుంది. మందులూ అవీ విక్రయించటమే అతని వ్యాపారం. చూడటానికి మనిషి చాలా గంభీరంగా వుంటాడు. కంఠధ్వని కర్ణకఠోరంగా వుంటుంది. గడచిన పాతికేళ్ళనుంచి అతనీ వ్యాపారం చేస్తున్నాడు. నిత్యం స్వయంగా షాపుకు వెళ్ళి వచ్చేవాడు. జాగ్రత్త, పొదుపుగల మనిషవటంవల్ల బాగా సంపాదించాడు. వ్యాపారం బాగా సాగుతోంది. కొత్తగా ఇల్లొకటి కట్టాడు.

షాపులో వాంగ్‌చౌను చూడగానే "ఏంపనిమీద వచ్చావోయి ఇక్కడకు?" అని అడిగాడనటం కంటే ఊరిమాడనడం సమంజసం. సంగతంతా చెప్పాడు వాంగ్‌చౌ. మేనమామ కొంచెం చిరాకుపడి చౌను మనిషినిచ్చి ఇంటికి పంపాడు. ఆ సమయంలో అత్త ఇంటివద్ద లేదు. నీలపుదుస్తులు ధరించిన ఓ అమ్మాయి వచ్చింది చావడిలోకి. ఆమె పేరు చియ్‌నియాంగ్. భుజాలమీదకు వచ్చిపడుతున్న దీర్ఘశిరోజాలతో, నన్నగా, నాజూకుగా, ఎంతో అందంగా వుంది. చౌను చూడగానే ఆశ్చర్యానందాలతో ఉక్కిరిబిక్కిరై—

"నువ్వు-బావ-చౌవి!" అన్నది.

"చియాన్!" అన్నాడు చౌ.

"అబ్బ, ఎంతవాడివయ్యావు?" అంది ఆమె బావవంక చూస్తూ.

"మరి నువ్వుమాత్రం!" అన్నాడు చౌ. అతనికి మరణశయ్యమీద తండ్రి చెప్పినమాటలు గుర్తుకు వచ్చాయి. క్షేమ సమాచారాలు అయినతర్వాత చిన్ననాటి చిలిపి చేష్టలుఅవీ ముచ్చటించుకొన్నారు. 'నేను నీ బావనోయ్' అంటూ తయారయిన వీడెవ్వడురా అని ఆశ్చర్యపోయాడు ఓ కుర్రకుంక - చియాన్ తమ్ముడు.

చియాన్ తల్లి మేనల్లుడిని చూడగానే ఎంతో సంతోషించింది. ఆసంగతీ ఈసంగతీ మాట్లాడిన తర్వాత ఆమె వ్యాపారవిషయం తెచ్చి, చాలాబాగా సాగుతోందని చెప్పింది.

"అవును. ఇల్లు చూస్తోంటేనే తెలుస్తోంది" అన్నాడు చౌ.

"ఆ, మీమామ అంతా అదో రకం మనిషి. పిల్లలూ నేను ఎంతో పోరు పెడితేనేగాని మారలేదు ఈ ఇంట్లోకి. ఇప్పుడుకూడా విచారిస్తారాయన, కొంప అద్దెకివ్వకపోవటం వల్ల ఎంతో డబ్బు నష్టపోతున్నామని. నువ్వు మాతోనే వుండునాయనా! షాపులో ఏదైనాపని ఇప్పించమని మీ మామయ్యనడుగుతాను. నీపనేదో నువ్వు జాగ్రత్తగా చేసుకుపోతూండు. ఆయన నోటికి జడుసుకునేవు. ఫరవాలేదు" అంటూ చెప్పింది అత్త.

ఆమెభర్త చాంగ్ చీకటిపడందే ఏరోజూ షాపునుంచి ఇంటికి వచ్చేవాడుకాదు. ఉదయం షాపుకు వెళ్లేముందు ఎంత చిరాకుగా వుండేవాడో వచ్చింతర్వాతా అట్లానే వుండేవాడు. అందుచేత సాహసించి

ఎవరూ అతనితో అంత చనువుగా వుండేవాళ్లు కాదు. బావమరిది మరణసమస్యకూడా అతని కంతగా సంబంధించినట్టు లేదు. దీంతో వాంగ్‌చౌకు అనాథ యువకుడిలా హీనంగా చూడబడుతున్నాననే భావం కల్గింది. కాని ఉదారస్వభావురాలైన అత్త మంచితనంవల్ల అతడు ఏయిబ్బందీ పడకుండా ఉండేవాడు. తల్లీ కూతుళ్లకు వ్యాపారమంటే బోధపడేదికాదు. తండ్రికి వ్యాపారం తప్ప ఇంకేమీ తెలిసేదికాదు.

కొంతకాలానికి చౌ కూడా ఆ కుటుంబంలోని వ్యక్తిగా స్థిరపడిపోయాడు. అతని చిన్నపుడు తండ్రి అత్తలమధ్య జరిగిన వివాహప్రస్తావన మళ్ళీ ఎప్పుడూ జరగలేదు. వాగ్దానంమాట ఏమైనా వాంగ్ చౌకు ఆసేలిదుస్తుల్లోవున్న అమ్మాయే ఆరాధ్యదేవత అయింది. ఆమె కూడా అతన్నే పెళ్లాడాలని నిశ్చయించుకున్నది.

చియన్‌ప్రవర్తనలో మార్పు గోచరించింది తల్లికి. చియనియాంగ్ ఏపనిచేసినా అది చౌకోసమే నన్నట్లు చేసేది. అతని పనులన్నీ తన స్వంతపనులన్నట్లు చేసేది. అతని బట్టలుతికి బాగుచేయటం నుంచి గది శుభ్రంచేసేవరకు ఆమెదే బాధ్యత.

ఒకరోజున కూతురితో తల్లి అంది చల్లగా:

"ఏమమ్మా, కూరల్లో ఉప్పు మరీ జోరుగా వేస్తున్నావు ఈ మధ్య?"

చియన్‌ముఖం సిగ్గుతో ముడుచుకుపోయింది. కూరల్లో ఉప్పు చాలటం లేదంటున్నాడు చౌ. అదీ కారణం.

చంగన్‌నుంచి ఒకరోజున చియన్ పెదతండ్రిభార్య వచ్చింది. పెదతండ్రి బాగా డబ్బున్న మనిషి. అతనే ఆమె తండ్రివ్యాపారానికి ధనసహాయం చేశాడు. చాంగ్‌కూడా ఇపుడు బాగా సంపాదించినా ఆ విషయం మర్చిపోకబట్టే అన్నంటే భయభక్తులతో చరిస్తాడు. ఆమెకు ఆయింట్లో రాణీ మర్యాదలు జరిగినయ్. భార్యతోకూడా సరససల్లాపాలాడి ఎరగని చాంగ్ వదినగారికి అడుగులకుమడుగులొత్తుతున్నాడు.

వదినగారికి తింటం పదిమంది ఇళ్ళకు వెళ్ళి రావటం తప్ప వేరేపని కనపడటంలేదు. ఉండి ఉండి మెరపులా ఓ ఆలోచన తట్టింది ఆమె బుర్రకు - మరదికూతురుకు పట్టణంలోని ఓధనికకుటుంబంతో సంబంధం మాట్లాడదామని. ఆ పట్టణంలో కల్లా 'సియాంగ్' కుటుంబీకులే ధనవంతులు.

ఓరోజున వాళ్లింట్లో విందుకు వెళ్లివచ్చి అన్నది చియన్ తల్లితో.

"చూడు, చియన్ కపుడే 18 ఏళ్లు వచ్చాయి ఎదిగి కూర్చుంది ఇంట్లో. నేనో సంబంధం చూచాను అమ్మాయికి. సియాంగ్‌వారి రెండో అబ్బాయి ఉన్నాడు. 'సియాంగ్స్' అంటే తెలుసుగా నీకు?"

"లేదక్కా, అమ్మాయి నిదివరకే చౌకిద్దామని ఖాయమయింది" అంది తల్లి.

"అంటే, మీ మేనల్లుడికా? వాడు గోడూ లేదు. మీ అన్న ఏనాడో కాలం చేశాడు."

"అయితేమట్టుకేం అక్కా! ఈడూజోడూ కుదిరింది" తల్లి చౌను గురించి చెపుతూ వెనకేసుకొస్తుంటే చియన్‌కు సిగ్గేసింది.

వదినగారు గొల్లుమని నవ్వుతో అంది "నీకేమన్నా మతిపోయిందా? సమాజంలో పలుకుబడిఉన్న, గౌరవనీయమైన కుటుంబంతో సంబంధం తీసుకువస్తే వాడిని పట్టుకు వేలాడుతావు?"

దీంతో చియన్‌కు అరికాలిమంట నెత్తికెక్కింది. కూర్చున్న చోటినుంచి లేచి తలుపు దభాలున వేసి గది విడచి వెళ్లిపోయింది.

"ఎంతరాలుగాయిపిల్లే! దానికి నేనెంత మంచిచేస్తున్నానో గుర్తించటంలా అది. వాళ్ళభవనం, తోట అదీ నువ్వెపుడూ చూసి వుండవు. ఓసారి చూస్తే నీకే తెలుస్తుంది. బంధుప్రేమలోపడి పిల్లసుఖం పాడుచెయ్యకు." అంటూ బోధించటం మొదలెట్టింది.

చియాన్‌తల్లి ఏమీ జవాబు చెప్పలేదు. తల్లి వినకపోతే మానె తండ్రయినా వినకపోతాడా అనుకుంది. చాంగ్‌కు ఇంతకంటే కావలసిందేమీ లేదు ఈజీవితంలో. భార్యమాటకూడా వినకుండా సంబంధం ఖాయం చేశాడు. ప్రధానపు విందుకూడా జరిగింది. చియాన్ నిద్రాహారాలు మానేసింది.

"దీనివల్ల ఏమీ మంచి జరగదు. అమ్మాయి కిష్టంలేకపోయినతర్వాత చేసి ప్రయోజనం ఏమిటి? లోపలికి వెళ్ళి చూడండి, అదెలా గుండె పగిలేలా ఏడుస్తోందో. మనం చూడవలసింది దాని జీవితసౌఖ్యంకాని, ఆ సియాంగ్‌ల డబ్బుకాదు." అని అనేకవిధాల ప్రాధేయపడి చెప్పింది భర్తకు.

చియాన్ బలవంతంమీద ఆహారంతీసుకొని లేచితిరుగుతోంది. పంజరంలోని పక్షిలా వుంది ఆమె

మనస్సు. వాంగ్‌చౌకేమీ పాలుపోవటంలేదు. మనోవేదన చల్లార్చుకోటానికి హెంగ్ పర్వతాలవైపు పోయాడు. మూడువారాలయింది. చియన్‌ను చూడాలనే కాంక్షను నిరోధించలేకపోయాడు. తిరిగి వచ్చేటప్పటికి చియన్ ఏదో తెలియని వ్యాధితో బాధపడుతోంది. అతను ఇల్లువిడచి వెళ్లిన మర్నాటినుంచి ఆమె జ్ఞాపకశక్తి క్షీణించింది. తనకు తాను తెలియనిస్థితిలో వుంది. స్వంత తలిదండ్రులనే గుర్తు పట్టేది కాదు. వారికి అర్థం కానిమాటలేవో అంటూండేది. కుమార్తెకు మతి భ్రమ కలిగిందేమోనని భయపడ్డారు. ఆహార పానీయాలు లేకుండా ఉన్నా జబ్బేమీ ఉండేది కాదు వంటిని. మాట్లాడాలని ప్రయత్నించేవారు కాని నిర్జీవంగా ఉన్న కళ్లను చూస్తే అదోలా ఉండేది వారికి. మొహమంతా తెల్లగా పాలిపోయింది. వైద్యులు సహితం వ్యాధినిర్ధారణ చెయ్యలేకపోయారు. ఇటువంటి కేసు తామెప్పుడూ చూడలేదనీ, తమ వల్ల కాదని చెప్పారు.

అత్త అనుమతి తీసుకుని చౌ, చియన్ ,ఉన్న గదిలోకి పరుగెత్తుకెళ్లాడు.

'చియ్‌నియాంగ్, చియ్‌నియాంగ్' అని పిలిచాడు. తల్లి ఆత్రంగా పరీక్షిస్తోంది కూతుర్ని. నిర్జీవమైన చియన్ కళ్లలోకి కొత్తకాంతి చేకూరుతోంది. కనురెప్పలు కదుల్తున్నాయి. పాలిపోయిన మొహంలోకి తిరిగి రక్తం చేకూరింది.

'చియ్‌నియాంగ్, చియ్‌నియాంగ్' అని పిల్చాడు చౌ మళ్లీ.

ఆమె పెదవులు ఆనందంతో కదిలాయి.

'చౌ' అంది నీరసంగా.

"చియన్ తిరిగి బ్రతికావమ్మా. చూడమ్మా, చూడు మీ అమ్మను. అవునా?" అంది తల్లి అశ్రుపూరిత నయనాలతో.

"అవును, ఎందుకమ్మా ఏడుస్తున్నావు? ఏమిటిసంగతి? పక్కమీదున్నానేం?" అంది చియన్ ఏమీ తెలియనట్లు. యథార్థంగా ఇంతవరకు జరిగిందేమీ తెలియనట్లేవుందామెకు. తల్లి చెప్పగా విని నమ్మలేకపోయింది.

అమ్మాయికి తిరిగి కొద్దిరోజులలోనే సంపూర్ణారోగ్యం చేకూరింది. సుస్తీగా వున్నపుడు తండ్రి ఏమవుతుందో అని భయపడ్డాడు కాని తిరిగి తేరుకోగానే మామూలు ధోరణి సాగించాడు.

తను చూస్తూండగా కూతురు మొహంలోకి కళ ఏవిధంగా తిరిగి వచ్చిందో - భార్య చెపుతోంటే చాంగ్‌కు కోపం వచ్చింది.

"అంతా మోసం, నటన. డాక్టర్లకుకూడా తెలవదట. తల్లిదండ్రులనే గుర్తుపట్టలేదేం. నేను నమ్మను." అన్నాడు.

"లేదండీ, మీరే చూశారుగా స్వయంగా. బిడ్డ ఆహార పానీయాలు మాని ఎట్లా కృశించిపోయిందో. దానిహృదయంకూడా గుర్తించండి. మళ్ళీ ఆ సంబంధంసంగతి - "

"అంతటితో ఆపు. ప్రధానం కూడా జరిగింది. సియాంగ్ సంబంధం వదిలేయమనేనా నీ ఉద్దేశం అసంభవం" అన్నాడు చాంగ్.

అప్పటికింకా వారితోనే వున్న వదినగారుకూడా మరదికి మద్దతునిచ్చింది. "నేను 50 ఏళ్ళనుంచి చూస్తున్నా. ఇంతవరకు తలిదండ్రులెరగనన్న మనిషిని చూడలేదు" అంది ఇదంతా బూటకమన్నట్లు.

తండ్రి తిరిగి ఆ సంగతి ప్రస్తావించటానికి నిరాకరించాడు.

చౌ ఇదెంతమాత్రం భరించలేకపోయాడు. కాని చేయకల్గిందేమీ లేకపోయింది. నిరాశతోను, నిస్పృహతోను, తను స్వంతంగా జీవించటానికి నిశ్చయించుకుని రాజధానినగరానికి వెళ్ళిపోతున్నానని మామకు తెలియచేశాడు.

"మంచిది" అన్నాడు మామ.

అతని ప్రయాణానికి ముందుగా వారు ఆరాత్రి విందు చేశారు అతనికి. చియ్‌నియాంగ్ రెండురోజుల్నించి పడుకుని లేవటంలేదు. హృదయం బ్రద్దలయ్యేలా ఏడుస్తోంది.

చియన్‌ను కడసారి చూచి వెళ్తానని చెప్పి ఆమెగదికి వెళ్లాడు చౌ. ఆహారంతీసుకుని రెండురోజులయ్యింది. జ్వరం మండిపోతోంది. చౌ ఆమెను సాదరంగా నిమురుతూ "వెళ్తున్నాను చియన్. ఆఖరుసారి చెప్పి వెళ్దామని వచ్చాను. ఇంతకంటే చేయకల్గిందేమీ లేదు" అన్నాడు.

"ఇట్లాగే చావనియ్యి నన్ను. నీవు లేకపోయింతరవాత నేను బ్రతికి ఏంలాభం. జీవించాలనిలేదు నాకు. ఒక్కసంగతిమాత్రం గుర్తుంచుకో చౌ. జీవించినా మరణించినా నా ఆత్మ ఎప్పుడూ నిన్నువెన్నంటే ఉంటుంది - నీ వెక్కడున్నా" అంది చియన్.

చౌ ఆమె నేవిధంగాను ఓదార్చలేకపోయాడు. తిరిగి ఎన్నడూ ఈ ఇంటిఛాయలకే రాకూడదనే నిశ్చ

యంతో చౌ బయలుదేరాడు.

అతనిబోటు రెండుమైళ్లు వెళ్లేటప్పటికే చీకటి పడింది. ఆరాత్రి అక్కడే గడపదలచి లంగరు వేశాడు. ఏకాంతంగా కన్నీళ్లు కారుస్తూ విచారిస్తున్నాడు పక్కమీద. అర్ధరాత్రయ్యింది. గట్టుమీదనుంచి——

"బావా, చౌ" అని చియన్ పిలిచినట్లువిన్పించింది. కలగంటున్నాననుకున్నాడు. పక్కమీద సుస్తీగా వున్న చియన్ ఇక్కడికెట్లా వచ్చింది? బోటు అంచుమీదనుంచి తొంగి చూచాడు. చియన్‌యాంగ్ గట్టుమీద నుంచుని వుంది. ఆశ్చర్యంతో ఒక్కదూకులో ఒడ్డును చేరుకున్నాడు.

"ఇంటివద్దనుంచి పారిపోయి వచ్చాను" నీరసంగా అంటూ అతని చేతుల్లో వాలిపోయింది. వెంటనే ఆమెను బోటులోకి తీసుకెళ్లాడు. మానవాతీతమైన శక్తి ఏదో ఆవహించితేనేతప్ప ఆస్థితిలో ఆమె ఇంత దూరం వచ్చి వుండలేదనుకున్నాడు.

కొద్ది సపర్యలు చేసినపిమ్మట తేరుకుంది ప్రయాణపుబడలికనుంచి. 'మనిద్దరినీ ఎవరూ వేరుచెయ్యలేరు. సర్వదా నేను నీతోనే వుంటాను" అంది. ఆ మర్నాడు తిరిగి వారు ప్రయాణం సాగించారు. త్రోవపొడుగునా విచారించింది తల్లిని గురించి. తను కనపడకపోవటంతో ఎంతగా విలపిస్తుందోనని.

చివరకు వారు 'జఘాన్' లో స్థిరపడ్డారు. అక్కడే వాంగ్‌చౌకు చిన్న ఉద్యోగం దొరికింది. జీతం డబ్బులు పోషణకు లోపంలేకుండా సరిపోతున్నాయి. ఖర్చు తగ్గించటానికని పట్టణానికి మైలుదూరంలో చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. రోజూ అక్కడ్నించి ఆఫీసుకు నడచి వెళ్లేవాడు. చియన్‌యాంగ్ అతనికి వండిపెడుతూ ఉన్నదానితోనే సంతృప్తిచెందుతూ హాయిగా వుంది. చౌకు జీవితం తనకు తాను నమ్మలేనంత మధురంగా వుంది. గర్వంగా తన గదివంక చూసుకొనేవాడు. రెండుకుర్చీలు, బల్ల, ఓమామూలు మంచం - ఇంటిని అద్దెకిచ్చిన గృహస్థు, అతనిభార్యకూడా చాలా మంచివారు. కూరగాయలు కొనుక్కొనేపని లేకుండా తమతోటలో కాచినవి ఇచ్చేవాళ్లు. ప్రతిఫలంగా వీళ్లు తీరికసమయాల్లో తోటపని చేస్తూ సాయంచేసేవాళ్లు.

సంవత్సరం గడచింది. చియాన్‌యాంగ్‌కు ముద్దులొలికే కొడుకు కలిగాడు. ఆఫీసునుంచి రాగానే తల్లి దగ్గిర పాలు తాగుతున్న బిడ్డను చూడగానే యంగ్‌చౌ హృదయం ఆనందంతో ఉప్పొంగేది. కొడుకును చేతుల్లోకి తీసుకుని ముద్దులాడేవాడు. అతనికి చియాన్‌ని చూస్తే బాధగా వుండేది మనస్సులో. ఎంతో గారాబంగా సుఖంగా పెరిగిన దానిని కష్టపెడుతున్నానే అని. చియాన్ ఇవేవీ పట్టించుకోకుండా పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోయేది.

"ఇంకా బాగా సంపాదించి పనిమనిషి నొకదాన్ని పెడ్తా నీకు" అనేవాడు.

"ఊహు అవసరంలేదు. మనపని మనం చేసుకొంటానికేం?" అనేది ఆమె.

వారి జీవితం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా వెళ్లుతోంది. రోజురోజుకూ పిల్లాడిలో కొత్త అందం కొత్తఉత్సాహం కనబడుతున్నాయి. ప్రాకడం నేర్చుకున్నాడు. కావలసిందల్లా అందిపుచ్చుకుంటున్నాడు. పిల్లవాడితో వాళ్ళజీవితం అంతులేని ఆనందంగా తయారయ్యింది. పిల్లలులేని ఆ యింటిదంపతులుకూడా వీడంటే అమృతప్రేమగా వుండేవారు. పిల్లవాడిపోషణలో చియన్‌కు వాళ్లు సహాయం చేసేవాళ్లు.

తండ్రినిగురించి తలవకపోయినా చియన్ ఎపుడూ తల్లి, తమ్ముడ్ని గురించే ఆలోచించేది.

"అమ్మనుగురించే ఆలోచిస్తున్నావు. అవునా? నాకు తెలుసు. ఇంటికి వెళ్లాలని కోరికవుంటే చెప్పు, తీసుకెళ్తాను మనకు వివాహమయ్యింది. మనకు ఈ కుర్రకుంక కూడా ఉండనే ఉన్నాడు. వెళ్లినా వాళ్లు మనల్ని చెయ్యగల్గిందేమీ

(47-వ పేజీ చూడండి)

చైనీస్ కథలు - ఫెంగ్ స్యే ఫెంగ్ :

9. నక్క - కోడిపిల్ల

ఒకసారొక నక్క ఒక కోడిని దొంగిలించి తన నివాసానికి తీసుకుపోయింది. దాని ఈకలన్నీ లాగివేసింది, కాని తినలేదు. "ఇప్పుడు తినకూడదు. దాచుకుని పండగ పూట తింటాను," అనుకుంది. నిద్రపోదామనుకుని కోడిని తలగడగా పెట్టుకుని పడుకుంది.

కాని ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. నక్క లేచి కూర్చుంది: "ఈ తలగడ మరీ మెత్తగా ఉంది. ఇంత మెత్తగా ఉంటే నిద్ర ఎలా పడుతుంది? ఇటు వేపు కొంచెం, అటువేపు కొంచెం తినేస్తాను," అనుకుని కోడి రొమ్ము లోంచి కొంత భాగం, వీపునుంచి కొంతభాగం తినేసింది. మళ్లీ దాన్ని తలగడగా పెట్టుకుని నిద్రపోవడానికి ఉపక్రమించింది. అయినా నిద్ర రాలేదు. ఈసారి తలగడ గట్టిగా రాయిలాగా ఉంది. "బహుశా మరీ ఎక్కువ తినేసి ఉంటాను. అంత ఎక్కువ తినేస్తే ఎలా? మళ్లీ మెత్తటి భాగం వచ్చేదాకా తింటాను," అని అటు కొంచెం, ఇటు కొంచెం తినేసింది. మళ్లీ పడుకుంది. కాని నిద్రపడితేగా?

మూడోసారి లేచి కూర్చుని గట్టిగా ఆలోచించింది. "ఇదివరకు తలగడ లేనప్పుడు హాయిగా తెల్లారే దాకా నిద్ర పోయేదాన్ని. ఇప్పుడు అలవాటు లేని తలగడ ఉపయోగిస్తే నిద్ర పడుతుందా మరి?" అనుకుంది. శుభ్రంగా ఆ మిగిలిన కాస్త మాంసమూ తినేసి, త్రేవుమంటూ బొజ్జ నిమురుకుని కళ్లు మూసుకుని, వట్టి నేలమీదనే తల ఆన్చి పడుకుంది. ఈసారి నిద్రపోవడంపోవడం తెల్లారి పొద్దెక్కేదాకా మళ్లీ లేవలేదు.

★

10. సింహం - మేకపిల్ల

ఒక మేకపిల్ల దురదృష్టవశాత్తు సింహం చేతికి చిక్కింది. "నన్ను తినవద్దు. వదిలిపెట్టు," అని ఎంతో సేపు ఎంతో దీనంగా సింహాన్ని వేడుకుంది. దాని ఏడుపు వినేసరికి ఏ కళన ఉందో సింహానికి పాపం జాలికలిగి "పోన్లే, పో." అని వదిలి పెట్టింది.

కాని మేకపిల్ల తన దారిన తాను పోవచ్చునా? పోలేదు. "సింహం ఎంత మంచిదీ, ఎంత జాలిగుండె కలదీ కాకపోతే నన్ను వదిలి పెడుతుంది? బహుశా నేనంటే దానికి ఎంతో ప్రేమ గావును! నేనంటే దానికి ముద్దు గావును! ఇక్కడే ఉంటాను. సింహం నన్ను పెంచుకుంటుంది. సింహానికి పెంపుడుకొడుకు నంటే నాకెంత గౌరవం! ఎంత గొప్ప!" అనుకుంటూ అనుకుని మేకపిల్ల అక్కడే ఉండి పోయింది.

సింహం అడవిలో తిరిగి తిరిగి అలిసిపోయి ఇంటికి వచ్చేసరికి ఎదురుగా మేకపిల్ల కనిపించింది. ఇక వెనకా ముందూ ఆలోచించకుండా దాన్ని ఒక్క ముద్దలో నమిలి మింగేసింది.

★ అమర ప్రేమ ★

లేదు." అన్నాడు చౌ ఒకరోజు ఆమెతో.

ఆ మర్నాడే వాళ్లు 'హెంగ్ చౌ'కు ప్రయాణమయ్యారు. అక్కడికి చేరుకొనేటప్పటికి నెలరోజులు పట్టింది. తల్లిని చూడాలని చియన్ హృదయం గంతులేస్తోంది.

"ముందు మీరు వెళ్ళి అమ్మకు నాన్నకు చెప్పి నేను అక్కడికి రావటానికి ఏర్పాట్లు చెయ్యండి. ఇదిగో ఈ తలపిన్ను తీసుకెళ్ళండి గుర్తుగా. వాళ్లు మీ కథ నమ్మకపోయినా, ఇంకా కోపంగా ఉన్నా, ఇది చూపెట్టండి" అని ఓ బంగారుపిన్ను ఇచ్చి పంపింది.

గట్టున బోటుకు లంగరేసి చియన్‌నక్కడ వదిలి బయలుదేరాడు చౌ.

ఇంటికి వెళ్లేటప్పటికి చాంగ్ అక్కడే వున్నాడు. కుమార్తెను తీసుకునిపారిపోయినందుకు క్షమించమని ప్రార్థించాడు. అత్తకూడా అక్కడే వుంది. అల్లుడిని చూడగానే పోయినప్రాణం తిరిగి వచ్చినట్లయిందామెకు. చౌ వాళ్ళకు అంతా వివరించి చెప్పాడు. మళ్ళీ తాము తిరిగివచ్చామని, చియన్ గట్టుదగ్గిర బోటులో వుందని.

"దేన్నిగురించి మాట్లాడుతున్నావు నువ్వు? క్షమించటం దేనికి? అమ్మాయి సంవత్సరం నుంచి సుస్తీగా మంచంమీదే వుంది" అన్నాడు చాంగ్‌యీ.

"నువ్వు వెళ్ళినప్పట్నించి అమ్మాయి పక్కమీదే వుంది. తిండికూడా లేకుండా పడుంది కొన్నివారాలు. మరుద్దామన్నా మరుపురాదు. ఆ సియాంగ్‌ల సంబంధం కూడా వదిలేస్తామని వాగ్దానం చేశాను అదికూడా వినిపించుకున్నట్టులేదు. దాన్ని చూస్తోంటే శరీరంలోంచి ప్రాణం ఎగిరిపోయినట్లే ఉంది. రోజూ నీకోసమే ఎదురుచూస్తున్నాను బాబూ"అంది అత్త.

"నామాట నమ్మండత్తయ్యా! చియనియాంగ్ ఆరోగ్యంగానే వుంది. బోటులో వుందిప్పుడు. గుర్తుకూడా ఇచ్చిపంపింది చూడు."

చియన్ ఇచ్చిన తలపిన్ను చూపెట్టాడామెకు. జాగ్రత్తగా పరీక్షించి గుర్తుపట్టింది. ఇదంతా వారికి అర్థంకాకుండావుంది.

"నే చెపుతున్నా వినత్తా. చియన్ బోటులోవుంది. కావాలంటే మనిషిని పంపు నాతో చూపెడ్తా." అన్నాడు.

తల్లిదండ్రులిది వింటూంటే విభ్రాంతులయ్యారు. ఇది ఏమిటో చూద్దామని చౌతో మనిషిని పంపారు. తర్వాత పల్లకి వెళ్లింది. మనిషి వచ్చి చూశాడు. చియనియాంగ్‌ను గుర్తించాడు.

"అమ్మా, నాన్నా బాగున్నారా" అని అడిగింది.

"ఆ. బాగానే వున్నార"ని జవాబిచ్చాడతను.

సంగతీ సందర్భం బోధపడక వాళ్లు తల్లడిల్లకింద వుతూ నౌకరు రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఇంతలో పనిమనిషి తలపిన్ను తీసుకుని సుస్తీగా వున్న అమ్మాయి గదిలోకి వెళ్ళింది. చౌ వచ్చాడని చెప్పగానే కళ్ళు తెరచి చిరునవ్వు నవ్వింది. తలపిన్ను చూచి 'నాదే పోగొట్టుకున్నాను' అంటూ తలలో పెట్టుకుంది.

పనిమనిషి పరధ్యానంగా ఉండగా ఆ అమ్మాయిలేచి మొహంమీద చిరునవ్వు చిందులాడుతోండగా నిశ్శబ్దంగా ఇల్లు విడిచి గట్టువైపు బయలుదేరింది. అపుడే చియనియాంగ్ బోటులోంచి బయటకు వస్తోంది. చౌ పిల్లడిని ఎత్తుకునుంచున్నాడు. దగ్గరలో ఓ అమ్మాయి రావటం గమనించాడు. చియన్ ఆ అమ్మాయికి అభిముఖంగా నడుస్తోంది. మరి కొద్ది క్షణాల్లో వారిద్దరూ కలుసుకోగానే వారి శరీరాలు రెండూ లీనమై ఒకటిగా గోచరించాయి. చియన్ నవ్వుతో నిలబడిందక్కడ.

పక్కమీది తమ కుమార్తె మాయమయిందని వినగానే తల్లిదండ్రులు కలవరం చెందారు. అంతలోనే పిల్లడినెత్తుకుని పల్లకీలోంచి దిగుతున్న చియన్‌ను చూస్తే వాళ్ళకు నోట మాటరాలేదు. నిజంగా తమ 'చియన్‌యాంగే' అనిపించింది. తల్లీ కూతుళ్లు ఆనందంతో కౌగలించుకున్నారు.

ఇపుడు తెలుసుకున్నారు వాళ్లు. ఇన్నాళ్లనుంచిమంచంమీదవున్నది నిర్జీవమైన చియన్ ఛాయమాత్రమేనని, ఆమె చౌను ఏనాడో చేరుకుందని.

చౌ మామకు వ్యాపారంలో సాయంచేస్తూ అక్కడే వుండిపోయాడు.

(లిన్యుటాంగ్ ఇంగ్లీషులోకి అనువదించిన చైనీస్ కథకు తెలుగు) ★

(11-వ పేజీ తరువాయి)

సంఘానికి వెన్నుముక! ★

అతని జీతం చాలదు. చాలకపోయినా నాలుగుగోడలమధ్య ఎలాగో కాలక్షేపం చేస్తాడు. పాటకపు జాతిలో స్త్రీ పురుషులు కాయకష్టపడి డబ్బు సంపాదించుకుంటారు. కాని, మేష్టరు తినే కుటుంబానికి సొమ్ము సంపాదిస్తాడు. మానుషానికి ప్రస్తుతారు కాని మధ్యతరగతి కుటుంబాల మహిళలు డబ్బుకోసం ఏ పని పాటలూ చేయడానికి సిద్ధపడరు.

ఈ ఆలోచనలతో రామారావు మెల్లిగా తనబసకు చేరాడు. జరిగిన సంగతి తోటి వాచర్లతో చెబితే వాళ్లలో సీనియర్లిద్దరు ఒకరి మొగం ఒకరు చూచి నవ్వుకున్నారు. ఆ నవ్వు యెందుకో రామారావుకి అర్థం కాలేదు. బహుశః వాళ్లున్న గదులలో ఎప్పుడూ కాపీ చెయ్యరేమో? అనుకున్నాడు. మిగిలినవాళ్లు మాత్రం రాఘవులు చేతిలోపడి తిన్నగా వచ్చినందుకు ఎంతో అభినందించారు రామారావుని.

పరీక్షలలో విద్యార్థులు ఒకరితో ఒకరు మాట్లాడకుండా, కాపీచెయ్యకుండా వుండడానికే వాచర్లు తమ శాయశక్తులా తంటాలు పడుతూవుంటారు. ఏది కావలసినా విద్యార్థి వాచరుదగ్గిరకి రారాదు. లేచి నిలబడితే వాచరు అతనికి కావలసినవి తెచ్చి యిస్తాడు. ఇది ఒక మార్గంగా తీసుకుని అక్కరలేకపోయినా ఏదో కావాలని అడగడం, ఆయన అటు వెళ్లి వచ్చేలోగా కాపీ చెయ్యడం, లేదా ఏ కాలిగోరుమీదో, కాలిమీదో, అరచేతిలోనో వ్రాసినదానిని చూచి వ్రాసుకోవడం, టోపీలో పెట్టి తెచ్చుకున్న కాగితాన్ని తీసి చూచుకోవడం, (గాలికోసం తీసినట్లు టోపీతీసి) చొక్కా చేతిమడతల్లోనో, బూట్లలోనో తెచ్చుకున్న కాగితాన్ని తీసి చూసుకుందుకు చేతిమడతలు సవరించుకోవడం, జోళ్ళలోంచి కాళ్ళుతీసి నేలవైపు ఆలోచిస్తున్నట్లు చూడడం ఇత్యాదులు జరుగుతూంటాయి. ఇలాంటివి వాచరు చూసి ఫిర్యాదుచేస్తే విద్యార్థులకీ, వారి తరపు వారికీ కోపం, కచ్చకట్టడం. పీకలమీదికి రావడం. ఫిర్యాదు చెయ్యకపోతే వాచరు అధికారుల ఆగ్రహానికి గురికావలసిందే! తనవిధిని నిర్వర్తించనివానిక్రింద, అసమర్థునిక్రింద లెక్కకు వచ్చి ఉద్యోగానికే ముప్పు. ముందు నుయ్యి. వెనక గొయ్యి. వదలమంటే పాముకి కోపం; పట్టమంటే కప్పకి కోపం.

రామారావుకి ఆరాత్రి కంటిమీద రెప్ప మూత పడలేదు. కన్నుమూస్తే రాఘవులు భయంకరాకారం కనబడుతోంది. పరీక్షల సందర్భంలో జరిగినవెన్నో విన్నాడు. అవన్నీ ఒక్కొక్కటే జ్ఞాపకం రాసాగాయి.

రామారావుకి శర్మ అనే స్నేహితుడుండేవాడు. ఆయనా మేష్టరే. వాచరుగా వెళ్ళాడు ఒక వూరికి. అతని గదిలో ఒక విద్యార్థి పేపరు పుచ్చుకున్న అరగంటకి వెళ్లిపోయాడు. అక్కడికి దగ్గరలో నేవున్న ఒక యింట్లోంచి మెగాఫోన్‌లో ఆనాటి పరీక్షప్రశ్నలకు జవాబులు పుస్తకంలో చూసి ఎలక్షన్ కాన్వాసింగ్ గొంతుకతో చెప్పేస్తున్నాడు. తలలు యెత్తకుండా విద్యార్థులంతా చెవులతోవింటూ చేత్తో రాసేశారు. వాచరు కాదుగదా బ్రహ్మదేవుడైనా ఏమీ చెయ్యలేని పరిస్థితి అది. ప్రశ్నలు పైకి ఎలా పోక్కాయని హెడ్ మాస్టరు వాచర్ల నడిగారు. శర్మగదిలో తప్ప మిగిలిన గదుల్లోంచి విద్యార్థులు యెవ్వరూ వెళ్ళలేదు అని తేలింది. ఫలానా నంబరు విద్యార్థి వెళ్లాడనీ, వెళ్లిన మరి కాస్సేపటికే జవాబులు వినిపించాయని శర్మ చెప్పాడు. బహుశః అతనే అయివుంటాడని అన్నాడు. ఆచోకీతీసి ఆ విద్యార్థిని పట్టించాడు హెడ్ మాస్టరు పోలీసుల చేత.

తెల్లవారేసరికి వూరంతా గుప్‌మంది. "ఎవరో శర్మగారనే మేష్టరుట. హత్య చేయబడ్డాడు" అని. ఆ విద్యార్థి తాలూకు వాళ్లలో ఒకాయన శర్మగారిని "మేష్టారూ" అని పిలిచి అతను యివతలకి రాగా నేకత్తితో గుండెల్లో ఒక్కపోటు పొడిచాడుట. హంతకుడు పారిపోయాడుట. తోడి వాచర్లు చెప్పారు. వారి బసలో జరిగిందీ హత్య....

కాపీ చేస్తుండగా చూసిన ఒక వాచరుని విద్యార్థి ముక్కుమీద పిడికిలి బిగించి గుద్దుటవల్ల వాచరు ముక్కు, నోట రక్తం కక్కుకుని పడిపోయాడు నిలబడ్డచోటే...

ఒకచోట కాపీ చేస్తున్న విద్యార్థి దగ్గరకి వచ్చి నిలబడిన వాచరుని ఆ విద్యార్థి కోపంతో మొలలోంచి కత్తి చర్రున లాగి "జాగ్రత్త" అని బెదిరించాడుట. పైగా "రిపోర్టు చేశావా నీప్రాణాలు దక్కవు" అన్నాడుట.

ఆ వాచరు రెండేళ్ళలో రిటైర్ కాబోతున్నాడు. పెద్ద కుటుంబీకుడు. అంతా ఆడసంతానం. చేతికి అక్కరకువచ్చే మగ బిడ్డలు లేరు. ఒక్క రెక్క సంపాదన. ఏదో ఒకలాగ సంసారం నెట్టుకు వస్తున్నాడు. పెద్దతనంవల్ల చాలాసేపు నిలబడాలేడు. కూర్చోనూ లేడు. తిరగనూ లేడు. పోనీ "వాచింగు వొద్దు" అందామనుకుంటాడు. కాని, రోజుకి రెండున్నర, ఏఖర్చుకైనా వస్తుంది. పిల్లలజీతానికైనా వస్తుంది. ఇల్లాలి కోక ముతకకోక కావచ్చు. ఎన్నాళ్లనుంచో చిన్నపిల్ల పువ్వుల పరికిణీఅంటోంది. ఎలాగో కష్టపడితే పదిరూపాయల పైచిలుకు కళ్లబడుతుంది. అని కక్కుర్తి పడి వచ్చాడు. ఆకత్తి చూసి ఖంగారు పడిపోయాడు. ఆ తరవాత రెండుసంవత్సరాలు పనిచేసినా వాచరుగా వెళ్ళలేదు...

"ఇన్ని బాధలకు గురి అయే వాచరు యుద్ధవీరుడువంటివాడు. యుద్ధవీరుడిలాగే వాచరు బ్రతుకూ యింటికి వచ్చేదాకా నమ్మకం లేదు. ఈరోజులలో ఇళ్ళదగ్గిర ఆడవాళ్లు పరీక్షలకు వెళ్ళిన తమభర్తలు తిరిగి వచ్చేదాకా వెయ్యిదేవుళ్ళకు మొక్కుకుంటారేమో పాపం" అనుకుని ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు రామారావు.

ఆఖరిపరీక్ష పూర్తయిపోయింది. ఆన్సరు బుక్కులు హెడ్ మేష్టరికి అప్పగించేస్తే వూరికి వెళ్ళిపోవచ్చు వాచర్లు. రామారావు విద్యార్థులవద్దనుండి ఆన్సరుబుక్కులు తీసుకున్నాడు. కట్టకడపటి పేపరులోంచి నాలుగు అచ్చుకాగితాలు క్రిందపడ్డాయి. తీసి చూశాడు రామారావు. పరీక్షలో అడిగినప్రశ్నలకు జవాబులు ఆ పేపర్లలో వున్నాయి. ఆన్సరుబుక్కు, ఆకాగితాలు దగ్గిర పెట్టుకుని చూశాడు. వాటిలోనుండి ముక్కకి ముక్కగా కాపీ చేశాడు విద్యార్థి. తను చదువుకుందుకు తెచ్చినవన్నీ తెచ్చుకుని కావలసిన కాగితాలు చింపుకొని సావకాశంగా కాపీ చేసుకున్నాడు. మూలగా కూర్చోవడంచేత ఎవ్వరూ కనుక్కోలేకపోయారు. ఖంగారులో ఆ కాగితాలు తీసెయ్యడం మరిచిపోయాడు విద్యార్థి. ఆ గదిలో రామారావుతోపాటు మరిద్దరు వాచర్లున్నారు. అచ్చుకాగితాలు క్రిందపడ్డం ఆ వాచర్లు, విద్యార్థులూ చూశారు. నలుగురిలో పడిపోయిన విషయం కనుక రిపోర్టు చెయ్యక తప్పదు. ఇటు ధర్మం. అటు భయం. ఏది ఎక్కువ? ఆలోచిస్తే ధర్మంవైపే మొగ్గు చూపింది అతని అంతరాత్మ. ఆ విద్యార్థి రాఘవులు కొడుకే! అయినా సరే. వెళ్ళి రిపోర్టుచేశాడు నిర్భయంగా. కేసు రికార్డయింది

రామారావు ఆ సాయంత్రమే రైలుకి బయలుదేరాడు. ఆ వీధి చివర మలుపు తిరిగితే రైలుస్టేషన్ పదిబారల దూరంలోవుంది. రామారావు మలుపులోకి వచ్చేసరికి రైలుకి సిగ్నలిచ్చారు. చేతిలో సూట్‌కేసుతో గబగబా నడుస్తున్నాడు. వెనకనుండి యెవరో తలమీద బలంగా మోదారు "అమ్మా" అంటూ చేత్తో తలపట్టుకుని అక్కడే పడిపోయాడు వాచర్ రామారావు. కొట్టినవాడు పారిపోయాడు. నలుగురూ మూగి స్పృహతప్పి, నెత్తురు మడుగులో వున్న రామారావుని ఆస్పత్రిలో చేర్పించారు.

ఇంటిదగ్గిర రామారావు ఇల్లాలికి తెల్లవార్లూ పీడకలలే!!! ★

ఫిలిం ఇన్‌స్టిట్యూట్ స్థాపన

మద్రాసుకు వివరసేకరణ సంఘసభ్యుల రాక

భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేయదలచిన ఫిలిం ఇన్స్టిట్యూట్ స్థాపనకు సంబంధించిన వివరాలను సేకరించడానికి వివరసేకరణ సంఘంవారు గతివారం మద్రాసు వచ్చారు. ఈ సంఘానికి శ్రీ బి. ఎన్. సర్కార్ అధ్యక్షులు. శ్రీ ఎస్. బానర్జీ (ఫిలిమ్స్ డివిజన్ పరిపాలనాధికారి) సమావేశకర్త. శ్రీ కె. సుబ్రహ్మణ్యం, కృష్ణగోపాల్ (బొంబాయి), డా॥ కె. ఎస్. మథుర్ (నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ, న్యూఢిల్లీ) సభ్యులు.

ఈ సంఘంవారు జెమినీ, వాహినీ, ఎ. వి. ఎమ్. మొదలైన స్టూడియోలను దర్శించి ఫిలిం పరిశ్రమకు సంబంధించిన వివిధ సంఘాలతోను, వ్యక్తులతోను దర్చలు జరిపారు. దక్షిణభారత ఫిలిం జర్నలిస్టుల సంఘ కార్యవర్గ సభ్యులుకూడా వీరిని కలుసుకొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఫిలిం ఇన్స్టిట్యూట్ సౌకర్యాలు దేశంలోని అన్నిప్రాంతాలవారికీ అందుబాటులో ఉంచడానికిగాను వేర్వేరు చోట్ల ఇన్స్టిట్యూట్‌లు స్థాపింపబడాలని, ఒకదానిని మద్రాసులో స్థాపించాలని, పది పైగా స్టూడియోలు, అనేక సౌకర్యాలు కలిగి ఫిలిం పరిశ్రమకు ప్రధాన కేంద్రాలలో ఒకటైన మద్రాసు ఇందుకు అన్నివిధాలా తగిఉన్నదనీ వారు నివేదించారు.

ఈ సూచనను జాగ్రత్తగా పరిశీలిస్తామని వివరసేకరణ సంఘంవారు హామీ ఇచ్చారు.

ఫిలిం ఇన్స్టిట్యూట్ ఏయే శాఖలలో పని చేయాలో, దానిని ఎక్కడ స్థాపించాలో, ఒకటికంటె ఎక్కువ ఇన్స్టిట్యూట్‌లు స్థాపించడం అవసరమో కాదో మొదలైన విషయాలలో తామింకా ఒక నిర్ణయానికి రాలేదని ఎస్. బానర్జీ చెప్పారు. ఈ ఇన్స్టిట్యూట్‌లో ఫొటోగ్రఫీ, సౌండ్, సెట్స్, మేకప్, స్క్రిప్టు రచన దర్శకత్వం మొదలైన శాఖలలో అర్హులైన విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వబడవచ్చుననీ, సంగీత దర్శకత్వం, నటన శాఖలలో తర్ఫీదు ఇవ్వడం కష్టసాధ్యం అనీ ఆయన అన్నారు. ఫొటోగ్రఫీ మొదలైనవాటికి కూడా కొన్ని చిక్కులున్నాయి. ఇన్స్టిట్యూట్ లో తర్ఫీదుపొంది అర్హత సంపాదించిన టెక్నిషియన్లకు స్టూడియో యజమానులు, నిర్మాతలు ఉద్యోగావకాశాలు ఇవ్వకపోవచ్చును. ఇప్పటికే టెక్నిషియన్లు ఎక్కువగా ఉన్నారనీ, వీరందరికి పని కల్పించడం కష్టంగా ఉన్నందున చాలమంది నిరుద్యోగులుగా ఉండిపోతున్నారని, వీరికి తోడు కొత్తవారికి శిక్షణఇచ్చి దేశంమీదికి పంపిస్తే నిరుద్యోగ సమస్య ఇంకా ఎక్కువ అవుతుందనీ కొందరు వాదిస్తున్నారు. ఈ వాదనను దృష్టిలో పెట్టుకోవలసి వుంటుందని బానర్జీగారన్నారు.

అయితే ఫిలిం ఇన్స్టిట్యూట్ స్థాపించడం అవసరమనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించవే గుర్తించింది. ఇక ఈ విషయమై వెనుకంజ వేయడం అంటూ ఉండదు. నిజానికి ఇప్పుడు ఫిలిం టెక్నిషియన్లుగా పనిచేస్తున్న వారిలో పలువురు సుశిక్షితులైనవారు కారు. సరియైన టెక్నికల్ విద్యా సౌకర్యాలులేని కారణంచేత వీరందరు స్వయంకృషిమీదనే ఆధారపడి ఫిలిం రంగంలోకి ప్రవేశించారు. కొందరు కేవలం స్వీయప్రతిభ చేతనే టెక్నిక్‌లో ఉత్తమసాయి అందుకున్నారు. అటువంటివారు కొద్దిమంది



జెమినీవారి హిందీచిత్రం "ఇన్సానియత్"లో విజయలక్ష్మి.



శారద్ ప్రొడక్షన్స్ "ఊంచీ హవేలీ"లో నిరూపరాయ్.



జూపిటర్ వారి "నయా ఆద్మీ" (ఇదే దారి)లో అంజలీదేవి.

★ ఫిలిం ఇన్స్టిట్యూట్ స్థాపన ★

మాత్రమే ఉన్నారు. టెక్నికల్ గా చిత్ర నిర్మాణ స్థాయిని అభివృద్ధి చేయడానికి మంచి శిక్షణ పొందినవారు అధిక సంఖ్యలో రావాలి. వైద్యం, న్యాయవాదవృత్తి, ఉపాధ్యాయ వృత్తి మొదలైనవాటిలో కనీస అర్హతలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లే ఫిలిం టెక్నిక్ లో కూడా ఏర్పాటు చేసి, ఆ అర్హతలు కలిగినవారిని స్టూడియోలవారు, నిర్మాతలు తీసుకునేటట్లు ప్రభుత్వం ఒప్పించాలి. ఫిలిం పరిశ్రమలోనివారిని ఇందుకు ఒప్పించడం కష్టసాధ్యం కానేరదు.

ఫిలిం ఇన్స్టిట్యూట్ ల ద్వారా టెక్నీషియన్లను తయారుచేయడంలో మరొక చిక్కని ప్రయోజనం కూడా ఉన్నది. ప్రస్తుతం కామెరా మెన్ గా, సౌండ్ ఇంజనీర్లుగా, [illegible] పనిచేస్తున్న అనేకులకు తమ తమ ప్రత్యేక శాఖల్లో తప్ప మిగతా శాఖల్లో అభినివేశం ఉండడం సాధ్యం కావడంలేదు. ఫోటోగ్రఫీలో ప్రవీణుడుగా పేరుపొందిన వ్యక్తికి సౌండ్ విషయం గాని, సెట్స్, మేకప్ మొదలైన విషయాలుగాని, మొత్తం చిత్రం, దాని ప్రయోజనం వగైరాలు గాని తెలిసేందుకు అవకాశం ఉండడంలేదు. ఇందువల్ల మన చిత్రాలు సమగ్రమూ, సర్వతోముఖమూ అయిన స్థాయిని అందుకోలేకపోతున్నవి. నేర్పరి అయిన ఫోటోగ్రాఫరు ఫోటోగ్రఫీకి సంబంధించినంతవరకూ తన తెలివితేటలను ప్రదర్శించుకోడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నారు కాని, తన ఫోటోగ్రఫీ కళ, నటన మొదలైనవాటికి నిజంగా సహాయపడుతున్నదో లేక హాని కలిగిస్తోందో తెలుసుకునే స్థితిలో లేరు. అలా కాకుండా ఫోటోగ్రఫీలో ప్రత్యేక శిక్షణ పొందిన వ్యక్తి చిత్రనిర్మాణానికి సంబంధించిన వివిధ శాఖలలో [illegible]ంగానైనా ప్రవేశం పొందినట్లయితే తన పనివాడితనం ఇతర శాఖలకు అనుగుణంగానే ఉండేటట్లు చూసుకోగలరు. ఇది ఫిలిం ఇన్స్టిట్యూట్ లలో క్రమపద్ధతిలో శిక్షణ పొందిన టెక్నీషియన్లకే సాధ్యమవుతుంది. ఈ కారణం చేత, మొత్తం ఫిలిం పరిశ్రమ అంతటా అభివృద్ధిని కాంక్షించే టెక్నీషియన్లు, నిర్మాతలు అందరూ ఫిలిం ఇన్స్టిట్యూట్ స్థాపనను సమర్థించవలసి ఉంది.

ఫిలిం ఇన్స్టిట్యూట్ లో నటనా శాఖలో కూడా శిక్షణ ఇవ్వడం విషయమై నిర్మాతలు, సంఘంవారు తగిన ఆలోచించాలి. [illegible] ఫిలిం నటనకూడా [illegible]. ఇందులో వ్యక్తిగతమైన ప్రతిభ ఎక్కువ పనిచేస్తుంది. ఒక వ్యక్తికి ఎంత శిక్షణ ఇచ్చినా గొప్ప నటుడుగా తయారుచేయడం సాధ్యం కాకపోవచ్చు. అయినప్పటికీ వ్యక్తిత్వం మొదలైనవాటి వలెనే నటనను కూడా శాస్త్రీయ పద్ధతులలో బోధించడానికి వీలున్నది. అభినయకళకు సంబంధించిన అలంకార శాస్త్రం మన ప్రాచీన వాఙ్మయంలోనూ, ఇతర దేశాలలోనూ విశేషంగా ఉన్నది. ఇందులో నటనా విద్యార్థులకు బోధించవచ్చును. వీరికు కూడా చిత్ర నిర్మాణపు ఇతర శాఖలలో [illegible]ంగా ప్రవేశం కలిగించ

తచ్చును. మాస్కోలో ఉన్న సినిమా ఇన్స్టిట్యూట్‌లో దర్శకత్వం, నటన, స్క్రిప్టు రచన, సినిమటోగ్రఫీ అనే నాలుగు శాఖలలో తర్ఫీదు ఇవ్వబడుతుందట. దర్శకత్వ శాఖలోని విద్యార్థులకు దాదాపు 80 విషయాలలో పాఠాలు బోధించబడతాయట. తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం, లలిత కళల్లు, చలన చిత్ర, నాటకరంగ పూర్వచరిత్ర, సినేరియో రచన, ఎడిటింగ్, నటన, ఫొటోగ్రఫీ, లైటింగ్, మేకప్, సెట్ డిజైనింగ్ మొదలైన విషయాలన్నిటిలోనూ దర్శకత్వశాఖా విద్యార్థులకు బోధన జరుగుతుందట. ఇదేకాక, ఇంకా వివిధ పాశ్చాత్య దేశాలలో ఫిలిం టెక్నిక్ శిక్షణ ఏవిధంగా జరుగుతున్నదో పరిశీలించి ఆ పద్ధతులలో పనికివచ్చేవాటిని మన ప్రభుత్వం ఫిలిం ఇన్స్టిట్యూట్‌లో అమలు చేయడానికి ప్రయత్నించాలి.

బాలచిత్రనిర్మాణం

శ్రీ కె. సుబ్రహ్మణ్యం, బి. ఎన్. సర్కార్, వి. శాంతారాంగార్లతో ఏర్పడిన బాలచిత్రసంఘం ప్రస్తుతానికి 8 చిత్రాలను ప్రత్యేకంగా పిల్లలకోసం నిర్మించ నిశ్చయించింది. ఈ చిత్రాలను హిందీలో నిర్మిస్తారని, మిగతా భాషల్లోకి వాటిని 'డబ్' చేయవచ్చుననీ, ఈ చిత్రాలకు తగిన కథలను పంపవలసిందని దేశంలోని ప్రముఖ రచయితలను తాము కోరుతున్నామని, కథలు పంపదలచేవారు "సెక్రటరీ, చిల్డ్రెన్స ఫిలిమ్ సొసైటీ, సప్రూ హౌస్, న్యూఢిల్లీ" చిరునామాకు పంపాలనీ సుబ్రహ్మణ్యం గారు తెలియజేశారు. ఈ కథలు 15 ఏళ్ళలోపు పిల్లలను దృష్టిలో పెట్టుకొని రచించాలని కూడా ఆయన విజ్ఞప్తిచేశారు.

సైగల్ చిత్రం

"అమరగాయకుడు" అనే పేరున సైగల్ జీవితకథను చిత్రీకరిస్తున్న బి. ఎన్. సర్కార్, ఆ చిత్రం పూర్తికావచ్చిందనీ, సెప్టెంబరు ఆఖరులో విడుదల చేయవచ్చుననీ చెప్పారు. ★



"బీర్బల్ పరిస్తాన్ మే" హిందీచిత్రంలో కొత్త నటి సజ్జు.

పిల్లలచిత్రాల ప్రదర్శన
విజయవాడసంఘం కృషి

రచన: కె. నరసయ్య

మూడు నెలల కృషి ఫలితముగా విజయవాడలోని బాల చలన చిత్రోత్సవ సంఘం ప్రదర్శనలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేయడంలో విజయవంతమయింది.

ఏప్రిలు 17 వ తేదీన ప్రథమ ప్రదర్శనము డాక్టరు టి. వి. యస్. చలపతిరావు గారి అధ్యక్షతను జరిగింది. ఆనాడు సుమారు 3000 మంది బాలప్రేక్షకులు ఉత్సాహముతో చిత్రాలను చూచారు. ఆనాడు చూపబడిన చిత్రాలు బాలల చిత్రమాల, డాక్యుమెంటరీ,



"ఇన్సానియత్"లో దేవ్ ఆనంద్, బీనారాయ్.

చేపలవాడు - చేప (కార్టూన్),
చీమ - మిడుత (కార్టూన్).

వీటిని చూచిన బాలల ఉత్సాహాన్ని గమనించి ఈ చిత్రాలను క్రమపద్ధతిలో ప్రదర్శించాలని సంఘం నిర్ణయించింది.

తరువాత ఏప్రిల్ 24 వ తేదీన కొరియన్ జానపద గాథా చిత్రం "సాహస వీరుడు", గాలి అలవాట్లు' (డాక్యుమెంటరీ), [illegible] పోరులు (డాక్యుమెంటరీ) చిత్రాలను చూపించారు.

చిత్రాలు తక్కువగా ఉండటంవలనను, ఇంకా ఇతర సాంకేతిక బాధకాల వలనను సంఘంవారు మొదట్లో నే మంచి చిత్రాలను ప్రదర్శించలేకపోయారు. బాలల అభిరుచులు కొంతవరకు సంఘంవారు గ్రహించారు. ఇదివరలో ఇట్టి బాలచిత్రోత్సవం జరిపిన బొంబాయి మహిళా మండలివారు ప్రకటించిన వృత్తాంతం సహాయము వలన వివిధ సంస్థలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు.

సోవియట్ ఎక్స్‌పోర్టు ఫిలింవారు ఈ కార్యక్రమానికి చిత్రాలను ఇస్తామంటూ జవాబులు వ్రాశారు. వారిచ్చిన సహాయాన్ని ఆధారము చేసుకొని మే 1 వ తేదీన సోవియట్ రెండు రీళ్ళ కార్టూన్ చిత్రాలు అయిదు చూపబడినవి. ఇవి

కాకి - నక్క కథ,
అల్లరి పిల్లిపిల్ల,
మంత్రశక్తి,
మ్యూజిక్ సర్కస్,
ఎలుగుబంటి పిల్లలు ఆ [illegible].

ఆనాడు పిల్లలు ఆ చిత్రాలను చూచి వెలిబుచ్చిన ఆనందం సంఘంవారిని ఆశ్చర్యపరచిందనడంలో సందేహము లేదు.

సంఘంవారు మరల బాలలకు మే 14 వ బాల్య స్నేహితులు, చంద్రలోక యాత్ర చిత్రాలను చూపగలిగారు. బాల్య స్నేహితులు అన్న చిత్రం పిల్లలకన్న వారికంట వచ్చిన పెద్దవారిని ఆకర్షించింది.

కనుక బాల ప్రేక్షకులు కార్టూన్ చిత్రాలను అందులోనూ కథతో కూడిన 2 రీళ్ళ చిత్రాలను చూచి ఆనందిస్తున్నారని గమనించి సంఘంవారు అలాంటి చిత్రాలకోసం ప్రయత్నించసాగారు.

అంతకుముందే తెలిసిన [illegible] (ఆలిస్ ఇన్ ది వండర్ లాండ్) మే 29 వ చూపబడినది. కాని అందులోని కథ 10 సం॥ లోపలవారిని ఆకర్షించలేదు. వారికి ఆలిస్ చిన్నదవటం, పెద్దదవటం అర్థము కాలేదు. అనువాదకుని సహాయం తీసుకొన్నా లాభము లేకపోయింది. అయినప్పటికి వారు అసంతృప్తి పొందలేదు.

ఈ అనుభవం 2 రీళ్ళ చిత్రాలపైనే దృష్టి కేంద్రీకరించడానికి దోహదం చేసింది. అయితే బాలల చిత్రాలు మార్కెట్టులో ఎక్కువ దొరకటం లేదు అని చెప్పుకోవాల్సి వచ్చింది.

అందువలన మద్రాసులోని ఇంగ్లీషు కంపెనీలకు ఉత్తరాలు వ్రాశారు. క్రమంగా కార్టూన్ చిత్రాలను [illegible] సహాయం చేయటానికి మరికొన్ని కంపెనీలు ముందుకు వచ్చాయి.

హైదరాబాదు సహాయం లభించగా జూన్ 11 వ యం. జి. యం. వారి టాం - జెర్రీ కార్టూనులు 10 ప్రదర్శించారు. [illegible] చూచి బాల

★ పిల్లల చిత్రాల ప్రదర్శనం ★

ప్రేక్షకులు బాగా ఆనందించారు. బొంబాయిలో బాలల చలన చిత్రోత్సవానికి వివిధ కార్యాలయాలు అందుబాటులో ఉన్నందున అక్కడి సంఘంవారు చిత్రాలను చూచి ఎన్నిక చేయగలిగారు. కాని విజయవాడలో సంఘానికి అట్టి సౌకర్యములు లేవు. చిత్రాల ఎన్నిక అంతా ఉత్తర ప్రత్యుత్తరాల మూలముగా జరగాలి. ఒక కంపెనీ చిత్రాలనుకాని, రాయబార వర్గం చిత్రాలనుకాని, ఒక దఫా ప్రదర్శించాల్సిందేకాని అన్నిటిని కలిపి ఒక ఆటకు సరిపోయినన్ని ఎన్నుకొని ప్రదర్శించటం చాల కష్టం. బాలలు కూడా దీర్ఘ చిత్రాల కంటె చిన్న కార్టూను చిత్రాలను, విజ్ఞానదాయక చిత్రాలను చూచి ఆనందిస్తారని సంఘంవారు గ్రహించారు.

జూలై 6న బాల భారతి వారిచే చిన్న నాటకాల ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. కాని బాలలను అవి అంతగా ఆకర్షించలేదని చెప్పవచ్చును.

జూలై నెలలోనే యం. జి. యం., వార్నర్. యూనివర్సల్ కంపెనీల కార్టూన్ చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి. వీటన్నిటిలో వడ్రంగి పిట్ట కథ పిల్లలను బాగా ఆకర్షించిందని చెప్పవచ్చును. భారత ప్రభుత్వ బహుమతి పొందిన "ఖోఖా" ఇంకా ఇతర కార్టూనులుకూడా జూలైలో చూపబడ్డాయి.

ఈ చిత్రాలన్నీ కూడా పిల్లలను బాగా ఆకర్షిస్తున్నాయి. సంఘంవారు వీలయితే ముందు కూడా ప్రతి వారం చిత్రాలను చూపించాలని ప్రయత్నిస్తున్నారు. ఇంత వరకు పిల్లల చిత్రాలనుగురించిన వివరాలు లేనందున మన దేశములో చిత్రాలకోసం వెదుక్కోవలసివస్తున్నది. ఈ ఆటలకు రేట్లు రు 0-2-0, 0-4-0 పెట్టబడ్డాయి. ప్రదర్శనలు క్రమబద్ధముగ ఏర్పాటు చేస్తే 1000 మందివరకు బెజవాడలో రావచ్చును. ఇతిహాసగాథలతో కూడిన కార్టూనులను చూచి బాల ప్రేక్షకులు ఆనందిస్తారని సంఘంవారి అనుభవాలవలన తేలినది. సోవియట్ కార్టూను చిత్రాలలో ఇతిహాస గాథలు, జానపద కథలు చాల ఉన్నాయి.

కొన్ని సినిమాల కంపెనీలు ఫిలిమ్సు డివిజను వారు క్రొత్తగా ప్రకటించిన ప్రకారము చార్జీ లేకుండా డాక్యుమెంటరీలను ప్రత్యేక ప్రదర్శనలుగా ప్రదర్శకులకు సప్లయి చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం పిల్లల చిత్రాలను క్రమపద్ధతిలో ప్రదర్శించటానికి ప్రోత్సాహం కలుగచేయవచ్చు. అయితే పూర్తిగా డాక్యుమెంటరీలను ప్రదర్శించటంవలన బాల ప్రేక్షకులు ఆకర్షింపబడరు. కనుక నీతికథలకు సంబంధించిన కార్టూనులు కూడ కలిపి చూపాలి.

బాలల చిత్రాలను నిర్మించాలని ప్రభుత్వము 40 లక్షల గ్రాంటుతో ఒక పథకం తయారుచేసింది. శ్రీ వి. ఎస్. వర్మాల్కర్, శాంతారాం, సుబ్రహ్మణ్యం గార్లతో ఒక సంఘం ఏర్పడింది. రాబోయే 5 సం॥లలో 25 దీర్ఘ చిత్రాలు, 35 చిన్న చిత్రాలు నిర్మిస్తారని, ఈ కార్యక్రమము ఫిలిమ్సు డివిజను వారి అజమాయిషీన జరుగుతుందని తెలుస్తున్నది. విజయవాడ బాలచిత్రోత్సవ సంఘం అనుభవాన్ని బట్టి వారానికొకసారి చిత్రాలను చూపాలంటే సుమారు 500 రీళ్లుగల చిత్రాలు ప్రతి సంవత్సరము అవసరమవుతాయి. అందువలన పంపిణీ భారతదేశంలో ఉన్న యితర దేశాల కార్టూనులన్నీ పరిశీలించి ఇతిహాస గాథలకు దగ్గరగా ఉండే కార్టూనులను ఎన్నుకొని "డబ్" చేస్తే బాగుంటుంది. ఇతిహాస గాథలతో కూడిన సోవియట్, అమెరికన్ కార్టూనులు మంచివాటిని ఎన్నుకొని పంపిణీ దేశభాషలలోనికి "డబ్" చేయాలి. కొన్ని దేశీయ తెలుగు బొమ్మల చిత్రాలు కూడ ఉపయుక్తములుగా ఉంటాయి.

ఈ కార్టూనుల పంపిణీ కూడ ఫిలిమ్సు డివిజనువారి ద్వారా జరిగితే ప్రదర్శనలు క్రమపద్ధతిలో ఏర్పాటు చేయటానికి సులభమవుతుంది. పై విషయాన్ని పరిశీలించి ప్రభుత్వంవారు ఒక పథకాన్ని తయారు చేయటం ఎంతైనా అవసరము. అప్పుడే, బాలల చలనచిత్రాల గురించి రోజూ పత్రికలలో చూస్తున్న వార్తలు, పథకాలు, సరిగా అమలుజరుగుతాయి. ★

నేషనల్ ఆర్ట్ థియేటర్సు వారి "జయసింహ"లో రాజనాల, వహీదా రహమాన్.



బొంబాయి సినిమా లేఖ

గత సంవత్సరం ఆగస్టు 15 నుండి ఈ సంవత్సరం ఆగస్టు 15 వరకూ గల మధ్యకాలంలో భారతీయ సినిమా పరిశ్రమ 42 ఏళ్ళ చరిత్రలోనూ ఎన్నడూ ఎరగని విజయం పొందింది. చిత్రాల సంఖ్య ఎక్కువ కానిమాట నిజమే. దీనికి కారణం ఇంత వరకూ పరిశ్రమలో అధిక సంఖ్యాకులుగా ఉంటున్న అనర్హ నిర్మాతలు రంగంనుండి నిష్క్రమించడమే. అర్హులు, సమర్థులూ అయిన నిర్మాతలకే ఇప్పుడు పలుకుబడి ఎక్కువగా ఉన్నది. బెంగాల్, మహారాష్ట్ర, దక్షిణ భారత ప్రాంతాలలో సినిమా పరిశ్రమ బాగా కోలుకున్నది. బొంబాయిలో కూడా అపజయం పొందిన చిత్రాలకంటె విజయం పొందినవే ఎక్కువగా ఉన్నాయి. నిర్మాణ పద్ధతులలో, వ్యయంలో, కాలంలో దూబరా తగ్గి ఒక క్రమపద్ధతి అంటూ ఏర్పడింది. ఇదివరకు ఏళ్ళతరబడి జరిగే చిత్ర నిర్మాణం ఇప్పుడు నాలుగు నెలల్లో జరిగిపోతున్నది. అన్ని విధాలా మెచ్చుకోదగిన చాలా చిత్రాలు 40 షూటింగ్ దినాలకంటె తక్కువ కాలంలోనే తయారవుతున్నవి. విడుదల అయిన మొదటివారంలో బాక్సాఫీస్ రికార్డ్ సృష్టించిన సొహ్రాబ్ మోడీ చిత్రం "కుందన్" అతి స్వల్పకాలంలో నిర్మితమైంది. రజతోత్సవాలు జరుపుకున్న జాగృతి, ఆజాద్ చిత్రాల నిర్మాణ శీఘ్రత పరిశ్రమలో వారందరినీ ఆశ్చర్యపరచింది. ఒక్క ఉరన్ ఖటోలా తప్పిస్తే మిగతా చిత్రాలు నాగిన్, మిస్టర్ ఎండ్ మిసెస్ 55, వచన్, అధికార్, బహుత్ దిన్ హువే, మస్తానా, కవి, శివభక్త, అమానత్, చక్రధారీ, మీర్జా గాలిబ్ మొదలైన బాగా నడిచిన చిత్రాలన్నీ 70 షూటింగ్ దినాలలోపునే నిర్మింపబడినవి. తత్ఫలితంగా నిర్మాణ వ్యయం తగ్గడం, మంచిస్థాయి కనపరచడం, అధిక లాభాలు చేకూరడం, పరిశ్రమ బాగుపడడం జరిగింది.

అభివృద్ధినిరోధక సనాతనవర్గాలు సినిమాలను ఒకవంక దూషిస్తూనే ఉన్నా, ప్రభుత్వం కొంచెం సందేహిస్తూనే సినిమా పరిశ్రమను గణన చెయ్యడం, ఆదరించడం జరిగింది. చిత్రాలకు ప్రభుత్వ బహుమతులూ, చలనచిత్రగోష్ఠిలో ప్రధాని స్వయంగా పాల్గొనడం, సెన్సార్‌షిప్‌ను సంస్కరించడం, బాలచిత్రాలను ప్రోత్సహించడం, ఇంకా మరికొన్ని రాబోయే సంస్కరణలనుబట్టి జాతీయ సినిమాపరిశ్రమపై ప్రభుత్వానికిగల శ్రద్ధ వ్యక్తమవుతున్నది.

అయితే ఇదంతా నాంది మాత్రమే. ముందు జరగవలసింది చాలా ఉంది. చిత్రం మొదలుపెట్టి ఏళ్ళ తరబడి దాని నిర్మాణం సాగించే నిర్మాతలు (కె. ఆసిఫ్—"ముగల్ ఇ ఆజాం") ఇంకా ఉన్నారు. అయితే ఈమాదిరి నిర్మాతలు తమ దృక్పథం మార్చుకుని క్రమపద్ధతికి అలవాటుపడడమో, లేక వచ్చేఆగస్టు 15లోగా రంగంనుండి నిష్క్రమించడమో జరుగుతుందని నా నమ్మకం.

ఈ సంవత్సరాంతంలోగా, భారత ప్రభుత్వం నేషనల్ ఫిలిం బోర్డు, ఫిలిం ఇన్‌స్టిట్యూట్ వగైరాలను స్థాపించవచ్చును. ఫిలిం ఫైనాన్సింగ్ కార్పొరేషనుకు సంబంధించిన ప్రణాళికను త్వరలో పార్లమెంట్‌కు అందజేస్తానని కేంద్రమంత్రి డా॥ బి. వి. కేస్కార్ ఇటీవల తనను కలుసుకున్న స్వతంత్ర చిత్రనిర్మాతల సంఘంవారికి వాగ్దానంచేశారు. ఇవన్నీ జరగవలసిన సంస్కరణలే. కాని స్వార్థపరులైనవారు మాత్రం ప్రభుత్వ ప్రణాళికలను వ్యతిరేకిస్తున్నారు. వారి భయమంతా, తమ బ్లాక్‌మార్కెట్ పద్ధతులు ఎక్కడ అంతరిస్తాయోననే. కాని పరిశ్రమలో అభ్యుదయకాములైనవారంతా ప్రభుత్వం తలపెట్టిన సంస్కరణలను బలపరచగలరని ఆశించవచ్చును.

ఈ యేడాది జరిగిన మరొక మంచిసంఘటన, భారత పాకిస్థాన్ దేశాల మధ్య ఫిలిం వ్యాపార ప్రతిష్టంభన పరిష్కారమై ఒప్పందం జరగడం.

ఇస్మాయిల్ ఫిలిమ్స్‌వారి "జవాబ్"లో హాస్య నటుడు జానీ వాకర్.



బొంబాయి సినిమాలేఖ

మొత్తంమీద చూస్తే మన చిత్రాలు కళా దృష్ట్యా అంతగా అభివృద్ధి చెందలేదనే శంక తొలగటంలేదు. ప్రస్తుత పరిస్థితులలో మన ప్రేక్షకులు ఇప్పటికీ అర్థంలేని వినోదంతో కూడిన చిత్రాలనే అభిమానిస్తున్నారు. ఆలోచనను రేకెత్తించే, వాస్తవిక చిత్రాలు, కళాత్మక చిత్రాలు, సాధారణ ప్రేక్షకుణ్ణి ఆకర్షించడంలేదు. ప్రభుత్వంలోనివారూ, సనాతనవాదులు చిత్ర నిర్మాతలను ఇందుకు తెగనాడుతున్నారు. కాని మన దేశంలో ప్రజల అభిరుచులను తీర్చిదిద్దేవారెవరు? చిత్ర నిర్మాత ఎన్నటికీ కాదు. ఈ బాధ్యత ప్రభుత్వ నాయకుల మీదను, శాసనసభ్యులమీదను ఉన్నది. కళలు, చిత్రాలు, వ్యాపారాలు, నైతిక దృక్పథం, ఆలోచనలు మొదలైనవాటన్నిటిలోను అంతిమ బాధ్యత వహించవలసినది వారే. కనుక వారు వాస్తవిక, ప్రయోజనయుత చిత్రాల ప్రాభవం, ప్రాబల్యం పెరిగేటట్లు ప్రజాభిరుచులను తీర్చిదిద్దవలసి ఉన్నది. చిత్ర నిర్మాతలు వ్యాపారస్థులు. కనుక వారు సామాన్య ప్రజలను ఏదో విధంగా ఆకర్షించే చిత్రాలనే నిర్మిస్తూ వుంటారు.


ప్రజాభిరుచులను సంస్కరించడానికి ప్రభుత్వమూ, రాజకీయ నాయకులు చలనచిత్ర సంఘాలను (ఫిలిం సొసైటీ) ఒక ఉద్యమస్థాయిలో ప్రారంభించాలి. ఈ సందర్భంలో కెనేడియన్ నిపుణుడు జేమ్స్ ఎ. బెవరిడ్జి "ఇండియన్ డాక్యుమెంటరీ" పత్రిక జూలై-సెప్టెంబరు నెలల సంచికలలో వ్రాసిన చక్కని వ్యాసం చాలా ఉపకరిస్తుంది.

"సినిమా ప్రేక్షకులలో మంచి అభిరుచులను పెంపొందించడంలో చలన చిత్ర సంఘాలు చాలా ప్రయోజనకారులు కాగలవనేది అనుభవం వలన తేలిన సత్యం. చలన చిత్ర సంఘోద్యమానికి విశ్వవిద్యాలయాలు, కళాశాలలు మంచి రంగస్థలాలు. యూరప్ కళాశాలల్లో చిత్ర విమర్శనకు, కళాస్వాదనకు ప్రమాణాలను ఏర్పరచడంలో ఈ చలనచిత్ర సంఘాలు ఎనలేని కృషి చేస్తున్నవి. చలన చిత్రాలవలన తమ పిల్లలు చెడిపోతున్నారని ఆందోళనచేసిన 13000 వేలమంది ఢిల్లీ మహిళలు ఈ ఉద్యమ నాయకత్వం వహించి ఎందుకు నడపరాదు" అని ఆయన వ్రాశారు. చిత్రాలపై ఇంకా కఠినమైన సెన్సార్‌షిప్ ఉండాలని ఆందోళన లేవదీసిన 64 మంది పార్లమెంటు సభ్యులు దేశమంతటా ఈ చలనచిత్ర సంఘోద్యమం వ్యాపింపజేయడానికి ప్రయత్నం చేయడం ఉత్తమం.

ఇన్సానియత్

జెమినీవారి "ఇన్సానియత్" సెప్టెంబరు ఆఖరులో విడుదల అవుతుంది. నిర్మాత, దర్శకుడు ఎస్. ఎస్. వాసన్. దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్, జయంత్, మోహనా, విజయలక్ష్మి, బీనారాయ్, ఆగా, హాలీవుడ్ కోతి జిప్పీ నటించిన ఈ చిత్రానికి సి. రామచంద్ర చక్కని సంగీతం సమకూర్చారు.

(ఆంధ్రవారపత్రిక విలేఖరి) ★



మద్రాసు, ఓడియన్‌లో విడుదలకానున్న పారమౌంట్ చిత్రం "మంబో"లో సిల్వానా మాంగానో, విట్టోరియో గాస్‌మన్.

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor: S. Sambhu Prasad.



మౌక్తికం —ఫోటో : కె. వి. సోమయాజులు, కాకినాడ.